
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 8-11-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 220 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి రా. 11.57 తదుపరి అష్టమి; నక్షత్రం: ఉత్తరాషాఢ మ. 12.03 తదుపరి శ్రవణం; వర్జ్యం: సా.4.00-5.35, దుర్ముహూర్తం: ఉ.8.35-9.20, మ.12.21-1.06, అమృతఘడియలు: రా.1.30-3.05, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.20, సూర్యాస్తమయం: 5.37 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


తెలంగాణ ప్రగతి మహారథి
గౌ॥ముఖ్యమంత్రివర్యులు
శ్రీ ఎనుముల రేవంత్‌రెడ్డి గారికి
జన్మదిన
శుభాకాంక్షలు
పిఎస్ రెడ్డి
కాంగ్రెస్ పార్టీ నాయకులు
డా॥సి.రోహిన్ రెడ్డి
డీసీసీ ఖైరతాబాద్ అధ్యక్షులు



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



మీ ధ్రువపత్రాలు చెల్లవ్

ఖమ్మంలో ఏడుగురు హెచ్‌పీటీల తొలగింపు

20 రోజులు విధులు నిర్వహించాక వేటు

రాత్రికి రాత్రే వేరే టీచర్లతో వారి స్థానాల భర్తీ

ఇది అన్యాయం: బాధిత ఉపాధ్యాయులు **13**

శుక్రవారం | 8-11-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 220 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి రా. 11.57 తదుపరి అష్టమి; నక్షత్రం: ఉత్తరాషాఢ మ. 12.03 తదుపరి శ్రవణం; వర్జ్యం: సా.4.00-5.35, దుర్ముహూర్తం: ఉ.8.35-9.20, మ.12.21-1.06, అమృతఘడియలు: రా.1.30-3.05, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.20, సూర్యాస్తమయం: 5.37 | వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జైలుకెళ్లేందుకు నేను సిద్ధం

అక్కడ యోగా.. బయటకొచ్చి పాదయాత్ర చేస్తా

ఫార్ములా-ఈలో ఎలాంటి తప్పూ చేయలేదు

విచారణకు గవర్నర్ అనుమతిస్తే స్వాగతిస్తా

'ఫార్ములా'పై చంద్రబాబు కలను మేం నెరవేర్చాం

కేసీఆర్, నేను నిధుల విడుదలకు ప్రతిపాదించాం

రేసు రద్దు చేసిన రేవంత్‌పైనే కేసు పెట్టాలి:కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసులకు సంబంధించి నిధుల విడుదలలో ఏ తప్పూ జరగలేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అయినా తనను జైల్లో పెట్టి సీఎం రేవంత్ పైశాచికానందం పొందాలనుకుంటే అందుకు సిద్ధమని ప్రకటించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. "జైల్లో ఉంటే ఏమవుతుంది? అక్కడ యోగా చేసి బయటకు వస్తా. తర్వాత పాదయాత్ర చేపడతా" అన్నారు. హైదరాబాద్‌లో ఫార్ములా-1 రేస్ కోసం 2003లోనే అప్పటి సీఎం చంద్రబాబు ప్రయత్నించారని గుర్తు చేశారు. సంస్థ సీఈఓను కూడా కలిశారని చెప్పారు. గోపన్‌పల్లి దగ్గర భూమి సైతం కేటాయించారని ప్రస్తావించారు. తాము అధికారంలోకి వచ్చాక ఫార్ములా వన్ రేసింగ్ కోసం ప్రయత్నించానని, సాధ్యపడలేదని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించినట్లుగా ఉంటుందని కష్టపడి ఫార్ములా-ఈ రేసింగ్‌ను ఏర్పాటు చేశామని

మిగతా 3వ పేజీలో...

త్వరలో అణుబాంబు పేలనుంది

తప్పు చేసిన బీఆర్ఎస్ నేతలను వదిలిపెట్టం: పొంగులేటి **3**

సాగు భూముల రిజిస్ట్రేషన్ల అధికారం

డీటీల చేతికి!

డిప్యూటీ తహసీల్దార్లకు

అప్పగించే యోచనలో రాష్ట్ర సర్కారు!

అప్పిలేట్ అధికారం కలెక్టర్‌కు

కొత్త ఆర్వోఆర్ చట్టంలో ప్రతిపాదన

అమలుపై ఈ నెల 11న సీఎం సమీక్ష

అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో బిల్లు!



హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ అధికారం నాయిబ్(డిప్యూటీ) తహసీల్దార్లకు దఖలు పడనుందా? ప్రభుత్వంలోని విశ్వసనీయవర్గాలు ఈ ప్రశ్నకు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న 'తెలంగాణ పట్టాదారు పాస్‌పుస్తకాలు, యాజమాన్య హక్కుల చట్టం 2020' ప్రకారం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ అధికారం తహసీల్దార్లకు మాత్రమే ఉంది. దాని స్థానంలో ప్రభుత్వం తీసుకురానున్న 'ఆర్వోఆర్-2024' చట్టంలో నాయిబ్ తహసీల్దార్లకు ఆ అధికారాన్ని ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై అభిప్రాయాలను క్రోడీకరించిన అధికారులు ముసాయిదా ప్రతిని సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. తహసీల్దార్లు మండలమంతా పర్యటించాల్సి ఉండటం, వారికి ఇప్పటికే పలు రకాల బాధ్యతలు ఉండటం, వారిపై పని ఒత్తిడి.. వంటివాటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. నాయిబ్ తహసీల్దార్లు కార్యాలయ వ్యవహారాలకే పరిమితమై ఉంటున్నందున, వారి చేతిలో రిజిస్ట్రేషన్ బాధ్యతలను పెడితే.. రైతులకు అందుబాటులో ఉంటారనే అభిప్రాయంలో ప్రభుత్వం ఉంది. వారు తీసుకున్న నిర్ణయాలపై అభ్యంతరాలు ఉంటే అప్పీల్ చేసుకునే వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావించింది. అప్పిలేట్ అధికారాలను కలెక్టర్ లేదా జేసీ పరిధిలో పెడుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు పాత రెవెన్యూ విధానంలో ఉన్నట్లు జాయింట్ కలెక్టర్ల వ్యవస్థను పునరుద్ధరించే యోచనలో ప్రభుత్వం ఉంది. అందులో భాగంగానే ఇటీవల సుమారు 40 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు సెలక్షన్ గ్రేడ్ ఇస్తూ నిర్ణయం తీసుకుంది. అప్పీల్ 1 ఆర్డీవో పరిధిలో, అప్పీల్ 2 జేసీ లేదా కలెక్టర్ పరిధిలో ఉండాలని తహసీల్దార్లు కోరుతున్నప్పటికీ.. కొత్త చట్టంలో అప్పీల్ అధికారాన్ని కలెక్టర్/జేసీ పరిధిలో ఉంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. కాగా, కొత్త చట్టం ప్రకారం.. వీలునామాలు, వారసత్వ పంపకాల విషయంలో తహసీల్దారు పరిధిలో విచారణ తప్పనిసరి. విచారణ లేకుండా మ్యుటేషన్‌కు అవకాశం లేదు. ప్రస్తుత చట్టం ప్రకారం మ్యుటేషన్‌కు ముందు విచారణకు అవకాశం లేదు. అలాగే.. రైతులు ఎదుర్కొంటున్న పాస్ పుస్తకాల సమస్య, సర్వే, సవరణల కోసం చేసుకునే దరఖాస్తుల్లో పొరపాట్లు ఉంటే తిరస్కరించడం వంటి 45 రకాల సమస్యలకు

మిగతా 13వ పేజీలో...

వద్దొద్దంటున్నా.. మళ్లీ ఆర్ఎంసీ!

'జలాశయ కమిటీ' పునరుద్ధరణ

వరద నీటిని వినియోగం కింద

చూడొద్దనేదే ప్రధాన అజెండా

కృష్ణా బోర్డు అత్యుత్సాహం **11**

తెలంగాణ విజ్ఞప్తులు బేఖాతరు



సిరిసిల్ల చేనేత కళాకారుడు హరిప్రసాద్ మగ్గంపై నేసిన సీఎం రేవంత్ చిత్రం

'మూసీ పునరుజ్జీవం'పై నేడు యాత్ర

పుట్టినరోజున సంగెం - మూసీ మధ్య 2.5 కి.మీ. సీఎం పాదయాత్ర

ప్రాజెక్టుపై ప్రజలకు వివరణ.. సంకల్ప రథం పైనుంచి ప్రసంగం

కుటుంబంతో యాదగిరిగుట్టలో పూజలు.. ఆలయ అభివృద్ధిపై సమీక్ష

హైదరాబాద్/యాదాద్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృఢసంకల్పంతో ఉన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకే వెళతామని వివిధ వేదికలపై స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా ఏకంగా మూసీ వెంట పాదయాత్ర చేయాలని నిర్ణయించారు. దానికి 'మూసీ పునరుజ్జీవన సంకల్ప యాత్ర'గా నామకరణం చేశారు. మూసీ నది కాలుష్యం కారణంగా పరీవాహక గ్రామాల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకోనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ పాదయాత్ర చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు చేయబోయే పాదయాత్రలో మూసీ పరీవాహక ప్రజలు, రైతుల సమస్యలను తెలుసుకోనున్నారు. అసలు మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు ఎందుకు చేపట్టాలి? దాని వల్ల కలిగే ప్రయోజనాలేంటి? భవిష్యత్తు ఎలా ఉంటుంది? అనే విషయాలను ప్రజలకు వివరిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కుటుంబ సమేతంగా యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని దర్శించుకొని, ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. సీఎం రేవంత్ శుక్రవారం ఉదయం 9 గంటలకు బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు వెళతారు. ఉదయం 10 గంటలకు లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజల్లో

మిగతా 13వ పేజీలో...



ఈ పాపం ఎవరిది?

పది రోజులుగా తిండి లేక

ఎనిమిది వీధి కుక్కల మృతి

కొనఊపిరితో మరో 12

కు.ని శస్త్రచికిత్సకు ఆస్పత్రికి..

సిబ్బంది తొలగింపుతో **11**

పట్టించుకునే వారు కరువు

మంచిర్యాల పశు సంరక్షణ కేంద్రంలో దారుణం



9

తప్పుడు పోస్టులు పెడితే వేటు వేస్తాం

వైసీపీ సైకోలకు వాత ఖాయం..

చట్టాలను క్షుణ్నంగా పరిశీలిస్తాం

వ్యక్తులు, కుటుంబాలను లక్ష్యంగా

చేసుకుంటే కఠిన చర్యలు తప్పవు

24 క్లెమోర్‌మైన్లు పేలినా లెక్కచేయలే

నా భార్యపై మాట్లాడితే కన్నీళ్లొచ్చాయ్

ఇలాంటి వాళ్లను ఇంకా సహించాలా

ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

మత విశ్వాసులతో కలిసి పనిచేద్దాం **2**

'ఆర్ఎస్ఎస్'లా చొచ్చుకెళదాం

మతంపై మినహాయింపు అవసరం

రాజకీయ ముసాయిదాలో సీపీఎం

ఉద్యోగాల భర్తీ నిబంధనలు

మధ్యలో మార్చకూడదు

నోటిఫికేషన్‌లో పేర్కొన్న

అర్హతలకు చట్టబద్ధత ఉంది

ఖాళీలు ఉన్నప్పుడు

ఉద్యోగాలు కాదనకూడదు

జాబితాలో పేరుంటే ఉద్యోగం

పొందే హక్కు ఉన్నట్టు కాదు

సహేతుక కారణాలు ఉంటే

మాత్రం సవరించుకోవచ్చు

సుప్రీంకోర్టు రాజ్యాంగ

ధర్మాసనం తీర్పు



న్యూఢిల్లీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదలయిన తరువాత మధ్యలో నిబంధనలు మార్చకూడదని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రత్యేకంగా అనుమతి ఉంటే తప్ప మధ్యలో నిబంధనలు మార్చేందుకు అవకాశం లేదని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ హృషీకేశ్ రాయ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన అయిదుగురు సభ్యుల

మిగతా 2వ పేజీలో...



సంస్థాగత ఎన్నికల వర్క్‌షాపులో ఎంపీ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ రాష్ట్రాలు దివాలా

ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేదు

తెలంగాణలో సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత

ఏ ఒక్క గ్యారెంటీని నిలబెట్టుకోని ప్రభుత్వం

ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం పూర్తి అండ

బీజేపీ సంస్థాగత ఎన్నికల

వర్క్‌షాప్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ఆర్థికంగా దివాలా తీశాయని, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి తెలిపారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆయా రాష్ట్రాల ప్రజలకు

మిగతా 13వ పేజీలో...

సర్కారీ లాలన **13**

గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వ 'క్రెష్'లు

రెండున్నరేళ్లలోపు పిల్లల సంరక్షణే లక్ష్యం

తల్లులు ఉపాధి కోల్పోకుండా చర్యలు

అంగన్‌వాడీ మాదిరి ఇద్దరితో నిర్వహణ

త్వరలో నోటిఫికేషన్.. సిబ్బంది భర్తీ





ట్రంప్ ప్రచారంలో కీలకంగా భారతీయులు

» పలువురికి పదవులు ఇచ్చే అవకాశం

న్యూఢిల్లీ, నవంబరు 7: డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రెండో సారి గెలవడంలో పలువురు భారతీయులు కీలక పాత్ర పోషించారు. ఈసారి ఎన్నికల్లో సెలబ్రిటీలు, ధనవంతులు ఎక్కువగా డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్‌కే మద్దతు పలికిన నేపథ్యంలో ట్రంప్‌కు ప్రవాస భారతీయుల మద్దతు బాగా కలిసి వచ్చింది. ముఖ్యంగా వివేక్ రామస్వామి లాంటి వారు ట్రంప్‌కు దన్నుగా నిలబడ్డారు. ట్రంప్ గెలిచిన నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో ఆయన కోసం పని చేసిన భారతీయుల్లో కొందరికి పదవులు ఇవ్వొచ్చని ప్రచారం జరుగుతోంది. వారిలో ముఖ్యులు...



వివేక్ రామస్వామి(38): బయోటెక్ వ్యాపారంలో ఉన్నారు. ఆయన మొదట రిపబ్లికన్లలో అధ్యక్ష అభ్యర్థిగా అవకాశం కోసం ట్రంప్‌పై పోటీ పడ్డారు. ట్రంప్‌కు ప్రధాన పోటీదారుగా నిలిచారు. పార్టీ అభ్యర్థిగా ట్రంప్ పేరు ఖరారైన వెంటనే ఆయనకు గట్టి మద్దతుదారుగా మారారు. నిస్సంకోచంగా మాట్లాడే రామస్వామి వాదనా పటిమ చూసి ట్రంప్ తాను గెలిచిన తర్వాత ఆయనకు మంచి పదవి ఇస్తానని ప్రకటించారు. రామస్వామి సూచనతోనే ప్రపంచ వ్యాప్తంగా హిందువుల గురించి మాట్లాడారని భావిస్తున్నారు.



కశ్యప్ పటేల్(44): ఆఫ్రికా నుంచి అమెరికాకు వలస వచ్చిన గుజరాతీ కుటుంబం. న్యాయశాఖ ఉద్యోగి. 2016 ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందన్న ఆరోపణలపై దర్యాప్తు చేసిన అమెరికా ప్రతినిధుల సభ కమిటీ సభ్యుడు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా చేపట్టిన ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్లలో తెరవెనుక కీలక పాత్ర పోషించారు. ప్రపంచ రాజకీయాల్లో ట్రంప్ ప్రాధాన్యతలు బాగా తెలిసినవాడు. ఆయనకు సీఐఏ చీఫ్ బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం జరుగుతోంది.



బాబీ జిందాల్(53): లూసియానా రాష్ట్ర గవర్నర్‌గా గతంలో పని చేశారు. అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడుగా కూడా పని చేశారు. 2015లో రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీ పడతానని ప్రకటించి మధ్యలో విరమించుకున్నారు. ఈసారి మొదట్నుంచీ ట్రంప్ మద్దతుగా నిలిచారు. ఆయనకు ఆరోగ్య శాఖ ఇస్తారని ప్రచారం జరుగుతోంది.



నిక్కీ హేలీ(52): ఈమె కూడా ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిత్వం కోసం ట్రంప్‌తో పోటీ పడ్డారు. గత మార్చిలో పోటీ నుంచి విరమించుకొని ట్రంప్‌కు మద్దతు పలికారు. హేలీ సౌత్ కరోలినా రాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారు. ట్రంప్ ప్రభుత్వంలో అమెరికా తరఫున ఐరాసలో రాయబారిగా పనిచేశారు. పలు వివాదాస్పద నిర్ణయాలకు కేంద్ర బిందువుగా నిలిచారు.



సతీశ్ వేమన(52): నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్(తానా) మాజీ అధ్యక్షుడు అయిన సతీశ్ వేమన ట్రంప్ ప్రచార బృందంలో సభ్యుడు. న్యూయార్క్ ట్రంప్ ర్యాలీలో పాల్గొన్న 30 మంది కీలక నేతల్లో ఒకరు. ట్రంప్ విజయంలో రెండు రాష్ట్రాల తెలుగు ప్రవాసులు కీలక పాత్ర పోషించారని సతీశ్ అంటారు. ఉభయ రాష్ట్రాలకు అమెరికా పెట్టుబడులు తేవడానికి కృషి చేస్తామని అన్నారు. ట్రంప్ ఈసారి ఇండియా వచ్చినపుడు హైదరాబాద్ సందర్శించే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటమిని అంగీకరిస్తున్నా.. కానీ పోరాటం ఆపను

అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిపై కమలా హ్యారిస్



వాషింగ్టన్, నవంబరు 7: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని అంగీకరిస్తున్నానని, అయితే.. తన పోరాటాన్ని మాత్రం ఆపేది లేదని డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్ అన్నారు. ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో పోటీపడిన కమల ఓటమి అనంతరం తొలిసారి స్పందించారు. వాషింగ్టన్ డీసీలోని హోవర్డ్ యూనివర్సిటీలో తన మద్దతుదారులను ఉద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. 'ఇది మనం కోరుకున్న ఫలితం కాదు. మనం పోరాడింది దీనికోసం కాదు. కానీ.. ఓటమిని అంగీకరించాల్సిందే. అయితే.. ఈ ఎన్నికల్లో పోటీపడిన తీరుపట్ల గర్వంగా ఉంది. మీరు నాపై ఉంచిన నమ్మకానికి, ఈ దేశం పట్ల చూపించిన ప్రేమకు, సంకల్పానికి నా మనస్సు కృతజ్ఞతతో నిండిపోయింది. అమెరికా ప్రజలందరి స్వేచ్ఛ, న్యాయం, అవకాశాలు,గౌరవం కోసం పోరాటం కొనసాగిస్తాను' అని చెప్పారు. కాగా, కమలా హారిస్.. నిజాయితీ, ధైర్యం, వ్యక్తిత్వం నిండిన గొప్ప ప్రజాసేవకురాలు అని అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ అని కొనియాడారు. అసాధారణ పరిస్థితుల్లోనూ ఆమె చారిత్రక ప్రచారానికి నేతృత్వం వహించారని, అమెరికన్లందరికీ చాంపియన్‌గా నిలుస్తారని పేర్కొన్నారు.

ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు

ఫిలడెల్ఫియా, షికాగోలో ట్రంప్ విజయంపట్ల పలువురు నిరసన తెలుపుతున్నారు. ఆయనకు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించారు. మహిళల పునరుత్పత్తి హక్కులు, ట్రాన్స్‌జెండర్ల హక్కులు, తుపాకీ చట్టాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ స్క్వేర్ వద్ద ఓ మహిళ 'ఫిలడెల్ఫియాలో ఫాసిజాన్ని స్వాగతించేది లేదు' అనే ప్లకార్డుతో నిరసన తెలిపారు.

ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

పలు దేశాధినేతలతో ట్రంప్‌నకు సన్నిహిత సంబంధాలు.. తొలి వరుసలో మోదీ

» ఉక్రెయిన్‌కు, ఇరాన్‌కు కష్టకాలం

» ఇకపై చైనా వ్యాపారానికి అడ్డంకులు

న్యూఢిల్లీ, నవంబరు 7: నాలుగేళ్ల తర్వాత శ్వేతసౌధంలోకి డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అధ్యక్షుడిగా అడుగు పెట్టబోతున్నారు. ప్రపంచ దేశాలతో అగ్రరాజ్యం సంబంధాలు ఎలా ఉండబోతున్నాయి? ట్రంప్ రాక ఎవరికి అనుకూలం.. ఎవరికి వ్యతిరేకం? గతంలో ప్రపంచ నేతలతో ఆయన సంబంధాలు ఎలా నెరిపారు? ఇప్పుడు ఎలా ఉండబోతున్నారు? ఆయన తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికవ్వడంతో భారత్‌తో పాటు మరికొన్ని దేశాలు గెలిచినట్లే అని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్‌లో ఇతర దేశాలతో అమెరికా సంబంధాలు, ఆయా దేశాలకు ప్రయోజనాలు ఎలా ఉండబోతున్నాయనే దానిపై అంచనా వేస్తున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, సౌదీ అరేబియా ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ లాంటి వారితో సత్సంబంధాల కారణంగా వారితో సున్నితంగానే వ్యవహరిస్తారని, అలాగే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు లాంటి వారికి మద్దతుగాను ఉంటారని భావిస్తున్నారు. ట్రంప్ గెలుపు నేపథ్యంలో సానుకూలమయ్యే, కష్టకాలం ఎదుర్కొనే దేశాధినేతలను ఓ సారి చూస్తే..

నరేంద్ర మోదీ (భారత ప్రధాని): గతంలో ట్రంప్‌తో ఉన్న సంబంధాల పరంగా ఇప్పుడు ఆయన గెలుపు నరేంద్ర మోదీకి సానుకూలమైన విషయం. అప్పట్లో ఒకర్ని ఒకరు బహిరంగంగానే పొగడ్తల్లో ముంచెత్తుకునేవారు. చాలా ఏళ్లుగా వ్యక్తిగతంగా సంబంధాలు కూడా కొనసాగిస్తున్నారు. ట్రంప్ పాలసీల కారణంగా లాభపడే దేశాల జాబితాలో భారత్ అనుకూలమైన స్థానంలోనే ఉండవచ్చు. ఇంధన, రక్షణ రంగాల్లో భారత్‌కు రష్యా ఓ ప్రధాన భాగస్వామి. ఇక రష్యాతో శాంతి ఒప్పందానికి మొగ్గు చూపే ట్రంప్.. భారత్, రష్యా సంబంధాలకు అడ్డు చెప్పకపోవచ్చు. గతంలో మోదీ.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కలిస్తే జో బైడెన్ సర్కార్‌కు రుచించలేదు. మరోవైపు భారత్‌పై కెనడా చేస్తున్న ఆరోపణలకు కూడా ట్రంప్



మద్దతు ఉండకపోవచ్చు.

జిన్‌పింగ్ (చైనా అధ్యక్షుడు): ట్రంప్ విజయంతో చైనాకు ఆర్థికంగా కష్టకాలం మొదలైనట్లే. చైనా వస్తువులపై 60% టారిఫ్ విధిస్తామనే అంశం ఆ దేశ ఎకానమీకి పెద్ద దెబ్బ. అయితే సానుకూల అంశం ఏమిటంటే.. చైనాతో ఎలాన్ మస్క్‌కు గట్టి వ్యాపార సంబంధాలు ఉండటం. కానీ తైవాన్‌కు బాసటగా ఉండే విషయానికి వస్తే.. ఇది అమెరికా, చైనా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది.

వ్లాదిమిర్ పుతిన్ (రష్యా అధ్యక్షుడు): ట్రంప్‌ది 'అమెరికా ఫస్ట్' పాలసీ కావడంతో నాటోలో చీలికలు వస్తాయని, ఉక్రెయిన్‌కు సహకారం ఆగిపోతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ తిరిగి రావడం పుతిన్‌కు అనుకూల అంశంగా మారే అవకాశం ఉంది.

వోలోదిమిర్ జెలెన్‌స్కీ (ఉక్రెయిన్ అధ్యక్షుడు): ట్రంప్ గెలుపు ఎవరికి పెద్ద దెబ్బ అని చెప్పాలంటే.. అది జెలెన్‌స్కీకి అని చెప్పక తప్పదు. రష్యాతో శాంతి చర్చల్లో భాగంగా అమెరికా తమపై ఆంక్షలు పెట్టవచ్చని, అలాగే ఆర్థిక, సైనిక సహకారం తగ్గించవచ్చని ఉక్రెయిన్ భయపడుతోంది. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు మద్దతుగా బైడెన్ ఉండగా.. 24 గంటల్లో యుద్ధాన్ని నిలువరిస్తానని ట్రంప్ హామీ ఇవ్వడం ఆయన ప్రాధాన్యతలను సూచిస్తోంది.

మసౌద్ పెజెష్కియాన్ (ఇరాన్ అధ్యక్షుడు): తమ అణు కార్యక్రమాలను దౌత్యపరంగా అమెరికా అణగదొక్కుతుందని ఇరాన్ భయపడుతోంది. ఇజ్రాయెల్‌తో స్నేహసంబంధాల కారణంగా మొదటి టర్మ్‌లో ట్రంప్ ఇరాన్‌పై సాధ్యమైనంత ఒత్తిడి తెచ్చారు. ఇప్పుడు ఆంక్షలను మరింత పెంచడం ద్వారా ఇరాన్‌ను ట్రంప్ ఒంటరి చేసే అవకాశం ఉంది.

ట్రంప్ విజయంతో 'బంగ్లా'లో మారుతున్న సమీకరణాలు

» తనను తాను బంగ్లా ప్రధానిగా పేర్కొంటూ ట్రంప్‌కు హసీనా లేఖ



న్యూఢిల్లీ, నవంబరు 7: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో బంగ్లా దేశ్‌లో సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. విద్యార్థి సంఘాలు చేపట్టిన రిజర్వేషన్ల వ్యతిరేక పోరు హింసాత్మకంగా మారడంతో బలవంతంగా గద్దె దిగి ఆగస్టులో భారత్ చేరుకున్న షేక్ హసీనా మరోసారి తెరపైకి రానున్నారు. ట్రంప్‌ను అభినందిస్తూ ఆమె లేఖ రాశారు. లేఖలో తనను తాను బంగ్లాదేశ్ ప్రధానిగా ప్రకటించు కున్న హసీనా.. ట్రంప్ నాయకత్వ లక్షణాలను ప్రశంసించారు. ట్రంప్ నేతృత్వంలో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేద్దామని లేఖలో ప్రస్తావించారు. హసీనా రాసిన ఈ లేఖను ఆమె పార్టీ అవామీ లీగ్ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసింది. బైడెన్ పాలనా యంత్రాంగం కుట్ర వల్లే తాను బంగ్లాను వీడాల్సి వచ్చిందని హసీనా గతంలో అనేకసార్లు ఆరోపించిన విషయం తెలిసిందే.

లోకం తీరు



10 లక్షల మందిని తిప్పి పంపనున్న కెనడా

» వీసా విధానం సమూల ప్రక్షాళన

» పదేళ్ల టూరిస్టు వీసాలు రద్దు

న్యూఢిల్లీ, నవంబరు 7: కెనడా ప్రభుత్వం వీసా విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేసింది. వీసా గడువు ముగిసిందన్న కారణంతో పది లక్షల మందిని స్వదేశాలకు తప్పి పంపనుంది. అవసరమైతే వారిని బలవంతంగానైనా పంపించాలని యోచిస్తోంది. ప్రక్షాళనలో భాగంగా పదేళ్ల కాలపరిమితి ఉన్న టూరిస్టు వీసాలను రద్దు చేసింది. కెనడాకు నేరుగా వచ్చే సింగిల్ ఎంట్రీ వీసా, తొలుత ఇతర దేశాలకు వెళ్లి అక్కడి నుంచి కెనడాకు వచ్చే మల్టీపుల్ ఎంట్రీ విధానంలోనూ మార్పులు చేసింది. ఈ విషయంలో ఆయా సందర్భాలు, వ్యక్తులను బట్టి నిర్ణయాలను తీసుకునే విచక్షణ అధికారాన్ని అధికారులకు కట్టబెట్టింది. ఇంతవరకు ఎవరైనా తొలుత ఇతర దేశాలకు వెళ్లి అక్కడ నుంచి కెనడాకు వచ్చి పదేళ్ల పాటుగానీ, బయోమెట్రిక్ ముగిసిపోయే వరకుగానీ ఉండేందుకు అవకాశం ఉండగా ఇప్పుడు ఆ విధానాన్ని రద్దు చేసింది. అందువల్ల తాత్కాలిక ప్రాతిపదికన కెనడాలో నివసిస్తున్న పది లక్షల మంది దేశం విడిచి వెళ్లవలసి వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఒకవేళ వెళ్లడానికి ఇష్టపడని వారిని బలవంతంగా పంపిస్తామని వలసల మంత్రి మార్క్ మిల్లర్ చెప్పారు. జీవన వ్యయం పెరగడం, ఇళ్ల కొరత ఏర్పడడంతో కెనడా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది.

ఆస్ట్రేలియా టుడేపై కెనడా నిషేధం

భారతీయ సంతతి వ్యక్తులు నిర్వహిస్తున్న సోషల్ మీడియా ఆస్ట్రేలియా టుడేపై కెనడా ప్రభుత్వ నిషేధం విధించింది. భారత విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్, కెనడా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌ల విలేకరుల సమావేశాలను ప్రసారం చేసిన కొద్ది గంటల్లోనే ఈ నిర్ణయం తీసుకొంది.



ఏఐతో రూపొందించిన 'లాయర్'తో మాట్లాడుతున్న సీజేఐ చంద్రచూడ్

కృత్రిమ మేధ లాయర్‌తో సీజేఐ!

» పరీక్షించిన జస్టిస్ చంద్రచూడ్

» మరణశిక్ష భారత్‌లో రాజ్యాంగబద్ధమేనంటూ లాయర్ జవాబు

న్యూఢిల్లీ, నవంబరు 7: కోర్టు హాలులో న్యాయవాదుల వాదనల్లోని మంచిచెడులను బేరీజు వేసే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్.. ఈసారి ఓ కృత్రిమమేధ(ఏఐ)తో కూడిన లాయర్ వాదనలను పరీక్షించారు. గురువారం ఢిల్లీలో 'నేషనల్ జ్యుడీషియల్ మ్యూజియం, ఆర్కైవ్స్' ప్రారంభోత్సవ కార్యక్రమం దీనికి వేదికగా నిలిచింది. ఈ మ్యూజియంను ప్రారంభించిన సందర్భంగా.. కృత్రిమమేధతో రూపొందించిన లాయర్‌తో సీజేఐ మాటలు కలిపారు. 'భారత్‌లో మరణశిక్ష రాజ్యాంగబద్ధమేనా?' అని ప్రశ్నించారు. దీనికి ఆ 'న్యాయవాది' సమాధానం చెబుతూ.. 'భారత్‌లో మరణశిక్ష రాజ్యాంగబద్ధమే. అత్యంత దారుణమైన నేరాలకు సంబంధించిన అరుదైన కేసుల్లో సుప్రీంకోర్టు మరణశిక్ష విధిస్తుంది' అని చెప్పారు. ఈ జవాబు విని సీజేఐ చిరునవ్వుతో తలపంకించారు. జస్టిస్ చంద్రచూడ్‌ను పోలిన విధంగానే సదరు కృత్రిమమేధ లాయర్‌ను రూపొందించటం విశేషం. మ్యూజియం ప్రారంభోత్సవం సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు పాటించే విలువలను ప్రతిబింబించే విధంగా మ్యూజియం ఉందని ప్రశంసించారు. కాగా, జ్యుడీషియల్ మ్యూజియం ఏర్పాటుపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అసంతృప్తితో ఉంది. మ్యూజియం బదులు, ఆ ప్రదేశంలో న్యాయవాదుల కోసం ఒక లైబ్రరీని, కెఫెటేరియాను ఏర్పాటు చేయాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. కానీ, సీజేఐ అందుకు అంగీకరించలేదు. మరోవైపు, కొత్త సీజేఐగా సంజీవ్‌ఖన్నా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి లంచాలు

ఇదీ మహారాజులు, నవాబుల బాగోతం

» రాహుల్‌గాంధీ వ్యాసంపై రాజకీయ దుమారం

» మండిపడిన రాజవంశీయ బీజేపీ నేతలు

న్యూఢిల్లీ/ముంబై, నవంబరు7: విధేయులైన మహారాజులు, నవాబులకు లంచాలు ఇవ్వడం, వారిపై బెదిరింపులకు పాల్పడటం ద్వారా ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశాన్ని అణచివేసిందంటూ కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ రాసిన వ్యాసం రాజకీయదుమారం రేపింది. ఈ వ్యాసం బుధవారం ఓ ఆంగ్ల పత్రికలో ప్రచురితమైంది. దీన్ని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా సహా రాజకుటుంబాలకు చెందిన బీజేపీనేతలు తీవ్రంగా ఖండించారు. విద్వేషాన్ని ప్రేరేపించేవారికి దేశగౌరవం, చరిత్ర గురించి ఉపన్యాసాలు ఇచ్చే హక్కులేదని సింధియా మండిపడ్డారు. నాటి రాజుల త్యాగాలతోనే సమగ్ర భారతదేశం కల నెరవేరిందని రాజస్థాన్ ఉపముఖ్యమంత్రి దివ్యకుమారి 'ఎక్స్'లో స్పష్టంచేశారు. భారతదేశం కోసం నాటి రాజ కుటుంబాలు చేసిన త్యాగాలపై రాహుల్‌గాంధీలోని అజ్ఞానం ఆ వ్యాసం ద్వారా బట్టబయలైందని లోక్‌సభ సభ్యుడు యదువీర్ వడియార్ 'ఎక్స్'లో విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా నిర్ధారణకు రావొద్దని రాహుల్‌కు బీజేపీ హితవు పలికింది. రాహుల్ వ్యాసం చదివితే నవ్వొస్తోందని కేంద్ర మాజీ మంత్రి స్మృతీ ఇరానీ పేర్కొన్నారు. కాగా ఈస్టిండియా కంపెనీకి సింధియా రాజులు మద్దతిచ్చిన విషయం అందరికీ తెలుసని కాంగ్రెస్ మీడియా-పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడు పవన్‌ఖేరా ఎద్దేవా చేశారు. బీజేపీనేతల విమర్శలపై రాహుల్ స్పందించారు. వ్యాపారాలను తాను వ్యతిరేకిస్తున్నట్టు బీజేపీనేతలు ప్రచారం చేస్తున్నారని, తాను గుత్తాధిపత్యానికి మాత్రమే వ్యతిరేకమని 'ఎక్స్'లో స్పష్టంచేశారు. కాగా రాజ్యాంగాన్ని కాపాడాలంటూ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో రాహుల్‌గాంధీ నిర్వహించిన సభపై బీజేపీ మండిపడింది. ఆ సభలో కేవలం తెల్లపేపర్లతో కూడిన రాజ్యాంగం కాపీలను రాహుల్ పంపిణీ చేశారంటూ విమర్శించింది.

ఇజ్రాయెల్ దాడులు.. లెబనాన్‌లో 40 మంది మృతి

బీరుట్, నవంబరు 7: ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల్లో 40 మంది పాలస్తీనీయులు మృతిచెందినట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. బుధవారం బెకా లోయలోని బాల్బెక్‌లో ఈ దాడులు జరిగాయని, 40 మంది మృతిచెందగా.. 53 మంది క్షతగాత్రులైనట్లు తెలిపింది. గత ఏడాది కాలంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల కారణంగా 3 వేల మంది పౌరులు మృతిచెందారని హిజ్బుల్లా చీఫ్ నయీం ఖాసీం అల్-జదీద్ టీవీకిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.



బెంగళూరు కాఫీ షాప్‌లో రిషి సునాక్

బెంగళూరు పర్యటనకు వచ్చిన బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్.. జయనగర్ ప్రాంతంలోని కాఫీషాప్‌లో సరదాగా గడిపారు. భార్య అక్షతా మూర్తితో పాటు రిషి సునాక్ థర్డ్‌వేవ్ కెఫెకు వచ్చారు. కాఫీతో పాటు పలు ఆహార పదార్థాల రుచి చూశారు. అరగంటకు పైగా కెఫేలో ఉన్న ఆయనతో అక్కడి సిబ్బంది, పలువురు వినియోగదారులు సెల్ఫీలు తీసుకున్నారు.

- బెంగళూరు, ఆంధ్రజ్యోతి

ఆర్టికల్ 370 పునరుద్ధరణపై జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో రగడ

» పరస్పరం దాడులు చేసుకున్న ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ, నవంబరు 7: ఆర్టికల్ 370 పునరుద్ధరణ వ్యవహారంపై జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ఎమ్మెల్యేలు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఆర్టికల్ 370 పునరుద్ధణకు కేంద్రం చర్చలు జరపాలంటూ బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టి, ఉద్రిక్తతల మధ్య ఆమోదించిన తీర్మానంపై బీజేపీ ఎమ్మెల్యేలు గురువారం సభ ప్రారంభంగానే అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ప్రతిపక్ష నేత, బీజేపీ ఎమ్మెల్యే సునీల్ శర్మ మాట్లాడుతుండగా.. అవామీ ఇతేహాత్ పార్టీ ఎమ్మెల్యే షేక్ కుర్షీద్ ఆర్టికల్ 370, 35ఏ లను పునరుద్ధరించాలంటూ బ్యానర్‌ను ప్రదర్శించారు. దాంతో బీజేపీ ఎమ్మెల్యేలు ఆ బ్యానర్‌ను చింపేశారు. ఈ క్రమంలో ఇరుపక్షాల ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దాంతో స్పీకర్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. వాయిదా అనంతరం కూడా బీజేపీ ఎమ్మెల్యేలు సభలో ఆందోళనలు కొనసాగించారు.

ఒవైసీ నోట మళ్లీ 15 నిమిషాల మాట

ముంబై, నవంబరు 7: మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మరోమారు '15 నిమిషాల'పై మాట్లాడారు. 2012లో ఆయన "15 నిమిషాలు పోలీసులు మిన్నకుంటే.. 100 కోట్ల హిందువులకు 25కోట్ల ముస్లింల సత్తా ఏంటో చూపిస్తాం" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలుచేసిన విషయం తెలిసిందే.! మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి ఆయన ఛత్రపతి శంబాజీనగర్(గతంలో ఔరంగాబాద్)లో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మరోమారు 15 నిమిషాలపై మాట్లాడారు. "ఇప్పుడు సమయం 9.45 అవుతోంది. 10 గంటలకు ఇంకా '15 నిమిషాలు' మిగిలి ఉంది. అది (సమయం అనే ఉద్దేశంతో) నన్ను వెంటాడుతోంది. నేను దాన్ని వెంటాడుతున్నాను. అది ఇప్పటికీ నడుస్తోంది. అయితే.. ప్రతిధ్వని ఏమిటి?" అంటూ గత వివాదాస్పద వ్యాఖ్యలను గుర్తుచేశారు.

మత విశ్వాసులతో కలిసి పనిచేద్దాం

» 'ఆర్ఎస్ఎస్'లా వారిలోకి మనమూ చొచ్చుకెళదాం

» మతంపై మినహాయింపు అవసరం

» సోషలిజం, లెఫ్ట్ ఐక్యతకు కృషి చేద్దాం

» రాజకీయ ముసాయిదా పత్రంలో ప్రతిపాదించిన సీపీఎం నాయకత్వం

న్యూఢిల్లీ, నవంబరు 7: కమ్యూనిస్టులు అంటేనే మత భావనలకు వ్యతిరేకంగా హేతుబద్ధ వైఖరిని అనుసరించే వారని అర్థం. అయితే, మతం విషయంలో కొన్ని మినహాయింపులతో తన రాజకీయ తీర్మాన ముసాయిదా పత్రాన్ని సీపీఐ (ఎం) అగ్రనాయకత్వం సిద్ధం చేసింది. మత ఆచరణ కలిగినవారితోనూ కలిసి పనిచేయాలనీ, వారిని క్రమంగా పార్టీ నిర్మాణంలోకి తెచ్చుకోవాలంటూ.. తొలిసారి తన రాజకీయ వైఖరిలో స్పష్టమైన మార్పును ప్రదర్శించింది. మతం విషయంలో.. కాంగ్రెస్ సహా బీజేపీయేతర పార్టీలకు తాను భిన్నమనేది వివరించేందుకు ఈ పత్రంలో ప్రయత్నించింది. అదే సమయంలో సోషలిజం సాధనను, వామపక్షాల ఐక్యతను ఇప్పటికీ అత్యవసరంగా సాధించాల్సిన ఆదర్శ లక్ష్యాలుగా స్పష్టం చేసింది. వచ్చే ఏడాది జరిగే 24వ మహాసభల (కాంగ్రెస్) కోసం ఇలాంటి అంశాలతో రాజకీయ ముసాయిదా పత్రాన్ని ఆ పార్టీ రూపొందించింది. "మతాన్ని సూత్రప్రాయంగా వ్యతిరేకించడం కమ్యూనిస్టు భావజాలంలోని ఒక ముఖ్యమైన భాగం. అయితే, ఇక్కడ ఒక మినహాయింపు అవసరమని భావిస్తున్నాం. మతవిశ్వాసాలు కలిగినవారితో కలిసి పనిచేస్తూ, వారిని పార్టీ వైపు తీసుకురావడం అవసరం" అని ఆ పత్రంలో పేర్కొంది. మత విశ్వాసుల్లో, ముఖ్యంగా మహిళల్లో ఆర్ఎస్ఎస్‌లా గట్టి పట్టు సాధించి, వారిని ఉపయోగించుకుని సమాజాన్ని కొత్త తరహా మతతత్వంతో నింపడంలో మంచి ఫలితాలను సాధించగలిగిందని ఆ పార్టీ విశ్లేషించింది. రాజకీయంగా పార్టీ విస్తరణ లక్ష్యాల కోసం ఆర్ఎస్ఎస్ మాదిరిగానే.. వారితో కలగలిసి పోవాలని ప్రతిపాదించింది. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మరణం తర్వాత, రాజకీయ ఎత్తుగడల పంథాపై సీపీఎం నుంచి వెలువడిన తొలి వైఖరి ఇదే కావడం గమనార్హం. హిందుత్వ విషయంలో కాంగ్రెస్‌ది, లెఫ్ట్ పార్టీలది ఒకే వైఖరి అనే భావన ఉంది. అయితే, అది సరికాదని ఆ పత్రం పేర్కొంది. వర్గ స్వభావం, నయా ఉదారవాద రాజకీయ విధానం రీత్యా హిందుత్వ విషయంలో కాంగ్రెస్ రాజీ వైఖరితో ఉన్నదనే విషయం బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చింది. లెఫ్ట్ పార్టీల ఐక్యతపై దృష్టి సారించాలని, ఆర్ఎస్ఎస్‌ను రాజకీయంగా బలంగా ఎదుర్కోవాలని ఆ పార్టీ ప్రతిపాదించింది.

రాజీ పడ్డారని లైంగిక వేధింపుల కేసును కొట్టివేయకూడదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు7: బాధితులు, నిందితులు రాజీపడ్డారన్న కారణంతో లైంగిక వేధింపుల కేసును కొట్టివేయకూడదని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజస్థాన్‌లో ఓ దళిత బాలికను ఉపాధ్యాయుడు లైంగికంగా వేధించాడన్న కేసును అక్కడి హైకోర్టు కొట్టివేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని పక్కనపెట్టింది. ఇలాంటి కేసుల్లో రాజీలు ఉండవని తెలిపింది. 2022లో గంగాపూర్ నగరంలోని ఓ పాఠశాలలో పనిచేసే విమల్ కుమార్ గుప్తా అనే ఉపాధ్యాయుడు దళిత బాలికను లైంగికంగా వేధించాడంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోక్సో, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసు పెట్టడంతో పాటు ఆ బాలిక వాంగ్మూలాన్ని కూడా నమోదు చేశారు. అనంతరం ఇరు పక్షాల మధ్య రాజీ కుదిరింది. అపార్థం కారణంగా టీచరుపై కేసు పెట్టామని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుకోవడం లేదంటూ ఆ బాలిక తల్లిదండ్రులు స్టాంప్ పేపరుపై రాసి ఇచ్చారు. దీన్ని ఆమోదించిన పోలీసులు కోర్టులో నివేదిక సమర్పించారు. కేసు మూసివేతను ట్రయల్ కోర్టు అంగీకరించలేదు. దాంతో నిందితుడు హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు ఊరట కలిగేలా ఆదేశాలు ఇచ్చింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ రామ్‌జీలాల్ బైర్వ అనే సామాజిక కార్యకర్త సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ సి.టి.రవి కుమార్, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్‌ల ధర్మాసనం హైకోర్టు ఆదేశాలను పక్కన పెట్టింది. ఫలితంగా ఆ టీచరుపై కోర్టులో విచారణ మొదలయ్యే అవకాశం ఉంది.

ఉద్యోగాల భర్తీ నిబంధనలు మధ్యలో మార్చకూడదు

(మొదటి పేజీ తరువాయి)



రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఉద్యోగాలు భర్తీ నిబంధనలు పారదర్శకంగా, నిజాయతీగా, సమానత్వ హక్కు గురించి వివరించే రాజ్యాంగంలోని 14వ అధికరణానికి అనుగుణంగా ఉండాలని ఏకగ్రీవంగా తెలిపింది. ధర్మాసనం తరఫున జస్టిస్ మిశ్ర తీర్పును చదివారు. ఆట మధ్యలో రూల్స్ మార్చకూడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఉద్యోగాల ప్రకటన జారీ చేసినప్పటి నుంచే నియామక ప్రక్రియ మొదలవుతుందని, పోస్టుల భర్తీతో ముగుస్తుందని తెలిపింది. తగిన అనుమతి ఉంటే తప్ప నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఉద్యోగాల అర్హతలను మార్చకూడదని పేర్కొంది. ఆ నిబంధనలకు చట్టబద్ధత ఉందని, వాటిని పాటించాల్సిన బాధ్యత నియామక సంస్థలపై ఉందని తెలిపింది. అదే సమయంలో సెలక్ట్ లిస్టులో పేరున్నంత మాత్రాన ఉద్యోగం పొందేందుకు తిరుగులేని హక్కు ఉన్నట్టు కాదని స్పష్టం చేసింది. సహేతుక కారణాలు ఉంటే ఆ పోస్టును భర్తీ చేయకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది. ఆ కారణాలను వెల్లడించాల్సి ఉంటుందని పేర్కొంది. ఒకవేళ పోస్టులు ఖాళీగా ఉంటే సెలెక్ట్ లిస్టులో చోటు దక్కించుకున్న అభ్యర్థులకు ఉద్యోగాలను నిరాకరించి, ఏకపక్షంగా వ్యవహరించకూడదని వివరణ ఇచ్చింది. తగిన కారణాలు, అనుమతుల మేరకు మధ్యలో నిబంధనలు మార్చినా అవి పరీక్షలు నిర్వహించేవారికి, పేపర్లు దిద్దేవారికి, ఇంటర్వ్యూలు జరిపే వారికి ఆశ్చర్యం కలిగించేవిగా ఉండకూడదని స్పష్టంచేసింది.

ఏమిటీ కేసు?

రాజస్థాన్ హైకోర్టులో 13 అనువాదకుల పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ వెలువడింది. తొలుత రాత పరీక్ష ఉంటుందని అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా నియామక ప్రక్రియ ముగుస్తుందని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఆ పరీక్షకు 21 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అందులో మూడు ఉద్యోగాలకు ముగ్గురిని ఎంపిక చేశారు. కనీసం 75% మార్కులు సాధించిన అభ్యర్థులనే ఉద్యోగాలకు ఎంపిక చేశామని హైకోర్టు తన ప్రకటనలో స్పష్టంచేసింది. నోటిఫికేషన్‌లో 75% మార్కులు తప్పనిసరి అనే విషయాన్ని ప్రస్తావించలేదని, నిబంధనలు సవరించి ఆ తర్వాత ఆ ముగ్గురిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని మిగిలిన అభ్యర్థులు ఆరోపించారు. తమకు అన్యాయం జరిగిందంటూ మరో ముగ్గురు అభ్యర్థులు హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. 2010 మార్చిలో ఆ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును వారు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. 2008లో కె మంజుశ్రీ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించారు. నిబంధనలను మధ్యలో మార్చలేరంటూ ఆ కేసులో త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. ఇదే సమయంలో హరియాణాకు చెందిన మరో కేసులో తగినంత మంది అర్హులు లేనప్పుడు పరీక్షను రద్దు చేయవచ్చన్న తీర్పు కూడా ఉంది. ఈ సమస్యను ప్రస్తుతం రాజ్యాంగ ధర్మాసనం పరిశీలించింది. నిబంధనలను మధ్యలో మార్చకూడదని చెబుతునే తగిన సహేతుక కారణాలు, అనుమతులు ఉంటే సవరించుకోవచ్చని తెలిపింది. ఈ తీర్పు నేపథ్యంలోనే రాజస్థాన్ హైకోర్టులోని పోస్టుల భర్తీపై మరో ధర్మాసనంలో విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

సీఎం ఇంటి ముట్టడికి యత్నించిన ఆరుగురు సర్పంచ్‌ల అరెస్టు

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలంటూ సీఎం ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించిన ఆరుగురు సర్పంచ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన సంగారెడ్డి కొండాపూర్, గురుకుర్తి, భూదాన్ పోచంపల్లి ప్రాంతానికి చెందిన సర్పంచ్‌లు గురువారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ టెంపుల్ కమాన్ వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం ఇంటిని ముట్టడించేందుకు బయలుదేరారు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

వ్యక్తిగత వివరాలు ప్రభుత్వానికి ఎందుకు?

» బీజేపీ ఎంపీ డీకే అరుణ

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కులగణనలో వ్యక్తిగత వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు? అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. ఇంటింటి సర్వే నిర్వహించే ముందు కేసీఆర్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్టును బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గురువారం డీకే అరుణ మీడియాతో మాట్లాడారు. కులగణనపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, సర్వే ప్రశ్నావళికి పొంతన లేకుండా ఉందని విమర్శించారు. తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడంతో పాటు బీసీలను మరోసారి మోసం చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వే చేస్తోందని ఆమె ఆరోపించారు.

త్వరలో అణుబాంబు పేలనుంది

తప్పు చేసిన బీఆర్ఎస్ నేతలను వదిలిపెట్టం.. దోచుకున్న వారంతా దోషులుగా నిలబడాల్సిందే

» కేటీఆర్.. పాదయాత్రేనా? మోకాళ్ల యాత్ర చేస్తావా?

» మీకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

» మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



తొర్రూరులో మాట్లాడుతున్న పొంగులేటి

తొర్రూరు/రాయపర్తి/వర్ధన్నపేట, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): "తప్పు చేసిన వారికి నాటు బాంబు కాదు.. లక్ష్మీబాంబు కాదు.. ఆటం బాంబు పేలబోతోంది. బీఆర్ఎస్ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని తప్పుల మీద తప్పులు చేసిన వారిని ఉపేక్షించేది లేదు. పేదోడి సొమ్మును సోకుల కోసం, ఆస్తులు పెంచుకోవడం కోసం విదేశాలకు బదిలీ చేస్తే ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబడాల్సి ఉంటుంది. కోట్లాది రూపాయలు ఎవరు ఎవరికి ఇచ్చారో ప్రజలకు తెలుపుతాం. కేటీఆర్.. పాదయాత్ర చేస్తావో.. మోకాళ్ల యాత్ర చేస్తావో.. త్వరగా నిర్ణయించుకో. తెలంగాణ ప్రజలు మరోసారి నీకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు" అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. దీపావళి తర్వాత పేలుతున్న బాంబులకు ఎందుకు ఉలిక్కి పడుతున్నారు? బాంబులేవి అంటున్న వారికి టపాసుల శబ్దం వినపడడం లేదా? ప్రశ్నించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరయ్యారు. అనంతరం రాయపర్తి మండలంలోని పెర్కవేడుతోపాటు వర్ధన్నపేటలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు శ్రీరామ రాజ్యం కావాలని కాంగ్రెస్‌ను గెలిపించుకున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ప్రజా సంక్షేమం కోసమే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ.. అభివృద్ధి చేస్తుంటే తమను కొందరు బదనాం చేస్తూ.. గుడ్డకాల్చి మీద వేస్తున్నారని విమర్శించారు. తల తాకట్టు పెట్టయినా హామీలన్నీ నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు బంధును ఆపబోమని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి పెట్టారని తెలిపారు. నెల రోజుల్లోగా ఒక్కో కుటుంబానికి ఒక స్మార్ట్ కార్డును అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వాటి ద్వారానే ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గ్రామం నడిబొడ్డున గ్రామసభ ఏర్పాటు చేసి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున పక్కా గృహాలను మంజూరు చేస్తున్నామని, ఐదేళ్లలో అర్హులైన వారందరికీ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దొరల కోసం తీసుకొచ్చిన ధరణిని నెలలోగా ప్రక్షాళన చేసి.. పేదలకు అండగా నిలుస్తామన్నారు. తెలంగాణ నూతన రెవెన్యూ చట్టం దేశానికే రోల్ మోడల్ కానుందని చెప్పారు. నల్లగొండ జిల్లాలో 6వేల ఎకరాల మేర సర్వే చేస్తే 2వేల ఎకరాల్లో బీఆర్ఎస్ పింకీలు వారి బినామీలకు రిజిస్ట్రేషన్ చేసి, వేల కోట్ల రూపాయల రైతుబంధును కాజేశారని వెల్లడించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసిన వాళ్లు సరెండర్ కావాల్సిందేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రెండో రాజధానిగా వరంగల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.

జైలుకెళ్లేందుకు నేను సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. 2024లో మరోసారి ఇదే ఈవెంట్ నిర్వహించడానికి ఫార్ములా-ఈ నిర్వహణ సంస్థ, జీహెచ్ఎంసీ, గ్రీన్‌కోల మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగిందని వివరించారు. గ్రీన్‌కో సంస్థ మధ్యలో తప్పుకోవడంతో కార్యక్రమం నిలిచి పోకూడదనే ఉద్దేశంతో హెచ్ఎండీఏ ద్వారా అడ్వాన్సు చెల్లించి, తర్వాత స్పాన్సర్లను వెతుక్కుందామని కార్యదర్శికి తానే చెప్పానన్నారు. దీనికి రూ.55 కోట్లు అడ్వాన్సు కట్టేందుకు అరవింద్ కుమార్ ఫైలు పంపితే పురపాలక మంత్రిగా సంతకం చేశానని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక సీఎం రేవంత్‌రెడ్డి ఫార్ములా-ఈ ఈవెంట్‌ను రద్దు చేసిందని, దాంతో అడ్వాన్సుగా ఇచ్చిన రూ.55 కోట్లు బూడిదలో పోసిన పన్నీరు అయ్యిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తొలుత చేపట్టిన ఫార్ములా-ఈ రేసుతో హైదరాబాద్‌కు ప్రపంచఖ్యాతి లభించిందని చెప్పారు. రాష్ట్రంలో ఈ-కార్ల తయారీ పరిశ్రమలు పెట్టుబడి వచ్చేందుకు మార్గం సుగమమైందన్నారు. తాము చంద్రబాబు కలను సాకారం చేస్తే రేవంత్‌రెడ్డి మాత్రం తన గురువు ఆశయానికి గండికొట్టారని విమర్శించారు. రేవంత్ తప్పుచేసి తనను దోషిగా నిలబెట్టేయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఫార్ములా-ఈ వ్యవహారంలో ఎలాంటి తప్పూ జరగలేదని, హెచ్ఎండీఏకు స్వయం ప్రతిపత్తి ఉంటుంది కాబట్టి కేబినెట్‌లో ప్రతిపాదించకుండానే నిధులు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. హెచ్ఎండీఏ సంస్థ ఛైర్మన్‌గా అప్పటి సీఎం కేసీఆర్, వైస్ ఛైర్మన్‌గా తాను ప్రతిపాదించి.. ఆ సంస్థ కార్యదర్శి, హెచ్ఎండీఏ కమిషనర్‌గా ఉన్న అరవింద్ కుమార్ ద్వారా ఆ నిధులను అడ్వాన్సుగా చెల్లించినట్లు కేటీఆర్ వివరించారు. తనపై కేసు పెట్టినా, న్యాయస్థానం ముందుకు తీసుకెళ్లినా జరిగిన వాస్తవాన్ని వెల్లడిస్తానని వ్యాఖ్యానించారు. ఈ అంశంలో గవర్నర్ తన విచక్షణాధికారంతో తనపై విచారణకు అనుమతిస్తే స్వాగతిస్తానన్నారు.

బీఆర్ఎస్‌ను దెబ్బ తీయాలని

రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని కాంగ్రెస్, బీజేపీలు కుట్ర పన్నుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు రెండు పార్టీల కుమ్మక్కు వ్యవహారం రాజ్‌భవన్ భేటీ ద్వారా బయటపడిందన్నారు. గవర్నర్ ద్వారా తనను ఇబ్బంది పెట్టే యత్నం చేస్తున్నారని, రేవంత్ ఉడత ఊపులకు తాను భయపడేది లేదని చెప్పారు. "హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచినందుకు నాపై కేసుపెడతావా? విశ్వనగరం బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీస్తున్నావు. ఇష్టం వచ్చిన కేసు పెట్టుకో. టార్గెట్ కేటీఆర్ అని కాకుండా ప్రజా సమస్యల పరిష్కారాన్ని టార్గెట్‌గా చేసుకొని పనిచేస్తే మంచిది" అన్నారు. రేసును రద్దు చేసినందుకు రేవంత్‌రెడ్డి, సంబంధిత శాఖలపై కేసు పెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ఉండవల్లికి పెన్‌డ్రైవ్‌లో వివరాలు ఇవ్వండి

» డిసెంబరు 15లోగా అందజేయండి

» మార్గదర్శి కేసులో హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో హైకోర్టు గురువారం కీలక ఆదేశాలు ఇచ్చింది. డిపాజిటర్ల (ఇన్వెస్టర్స్) వివరాలను ఎలక్ట్రానిక్ రూపంలో పెన్‌డ్రైవ్ ద్వారా మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు అందజేయాలని ఆదేశించింది. ఆర్బీఐ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లు సేకరించినట్టు నమోదైన కేసుపై ధర్మాసనం విచారణ జరిపింది. పెన్‌డ్రైవ్ ద్వారా సమాచారం ఇవ్వాలన్న ఉండవల్లి వినతిని మార్గదర్శి తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వ్యతిరేకించారు. ఆ వివరాలన్నీ భౌతికంగా 56 వేల పేజీలు పుస్తకాల రూపంలో ఆయన వద్ద ఇప్పటికే ఉన్నాయని తెలిపారు. వాదనలు అనంతరం ధర్మాసనం.. పెన్‌డ్రైవ్‌లో ఉండవల్లికి డిపాజిటర్ల వివరాలివ్వాలని ఆదేశించింది. ఈ కేసులో డిసెంబర్ 20 లోగా కౌంటర్‌లు, రిప్లైలు పూర్తికావాలని ఆదేశించింది. 4 వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ, ఏపీలకు సూచించింది. విచారణను వచ్చే ఏడాది జనవరి 3కు వాయిదా వేసింది.

ముగ్గురు టీటీడీ బోర్డు సభ్యుల ప్రమాణం

తిరుమల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా మరో ముగ్గురు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ముని కోటేశ్వరరావు, సుచిత్ర ఎల్లా, భానుప్రకాష్‌రెడ్డితో శ్రీవారి ఆలయంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు శ్రీవారిని దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వదించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

370పై సభాసమరం

జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో గురువారం యుద్ధవాతావరణం కనిపించింది. ఆర్టికల్ 370 పునరుద్ధరించాలంటూ ఇంజనీర్ రషీద్ సోదరుడు, అవామీ ఇత్తెహాద్ పార్టీ ఏకైక ఎమ్మెల్యే ఖుర్షీద్ షేక్ ప్లకార్డు ప్రదర్శించినందుకు బీజేపీ ఎమ్మెల్యేలకు ఆగ్రహం కలిగింది. ఎమ్మెల్యేలు పరస్పరం దాడి చేసుకుంటున్న దృశ్యాలు మీడియాలో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. ఐదేళ్ళక్రితం కేంద్రం తొలగించిన 370, 32 (ఏ)లను తిరిగి ఇచ్చేయాలంటూ పీడీపీ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టబోవడం, బీజేపీ అడ్డు పడటం, నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ జాతివ్యతిరేకశక్తులతో, ఉగ్రవాదులతో చేయికలిపారంటూ ఆ పార్టీ విమర్శలు చేయడం తెలిసిందే. రెండురోజులుగా జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో ప్రత్యేక ప్రతిపత్తి అంశం ఘర్షణకూ, గందరగోళానికీ కారణమవుతోంది. అటు కేంద్రానికి ఆగ్రహం కలగకుండా, ఇటు కశ్మీరీల అనుగ్రహం కోల్పోకుండా ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం సాధ్యమైనంత జాగ్రత్తగా అడుగులు వేస్తోంది.

మీరు లాక్కున్న హక్కులనూ అధికారాలను తిరిగి ఇవ్వండి అని కనీసం ప్లకార్డు ప్రదర్శించే హక్కు కూడా సభలో ఓ ఎమ్మెల్యేకు ఉండదా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఆర్టికల్ 370 ముగిసిన చరిత్ర అని ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ప్రకటించినందువల్ల కాబోలు, దాని ఊసెత్తడమే దేశద్రోహమన్న స్థాయిలో బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారు. ప్లకార్డు ప్రదర్శనమీద వారు అభ్యంతరం వ్యక్తంచేయడంతో సరిపెట్టకుండా లాక్కోవడం, చించివేయడం మరింత గందరగోళానికి దారితీసింది. నిజానికి, బుధవారం నాటి తీర్మానం బీజేపీ సభ్యులను అప్పటికే బాగా వేడెక్కించింది. ఆ చర్యను విమర్శించేందుకు, ఖండించేందుకు గురువారం చేసిన ఓ ప్రయత్నానికి మిగతాపార్టీలు అడ్డుతగలడం దానికి మరింత కోపం తెప్పించింది.

నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్–ఆమ్ ఆద్మీపార్టీ సంయుక్తంగా బుధవారం ప్రవేశపెట్టిన తీర్మానం ప్రత్యేకప్రతిపత్తిని పునరుద్ధరించాలని కోరిందే తప్ప ఆర్టికల్ 370 ప్రస్తావన చేయలేదు. వీసమెత్తు ప్రయోజనం లేని ఈ తీర్మానం ద్వారా కశ్మీరీ ప్రజల ప్రయోజనాలను, ఆకాంక్షలనూ నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం బలి పెట్టిందనీ, ఢిల్లీకి దాసోహపడిందనీ లోయలోని మిగతా పార్టీలు ఘాటుగా విమర్శించాయి. కానీ, తీర్మానంలో 370 అన్నపదాన్ని వాడకపోవడం ద్వారా అటు కేంద్రంతో ఘర్షణపడినట్టుగా కనిపించకుండా ఒమర్ ప్రభుత్వం జాగ్రత్తపడింది, తెలివిగా వ్యవహరించింది. మరోపక్క ప్రత్యేకప్రతిపత్తిని అభ్యర్థించడం ద్వారా ఎన్నికల ప్రచారంలో తాను ప్రజలకు ఇచ్చిన హామీకి అనుగుణంగా అడుగులు వేసినట్టూ అయింది. పైగా, రాష్ట్రహోదా గురించి పాటు పడతామని మాత్రమే ప్రజలకు హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఆప్‌లను ఈ తీర్మానంలో తనతో కలుపుకోగలిగింది. ఆర్టికల్ 370 ఊసెత్తనప్పుడు ఆ తీర్మానాన్ని బలపరచడంలో తప్పేముందని ఆ పార్టీలు అనగలిగాయి. ప్రత్యేకప్రతిపత్తి, ఇతర రాజ్యాంగబద్ధమైన హామీలు కల్పించే విషయంలో కొత్తగా ఎన్నికైన జమ్మూకశ్మీర్ ప్రజాప్రతినిధులతో కేంద్రం చర్చలు ఆరంభించాలని ఆ తీర్మానం కోరింది. అలనాటి 370 రద్దు నిర్ణయాన్ని తప్పుబట్టకుండా, ఇప్పుడు ఆ సంఖ్యను ప్రస్తావించకుండా తీర్మానం చేయడం వల్ల ఏ ప్రయోజనమూ లేదని పీడీపీ వాదించడం, నచ్చినవిధంగా ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ఆ తరువాత కొందరు ప్రయత్నించడం తెలిసినవే. ఒక అర్ధరాత్రి, సమస్త సేనలనూ మోహరించి, రాష్ట్రానికి దశాబ్దాలుగా ఉన్న హక్కులన్నీ రద్దుచేసి, దానిని స్వాధీనం చేసుకొని రెండుగా విడగొట్టిన కేంద్రప్రభుత్వం, ఆ తరువాత ఐదేళ్ళుగా ఎవరితోనూ ఒక్కముక్కకూడా మాట్లాడని కేంద్రాన్ని ఇప్పుడు చర్చలకు ఉపక్రమించమని ఒమర్ ప్రభుత్వం సవినయంగా ప్రార్థిస్తోందని పీడీపీ విమర్శిస్తోంది. అయితే, ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని ఎంతో సున్నితంగా నడిపిందని, అనవసర రాద్ధాంతం కాక, ఆచరణాత్మకంగా వ్యవహరించిందని మెచ్చుకుంటున్నవారు లేకపోలేదు. ఆర్టికల్ 370 ప్రస్తావన చేయకపోవడం ద్వారా కేంద్రాన్ని కూడా ఒమర్ మంచి చేసుకున్నారని వారి అభిప్రాయం. 2019 ఆగస్టు 5 అనంతర వాస్తవిక పరిస్థితులకు అనుగుణంగా ఈ పరిణామం ఉన్నదని బీజేపీ నాయకుడు అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమాల్లో ఒక వ్యాఖ్య చేశారు. కానీ, ప్రత్యేకప్రతిపత్తి ఊసెత్తితే సహించబోమన్నది స్థానిక బీజేపీ నాయకులు హెచ్చరిక.

అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్!



డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ ఇరువురి విజయసూత్రం ఒకటే. స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి 'వికసిత్ భారత్' అనే స్వప్నాన్ని మోదీ పూయించగా 'అమెరికాను మళ్లీ గొప్ప దేశం'గా రూపొందిస్తానని డోనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేశారు. జాతీయవాద భావోద్వేగాలను దృఢతరం చేసే ఈ జనాకర్షక నినాదాలు ట్రంప్– మోదీ రాజకీయ సందేశాలలో ప్రధానాంశాలుగా ఉంటున్నాయి. 'బయటి వ్యక్తుల' పట్ల భయాలు సృష్టించడమనేది ఇరువురూ ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న వ్యూహాలలో ఒక ఉమ్మడి అంశం.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

ప్రజాస్వామ్య పవనాలను ఎవరు ఆపగలరు? మరి రెండు నెలలలోగా ముగియనున్న 2024 సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామిక సమాజాలకు ఒక మరపురాని ప్రత్యేక సంవత్సరంగా గుర్తుండిపోతుంది. ఎన్నికల సంవత్సరాలు అన్నిటికీ తల్లిలాంటి ఈ సంవత్సరంలో 60కు పైగా దేశాలలో జాతీయ స్థాయి ఎన్నికలు జరిగాయి. అనేక దేశాలలో ప్రజలు దిగ్భ్రాంతికరమైన తీర్పునిచ్చారు. ప్రభుత్వాలు మారాయి. ఎదురులేని మొనగాళ్లలా వ్యవహరించిన నేతలు అధికార వైభవం కోల్పోవడమో లేక తగ్గిపోవడమో జరిగింది. గతంలో ప్రజల చేత తిరస్కరించబడిన నాయకులు అనూహ్యమైన ప్రజా మద్దతుతో మళ్లీ అధికారానికి వచ్చారు.

ఈ ఏడాది వేసవిలో భారతీయ ఓటర్లు నడుస్తున్న చరిత్రను విస్మయపరిచారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీకి 400కు పైగా సీట్లు ఖాయమనుకుంటే గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ఆ పార్టీ ఈ సారి పార్లమెంటరీ మెజారిటీని కోల్పోయింది. ప్రధాని మోదీ ఒక సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అనివార్యమయింది. ఆ తరువాత జూలైలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పథనిర్దేశకులు అయిన బ్రిటిష్ ప్రజలు యువనేత, సాహసోపేత ప్రధానమంత్రి రిషి సునాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేశారు. ప్రతిపక్షమైన లేబర్ పార్టీని అనూహ్య మెజారిటీతో గెలిపించారు. సునాక్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని చాలా మంది ముందుగానే భావించినప్పటికీ లేబర్ పార్టీకి తిరుగులేని మెజారిటీ లభించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఇక అమెరికా. ప్రపంచంలో అత్యంత పురాతన ప్రజాస్వామిక దేశమైన అమెరికాలో మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ఘనవిజయంతో చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడుగా ఉండి ఎన్నికలలో ఓడిపోయి తదుపరి పర్యాయం అధ్యక్ష ఎన్నికలలో ఘనవిజయం సాధించిన అధ్యక్షుడుగా ట్రంప్ తనకొక విలక్షణ కీర్తిని సృష్టించుకున్నారు. గత 120 సంవత్సరాలలో ఒక అధ్యక్షుడు ఒకసారి విజితుడై మళ్లీ విజేత కావడం ఇదే మొదటిసారి. రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ చేసిన మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ పార్టీ తరఫున పోటీ చేసిన కమలా హారిస్ మధ్య పోటీ సమస్థాయిలో ఉందని ఎవరు గెలుస్తారనేది కచ్చితంగా చెప్పలేమని ఓటర్ల సర్వేలు ఘంటాపథంగా వెల్లడిస్తూ వచ్చాయి. అయితే అమెరికన్ ఓటర్ల తీర్పు ఆ అంచనాలకు విరుద్ధంగా ఉండి ప్రపంచ ప్రజలను చకితపరిచింది.

ప్రపంచ ప్రధాన ప్రజాస్వామిక దేశాల ప్రజల తీర్పులలో ఒక స్పష్టమైన పద్ధతి లేదా రీతి గోచరమవుతుందా? ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎన్నిక, అధికారంలో ఉన్న నేతలు, పార్టీలకు ఒక స్పష్టమైన హెచ్చరికే అవడం పరిపాటి. అధికారంలో ఉన్న వారి పట్ల ఓటర్లలో వ్యక్తమయ్యే అసంతృప్తి, ఆగ్రహం పాలకులకు తెలుస్తూనే ఉండడం కూడా కద్దు. తత్కారణంగా తాము అధికారాన్ని నిలబెట్టుకోవడం కష్టమవుతుందనే జడుపు కూడా వారికి కలుగుతుంది. అమెరికా ఉపాధ్యక్షురాలు, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ఓటమికి ఒక ప్రధాన కారణం. పదవీ విరమణ చేయనున్న అధ్యక్షుడు జో బైడెన్ ప్రభుత్వ పాలన, విధానాలలో ఆమె భాగస్వామ్యమే.

ప్రజలలో సాధారణంగా ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుందనే సూత్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత సార్వత్రిక ఎన్నికల వరకు ఒక మినహాయింపుగా ఉండేవారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలలో ఆయన పార్టీ సైతం 63 స్థానాలను కోల్పోయింది. ఒక దశాబ్ద కాలంగా బీజేపీలోను, దేశ రాజకీయాలలోను తిరుగులేని రీతిలో ఉన్న ప్రభావ ప్రాబల్యాలకు తీవ్ర విఘాతం వాటిల్లింది. నిజమైన ప్రజాస్వామ్య ఎన్నికలలో ఒక అధికార పక్షం గతంలో కంటే మరింత మెజారిటీతో మళ్లీ అధికారానికి రావడమనేది అరుదుగా జరుగుతుంది. ప్రజలలో ప్రభుత్వ వ్యతిరేక మనస్థితి నెలకొనడానికి కారణం ఆర్థిక వ్యవస్థ. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల ప్రభుత్వాలు కోవిడ్ అనంతర ఆర్థిక దురవస్థల నెదుర్కోవడంలో సతమతమవుతున్నాయి. సంపన్న రాజ్యమైన అమెరికాలో సైతం కొత్త ఉద్యోగాల సృష్టి జరగలేదు. ఉన్న ఉద్యోగాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రజల ఆదాయాలు పడిపోయాయి. జీవన వ్యయాలు అంతకంతకు పెరిగిపోసాగాయి. మరి స్వల్ప ఆదాయాలతో బతుకులను ఈడుస్తున్న కార్మిక శ్రేణులు డోనాల్డ్ ట్రంప్‌కు గట్టి మద్దతుదారులుగా ఉండడంలో ఆశ్చర్యమేముంది? ఆర్థిక వ్యవస్థను బాగుపరచగల సమర్థుడు ఎవరన్నదే ఓటర్ల ఆలోచన. అటువంటి సమర్థ నేతను వారు ట్రంప్‌లో చూశారు. ఆయన విజేత అయ్యారు. భారత్‌లో సైతం లోక్‌సభ ఎన్నికలలో అటువంటి పరిస్థితే ఉన్నది. ఉదాహరణకు 'సంవిధాన్ ఖత్రే మే హై' (ప్రమాదంలో రాజ్యాంగం) అన్న నినాదం దళిత ఓటర్లను బాగా ప్రభావితం చేసింది. రిజర్వేషన్ల ప్రయోజనాలను కోల్పోవడం జరిగితే తమకు ఉద్యోగావకాశాలు దాదాపుగా మృగ్యమవుతాయని దళితులు భయపడ్డారు. సరే, రైతుల దుస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వ్యవసాయ రంగ దురవస్థలు, అనిశ్చిత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పాలక బీజేపీ 'చార్ సౌ ఆర్' స్వప్నాన్ని భంగపరిచాయి.

ఓటర్ల ప్రాధాన్యాల్లో సాంస్కృతిక గుర్తింపు ఒక ప్రధాన అంశంగా ఉండడమనేది ప్రజల తీర్పుల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. ఉదాహరణకు అమెరికాలో కమలా హారిస్ మద్దతుదారులు మరింత సమ్మిళిత 'కొత్త' అమెరికాను నిర్మించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అన్ని మతాల, సకల జాతుల ప్రజలను సమానంగా గౌరవించే ఒక 'కొత్త' అమెరికాను నిర్మించుకోవల్సిన సమయమాసన్నమయిందని వారు వాదించారు. అమెరికన్ సమాజం 'వైవిధ్యం'తో వర్ధిల్లాలన్న వాదనను డోనాల్డ్ ట్రంప్ తలకిందులు చేశారు. వలస వచ్చిన, వస్తున్న వారికి వ్యతిరేకంగా ఆయన మాట్లాడారు. భిన్న జాతుల, మతాలకు చెందిన వలసకారులు అమెరికన్ల శ్రేయస్సును దెబ్బ తీస్తున్నారని ఆయన వాదించారు. ట్రంప్ ధోరణి గత లోక్‌సభ ఎన్నికలలో ప్రధాని మోదీ, బీజేపీ నాయకుల ధోరణికి భిన్నమైనది కాదు.

నాగరిక విలువలు సమున్నతంగా ఉన్న ప్రపంచంలో అయితే, ట్రంప్, మోదీ, యోగి లాంటి నేతల విద్వేష పూరిత వ్యాఖ్యలు తీవ్రంగా గర్హింపబడేవి. అయితే 2024 ఎన్నికల ప్రచారాల్లో అటువంటి వ్యాఖ్యలు ఓటర్లలో అత్యధిక సంఖ్యాకులను తమ ఊహాత్మక 'అంతర్గత' శత్రువుకు వ్యతిరేకంగా పరిణమింపచేశాయి. మరింత సమ్మిళిత సమాజం కోసం కమలా హారిస్ చేసిన విజ్ఞప్తిని ఆమె ప్రత్యర్థులు పూర్తిగా వామపక్ష– ఉదార వాద రాజకీయ దృక్పథానికి మితిమీరిన ప్రాధాన్యమిస్తుందని, అది 'శ్వేతజాతి' అమెరికన్ల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని దుయ్యబట్టారు; మన దేశంలో 'భిన్నత్వంలో ఏకత్వం' అనే నెహ్రూ ఆదర్శానికి నిబద్ధులయిన వారిని 'బూటకపు లౌకికవాదులు'గా కొట్టివేయడం జరుగుతుంది.

ఒక విధంగా శక్తిమంతమైన రాజకీయ నాయకులు అయిన డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ ఒకే విధమైన విజయ సూత్రాన్ని కనుగొన్నారు. స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి 'వికసిత్ భారత్' అనే స్వప్నాన్ని మోదీ పూయించగా 'అమెరికాను మళ్లీ గొప్ప దేశం'గా రూపొందిస్తానని డోనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేశారు. జాతీయవాద భావోద్వేగాలను దృఢతరం చేసే ఈ జనాకర్షక నినాదాలు ట్రంప్– మోదీ రాజకీయ సందేశాలలో ప్రధానాంశాలుగా ఉంటున్నాయి. 'బయటి వ్యక్తుల' పట్ల భయాలు సృష్టించడం ఇరువురి ప్రచారాలలో ఒక ఉమ్మడి అంశం. అమెరికాలో ప్యూర్టోరికన్, హైతియన్ వలసకారులకు వ్యతిరేకంగా ట్రంప్, భారత్‌లో రోహింగ్యాలు లేదా బంగ్లాదేశీ ఘుస్‌పేటియా (చొరబాటుదారులు)కు వ్యతిరేకంగా మోదీ ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న వ్యూహాలలో భాగంగానే 'బయటి వ్యక్తుల' పట్ల భయాలు రెచ్చగొట్టడం జరుగుతోంది. ఒక విభిన్న అస్తిత్వాన్ని పటిష్ఠం చేసుకునేందుకు అనుసరిస్తున్న జాగరూక వ్యూహమిది: అమెరికాలో ట్రంపియన్ అమెరికనిజం, భారత్‌లో బీజేపీ హిందుత్వ భావజాలాలు ఒక జాతీయవాద దాడిగా వ్యక్తమవుతున్న అదుపులేని, చేయలేని సాంస్కృతిక వక్కాణింపు ప్రాతిపదికపై ప్రభవించినవే.

ఈ వ్యూహాలు చెప్పుకోదగిన రీతుల్లో ఫలిస్తున్నాయి. కారణమేమిటి? అటు అమెరికాలోను, ఇటు భారత్‌లోను ప్రతిపక్షాలు తమ సొంత ప్రత్యేక విధానాలను ప్రతిపాదించడానికి బదులుగా, భావజాల ప్రత్యర్థుల వ్యక్తిత్వాలను సవాల్ చేయడమనే వలలో చిక్కుకోవడమే. భారత్‌లో ప్రతిపక్షాలు ఎంతకూ మోదీని విమర్శించడానికే పరిమితమవుతున్నాయి; అలాగే అమెరికాలో డెమొక్రాట్లు అమెరికా భవిష్యత్తు విషయమై ఒక సుసంబంధ దార్శనికతతో ఓటర్లను కొత్త సమున్నత లక్ష్యాల సాధనకు ప్రేరేపించడానికి బదులుగా నిరంతరం ట్రంప్ వ్యక్తిత్వంలోని లోపాలు, లొసుగులను ఎండగట్టేందుకే పరిమితమయ్యారు. ఈ క్రమంలో ట్రంప్ తనను ప్రత్యర్థుల కుట్రకు బాధితుడుగా, వాషింగ్టన్ అధికార వ్యవస్థకు 'బయటి వ్యక్తి'గా చిత్రించుకోవడంలో సఫలమయ్యారు. నరేంద్ర మోదీ తనను తాను 'చాయ్ వాలా కా బేటా'గా చెప్పుకుంటూ 'నామ్ దార్' ప్రత్యర్థులను ఎదుర్కొంటున్న 'కామ్ దార్'గా తనను అభివర్ణించుకుని దేశ ప్రజలను ఆకట్టుకున్న విషయం మనకు బాగా తెలుసు.


డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ ఇరువురూ స్వతంత్రంగా, సొంత పద్ధతులతో తమ రాజకీయ విజయాలను సాధించుకున్న సమర్థులే. మోదీ తరచు తన విమర్శకులు ఎంతగా పొరపడుతున్నారో రుజువు చేసిన నాయకుడు. ట్రంప్ సైతం ఒకసారి విజితుడు అయిన తరువాత చరిత్రాత్మక విజేతగా ప్రభవించేందుకు తనదైన రీతిలో విజయ పథాన్ని నిర్మించుకున్న అరుదైన నేత. ఐదు సంవత్సరాల క్రితం అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నికల సందర్భంలో కాబోయే విజేత అని ట్రంప్‌ను మోదీ తొందరపాటుగా ప్రస్తుతించారు. 'అబ్ కి బార్ ట్రంప్ సర్కార్' అని నినదించారు. 2024లో అమెరికా ఎన్నికల తీరుతెన్నులు ఒక కొత్త విశేషాన్ని సంతరించుకున్నాయి. ప్రపంచ రాజకీయాలలో వాక్చూరులకు ఇంకా స్థానమున్నదన్నదే ఆ విశేషం.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

విద్యారంగంలో వినూత్న వికాసం

తెలంగాణ విద్యారంగానికి దశాబ్దాలుగా పట్టిన గ్రహణం తొలగిపోతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దార్శనికతతో ఇప్పుడు విద్యారంగంలో సరికొత్త కాంతులు ప్రసరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను తెలంగాణ బిడ్డలు అందిపుచ్చుకునేందుకు అవసరమైన అన్ని మార్గాలు తెరుచుకుంటున్నాయి. వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకం, దశాబ్దాలుగా నిలిచిపోయిన ప్రమోషన్ల కల్పన, వసతిగృహ విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు శ్రీకారం, విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ల నియామకం, నిపుణులను తీర్చిదిద్దే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు.. ఇవన్నీ తెలంగాణ విద్యా రంగంలో వస్తున్న విప్లవానికి నిదర్శనాలు.

తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్య ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు లభించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రగాఢ ఆకాంక్ష. అందుకే విద్యా శాఖను ఆయన తన దగ్గరే పెట్టుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన మరుక్షణం నుంచే విద్యావ్యవస్థ బలోపేతానికి నడుం బిగించారు. వేసవి సెలవుల్లోనే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మరమ్మతులకు వీలుగా రూ.667.25 కోట్లను కేటాయించారు. సమైక్య రాష్ట్రంలో, ప్రత్యేక రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థులందరికీ పుస్తకాలు, యూనిఫాంలు అందాయి. ఆ వెంటనే ఉపాధ్యాయుల పదోన్నతులు, నియామకాలపై ముఖ్యమంత్రి దృష్టిపెట్టారు. ప్రత్యేక రాష్ట్రంలో గత పాలకులు ఉపాధ్యాయుల పదోన్నతులపై శీతకన్ను వేశారు. పదేళ్ల పాటు కోర్టు కేసులు, ఇతర సాకులతో ఈ ప్రక్రియను అటకెక్కించారు. ఏ రంగంలోనైనా పనిచేసే వారికి గుర్తింపు, అనుభవానికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే సరైన ఫలితాలు వస్తాయి. రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయుల పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న న్యాయపరమైన వివాదాల పరిష్కారానికి కృషి చేశారు. ఫలితం 20 వేల మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. ఈ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్‌లో, అత్యంత పారదర్శకంగా వివాదరహితంగా విద్యా శాఖ పూర్తి చేసింది. నియామకాలే తెలంగాణ ఉద్యమ నినాదమైనప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకం, ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం వహించింది. పదేళ్ల కేసీఆర్ పాలనలో నాలుగుసార్లు మాత్రమే టెట్ నిర్వహించి, ఒకే ఒక్క డీఎస్సీ, అదీ కేవలం 8 వేల పోస్టులతో సరిపెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో పదకొండు నెలల కాలంలోనే 11,062 ఉపాధ్యాయుల నియామకం పూర్తి అయింది. ఎక్కువ మంది డీఎస్సీకి హాజరయ్యేందుకు వీలుగా టెట్‌ను ముందుగానే నిర్వహించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా రెండుసార్లు టెట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనవరిలో నిర్వహించనున్న టెట్‌కు దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపిన ఫలితంగా ఇప్పుడు రాష్ట్రంలో 99 శాతం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నారు, నాణ్యమైన బోధన సాగుతోంది.



విద్యపై చేసే ఖర్చును భావితరాల ఉజ్వల భవిష్యత్తుకు పునాదిగా చూస్తున్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ శాఖపై చేసే వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. వేలసంఖ్యలో ఉపాధ్యాయుల నియామకం, వారికి ప్రమోషన్లు, విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, నిపుణులను తయారుచేసే స్కిల్ యూనివర్సిటీ... ఇవన్నీ తెలంగాణ విద్యారంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుకు నిదర్శనాలు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వసతి గృహాలను వేర్వేరుగా ఉంచి, సామాజిక వర్గాల వారీగా పిల్లలను శాశ్వతంగా వేరు చేసే విధానానికి స్వస్తి చెప్పాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావన. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వంద నియోజక వర్గాల్లో 20 నుంచి 25 ఎకరాల్లో ఈ స్కూల్స్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. అన్ని వసతి గృహాలు ఒకే సముదాయంలో ఉండడంతో విద్యార్థుల మధ్య స్నేహసంబంధాలు పెరగడంతో పాటు విద్యా, క్రీడాపరమైన వికాసానికి దోహదపడుతుంది. కేజీ టూ పీజీ పేరుతో ఉద్యమ కాలం నుంచి ఊదరగొట్టిన కేసీఆర్ తన హయాంలో ఇటువంటి ఒక్క విద్యా సంస్థనూ ఏర్పాటు చేయలేదు. అందుకు భిన్నంగా హామీ ఇవ్వకపోయినా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేస్తున్నారు.

ఇక, రాష్ట్ర విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చి వేస్తున్నారు. అలాగే అకడమిక్ కోర్సులకు పరిశ్రమల అవసరాలకు మధ్య అంతరాన్ని పూడ్చడమే లక్ష్యంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా పారిశ్రామిక రంగంలో సరికొత్త ఆలోచనలు ఉన్న పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి ఈ క్రతువులో భాగస్వాములను చేశారు. పరిశ్రమల్లోని సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులకు నూతన కోర్సులను ఈ ఏటీసీలు, స్కిల్ యూనివర్సిటీ అందజేస్తాయి. వీటిల్లో శిక్షణ పొందే విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోనున్నారు.

విద్య, పరిశోధనలకు నిలయాలుగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలను గత ప్రభుత్వం రాజకీయ క్రీడలకు వేదికలుగా మార్చివేసింది. పోలీసుల పహారాతో జైళ్లుగా తయారు చేసింది. అందుకు భిన్నంగా, రాజకీయాల ప్రమేయం లేకుండా ప్రతిభకు పట్టం కడుతూ వైస్ ఛాన్సలర్ల నియామకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి చేశారు. విశ్వవిద్యాలయాల ప్రతిష్ఠను పెంచి, వాటికి పూర్వవైభవం తీసుకురావాలని వైస్ ఛాన్సలర్లతో భేటీ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

సగం కాలే కడుపుతో చదువుకోవడం ఎంత కష్టమో అది అనుభవించే బిడ్డలకే తెలుసు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో డైట్ చార్జీలను పెంచారు. ఫలితంగా రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వసతిగృహాల్లోని 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతోంది. అలాగే విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలనూ పెంచారు. ఈ పెంపుతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై అదనంగా రూ.300 కోట్ల భారం పడుతున్నది. విద్యపై చేసే ఖర్చును భావితరాల ఉజ్వల భవిష్యత్తుకు పునాదిగా చూస్తున్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ శాఖపై చేసే వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. తన పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ విద్యారంగంపై శీతకన్ను వేయడంతో తెలంగాణ బిడ్డలు తీవ్రంగా నష్టపోయారు. ఇంటర్మీడియట్ పరీక్ష పేపర్ల మూల్యాంకనాన్ని నాటి మంత్రి కేటీఆర్ సన్నిహితునికి అప్పజెప్పడం, ఆ కంపెనీ నిర్లక్ష్యంతో పదుల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన చీకటి రోజుల నుంచి ఇప్పుడు తెలంగాణ విద్యారంగం వెలుగులోకి వస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం తెలంగాణలో విద్యా విప్లవాన్ని సృష్టిస్తోంది. దేశ భవిష్యత్ తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందన్న విద్యావేత్త కొఠారి మాటలను ఆచరణలోకి తెచ్చేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి అన్ని విధాలా అండగా నిలబడడమే ప్రస్తుత మన కర్తవ్యం.

• దూదిపాళ్ల విజయకుమార్
ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి

పౌష్టికాహారం లేని బాలభారతం

మన పిల్లల ఆరోగ్యం చాలా దారుణంగా ఉంటున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం దేశంలో 6–23 నెలల మధ్య వయస్సు గల 77శాతం మంది శిశువులు కనీస ఆహార వైవిధ్యాన్ని పొందడం లేదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 88.5శాతం బాలలు ఆహార వైవిధ్య ప్రమాణాలను అందుకోలేకపోతున్నారు. నాణ్యత లేని ఆహారం పిల్లల మనుగడ, పెరుగుదల, అభివృద్ధికి అవశ్యం మాత్రమే కాకుండా వారి అలవాట్లు సామర్థ్యాలకు కూడా అత్యంత ముఖ్యమైన అవరోధాలలో ఒకటి. కనీస ఆహార వైవిధ్యాన్ని నిర్ధారించడానికి అనేక అవరోధాలు ఎదురవుతున్నాయి. వీటిలో అత్యంత భయంకరమైనది ఆహార ద్రవ్యోల్బణం. గత 12 నెలల్లో పప్పుల ధర 10శాతం పెరిగింది. మెజారిటీ భారతీయులు మాంసాహారులు కూడా. పప్పు దినుసుల నుండి వృద్ధికి కీలకమైన పోషకాలైన ప్రోటీన్‌ను పొందుతున్నారు. ఐక్యరాజ్యసమితి సంస్థల బృందం నివేదిక ప్రకారం భారత జనాభాలో 55.6శాతం మంది ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోలేకపోతున్నారు. మహిళలను ప్రతికూలంగా ప్రభావితం చేసే లింగ వివక్ష మరొక అడ్డంకి. తల్లులలో కనీస ఆహార వైవిధ్యం లేకపోవడం వల్ల పిల్లలు ఆకలి బాధతో అలమటిస్తున్నారు. తల్లుల మధ్య విద్యా స్థాయి పిల్లల ఆహార వైవిధ్యాన్ని ప్రభావితం చేస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఆహార భద్రతకు సంబంధించిన విధానాలు పిల్లలు మరియు వారి ఆహారపుటలవాట్లపై అసంఖ్యాక పరిస్థితుల ప్రభావాన్ని గుర్తించడానికి విస్తృత చర్యలు చేపట్టాలి. బాలల శక్తి సామర్థ్యాల పెరుగుదలకు పౌష్టిక ఆహారం అందించుటకు ప్రభుత్వం విస్తృతంగా తగిన ఏర్పాట్లు చేయాలి.

– దండంరాజు రాంచందర్‌రావు

నినాదాల్లో వినపడి, వ్యవస్థలో కనపడని న్యాయం!

కళ్లకు గంతలు లేని నూతన న్యాయ దేవత విగ్రహాన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తుల లైబ్రరీలో ఇటీవల నెలకొల్పారు. వలస వాద చిహ్నాలను చెరిపేయడానికి ఇలా చేసినట్లు పేర్కొన్నారు. విగ్రహం పాతదయినా, కొత్తదయినా, వ్యవస్థ పని తీరు ఎలా ఉందన్న దాన్ని బట్టే న్యాయం నిర్ణయించబడుతుంది.

న్యాయ వ్యవస్థకు సంబంధించి మన దేశంలో రెండు నినాదాలు అత్యంత బలంగా వినబడుతూ ఉంటాయి. ఒకటి "జస్టిస్ డిలేయిడ్ ఈస్ జస్టిస్ డినైడ్". అంటే ఆలస్యంగా న్యాయం జరగటం న్యాయాన్ని నిరాకరించటంతో సమానం అని అర్థం. రెండోది వెయ్యి మంది దోషులైనా తప్పించుకోవచ్చు గాని ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదు అన్నది. ఈ రెండు అంశాల అమలులోనూ ఘోరమైన వైఫల్యం మన న్యాయవ్యవస్థలో స్పష్టంగా కనపడుతోంది.

మన దేశంలో హైకోర్టులు, క్రింది కోర్టుల్లో కలిపి సుమారు ఐదు కోట్ల కేసులు పెండింగులో ఉన్నాయి. ఒక్కొక్క కేసులో ఆరుగురు కక్షిదారులు ఉన్నారనుకున్నా, ఆ లెక్కన కనీసం ముప్పై కోట్ల మంది, అంటే అమెరికా జనాభా కంటే ఎక్కువ మంది వివిధ కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ కేసులలో తీర్పులు రావటంలో తీవ్రమైన ఆలస్యం జరుగుతోంది. దేశంలో సగటున ఒక కేసు పరిష్కారం కావడానికి పదమూడున్నరేళ్లు పడుతోంది. సుప్రీంకోర్టులో నలభై శాతం కేసులు ఐదేళ్ళకు పైగా పెండింగులో ఉన్నాయి. దేశ ఉన్నత న్యాయస్థానంలో ఒక కేసు మూడు దశాబ్దాలకు పైగా పెండింగులో ఉంది. బెర్హంపూర్ బ్యాంకు కేసులో తీర్పు రావడానికి ఏకంగా డెబ్బై రెండేళ్లు పట్టింది. 1951లోని ఈ కేసు తుది తీర్పు 2023లో వచ్చింది. కొన్ని కేసులలో ముఖ్యంగా సివిల్, క్రిమినల్ కేసుల రెంటిలోనూ కేసులు వేసిన మనుషులు కూడా చనిపోతున్నారు. తరాలు మారినా తీర్పులు మాత్రం వెలువడని ఉదంతాలు ఎన్నో. ఎవరినైనా ఇబ్బంది పెట్టాలంటే కోర్టులో ఒక కేసు వేసేస్తే ఇక అవతలి వారి పని అయినట్లే. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నట్టుగా పెండింగ్ కేసుల పరిష్కారం న్యాయ వ్యవస్థ ముందు పెద్ద సవాలు. వరల్డ్ జస్టిస్ ప్రాజక్టు వివిధ అంశాల ఆధారంగా విడుదల చేసే ర్యాంకింగులలో మన దేశం 79వ స్థానంలో ఉంది. మన పొరుగు దేశాలైన శ్రీలంక, నేపాల్ వంటివి మన దేశం కంటే మెరుగ్గా ఉన్నాయి.

ఈ రకంగా కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరగడం ద్వారా ఎవరికి లాభం, ఎవరికి నష్టం? కేసు వేగంగా పరిష్కారం కావాలని నష్టపోయినవాడు కోరుకుంటే, ఎంత ఆలస్యం అయితే అంత మంచిదని లాభపడేవాడు కోరుకుంటాడు. ఇప్పుడు మన న్యాయ వ్యవస్థలో లాభపడుతున్నది రెండవ కోవకు చెందినవారే. అంటే నష్టపోయినవాడు న్యాయవ్యవస్థ వల్ల కూడా నష్టపోతున్నాడు.

చట్టం ముందు అందరూ సమానమే అని చెప్పినా– సామాన్యుడు కోర్టుల చుట్టూ తిరగలేకపోవడంతో, వాస్తవంగా ఆచరణలో న్యాయం ఆర్థిక స్తోమత ఉన్న వారికే అనుకూలంగా ఉంటోంది.

కొన్ని మంచి తీర్పులు కూడా ఆలస్యంగా రావడంతో ఆ తీర్పుల సాఫల్యం పూర్తిగా దక్కడం లేదు. ఉదాహరణకు ఇటీవల సుప్రీం కోర్టు ఎన్నికల బాండ్లు చెల్లవని తీర్పు ఇచ్చింది. కానీ అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది. బీజేపీ వేల కోట్ల రూపాయలు ఈ బాండ్ల ద్వారా సంపాదించి లబ్ధి పొందింది. ఆ సొమ్మును కక్కించే పని కోర్టు ఎలాగూ చేయలేదు. ఇక్కడ కూడా ఆలస్యంగా జరిగిన న్యాయం, న్యాయమెలా అవుతుందన్న ప్రశ్నే ఉదయిస్తుంది. ఇలా తీర్పులు ఆలస్యం కావడానికి మౌలిక వసతులు, సిబ్బంది లేకపోవడం ప్రధాన కారణం అని చెబుతున్నా, దీనికి బాధ్యత కూడా ప్రభుత్వమూ, న్యాయ వ్యవస్థే వహించాలి. వారి లోపానికి సామాన్యులను బలి చేయడం సమంజసం కాదు.

కేసు వేగంగా పరిష్కారం కావాలని నష్టపోయినవాడు కోరుకుంటే, ఎంత ఆలస్యం అయితే అంత మంచిదని లాభపడేవాడు కోరుకుంటాడు. ఇప్పుడు మన న్యాయవ్యవస్థలో లాభపడుతున్నది రెండవ కోవకు చెందినవారే. అంటే నష్టపోయినవాడు న్యాయవ్యవస్థ వల్ల కూడా నష్టపోతున్నాడు.



రెండోది నిర్దోషులు, దోషుల గురించి. మహిళలపై అత్యాచారం చేసిన దోషి డేరా బాబా దర్జాగా బెయిల్‌పై బయట తిరుగుతుండగా, చేయని నేరానికి నిర్దోషి ప్రొఫెసర్ సాయిబాబా పదేళ్ల జైలు శిక్ష అనుభవించవలసి వచ్చింది. మొత్తం ఆయన జీవితాన్నే కోల్పోవాల్సి వచ్చింది. ఓ ప్రసంగం కారణంగా ఉమర్ ఖలీద్ అనే యువ పీహెచ్‌డీ విద్యార్థి గత నాలుగున్నరేళ్ళుగా జైలులో ఉన్నాడు. విశేషమేమిటంటే ఈ కాలమంతా ఆయనకు బెయిల్ లేదు, ట్రయలూ లేదు. ప్రభుత్వం తమకున్న అధికార బలంతో తప్పుడు కేసులు బనాయించి, దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరచడం ద్వారా అనేక మందిని కేసుల్లో ఇరికిస్తోంది. వీటిలో అత్యధిక కేసుల్లో వారిపై మోపిన నేరం నిరూపించబడడం లేదు. కానీ ఈ లోగా తీవ్ర జాప్యం జరిగి నిర్దోషులు శిక్ష అనుభవించవలసి వస్తోంది. వీరందరికీ అన్యాయమే జరుగుతోంది. పోనీ తప్పుడు కేసులు బనాయించిన వారిపై ఏమైనా చర్యలుంటాయా అంటే అలాంటి అవకాశమే చట్టంలో లేదు.

ఇంకో ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే– కులం, అంటరానితనం వంటివి జైళ్ళల్లో కూడా ఉన్నాయని ఇటీవల వార్తలు వెలువడ్డాయి. జైలులో దళితులను ప్రత్యేక ప్రదేశాలలో ఉంచడం, వారికి మిగిలిన ఖైదీలతో పోలిస్తే తక్కువ ఆహారాన్ని సరఫరా చేయడం, మిగిలిన ఖైదీలతో పోలిస్తే వారిచేత కిందిస్థాయి పనులు చేయించడం, పడుకోవడానికి కూడా జాగా సరిపోనంత ఇరుకైన ప్రదేశాల్లో వారిని నిర్బంధించడం వంటి ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగు చూశాయి. అంటే మన జైళ్లలో నిర్దోషులు ఖైదీలుగా ఉండడమే గాక వారికి మానవత్వంతో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. దానితో పాటుగా రాజ్యాంగం నిషేధించిన వివక్ష కూడా కొనసాగుతోంది. వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబా విషయంలో కూడా జైలు అధికారులు కనీసం తినడానికి ఒక స్ట్రా ఇవ్వడానికి కూడా నిరాకరించి, ఎంత అమానుషంగా ప్రవర్తించారో విదితమే.


అందువల్ల, మన న్యాయవ్యవస్థ ఎలాంటి నినాదాలు ఇచ్చినప్పటికీ, ఆచరణలో అది నష్టపోయినవారికి కాక లాభపడిన వారికే అనుకూలంగా ఉంది. ఇటువంటి లోపాలను సరిదిద్ది కక్షిదారులకు, ముఖ్యంగా సామాన్యులకు త్వరితగతిన ఒక కాలపరిమితిలోగా తీర్పులు వచ్చేటట్టుగా వ్యవస్థలో కొన్ని సమూలమైన మార్పులు చేయాలి. నిర్దిష్ట కాలపరిమితి లోగా న్యాయం జరగకపోతే దానికి నష్టపరిహారాన్ని అందుకునే హక్కు కూడా సామాన్యులకు ఉండేలా వ్యవస్థలో మార్పులు చేయాలి. అప్పుడు మాత్రమే చట్టం ముందు అందరూ సమానులే అన్న నినాదం ఆచరణలో సాకారమవుతుంది. కార్ల్ మార్క్స్, ఫెడరిక్ ఏంగిల్స్ మహాశయులు చెప్పినట్టు సమాజంలో న్యాయ వ్యవస్థతో సహా రాజ్యాంగ యంత్రం అంతా దోపిడీ సమాజాన్ని కాపాడానికి, పాలకులను రక్షించడానికే సహకరిస్తుంది. మన న్యాయవ్యవస్థ కూడా దీనికి మినహాయింపు కాదని వివిధ ఘటనలు నిరూపిస్తున్నాయి.

ఉన్నత న్యాయస్థానాలలో న్యాయమూర్తులు గాను, ప్రధాన న్యాయమూర్తులు గాను ఉన్నవారు ప్రభుత్వాలకు అనుకూలంగా తీర్పులు ఇచ్చిన తర్వాత, రిటైరయిన వెంటనే పదవులు పొందుతున్నారు. బాబ్రీ మసీద్ తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయిని పదవీవిరమణ అయిన మూడు నెలలకే రాజ్యసభకు ప్రభుత్వం నామినేట్ చేయడం చూశాం. తాజాగా నేటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇంటికి వినాయక చవితి పూజ సందర్భంగా దేశ ప్రధానమంత్రి వెళ్ళడం కూడా పెద్ద చర్చనీయాంశం అయింది. ఈయన కూడా బాబ్రీ మసీదు కేసు తీర్పు బెంచిలోని ఒక న్యాయమూర్తే. చట్టాల పేర్లు మార్చినంత మాత్రాన న్యాయం జరగదు. సమూలమైన సంస్కరణలు చేపట్టినప్పుడు మాత్రమే న్యాయవ్యవస్థ మీద సామాన్యులకు విశ్వాసం కలుగుతుంది. ఆలస్యమైన కేసులలో పరిహారం చెల్లింపు, తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవడం, న్యాయమూర్తుల ప్రవర్తనా నియమావళి అమలు వంటి చర్యల ద్వారా న్యాయ వ్యవస్థ నుండి కొంతైనా న్యాయం జరిగేలా చేయవచ్చు.

■ ఎ. అజశర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA



శుక్రవారం 8 నవంబరు 2024

వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం 'బాటలు' వేస్తోంది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్ల పనులను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. నిధుల సమీకరణతో పాటు భూసేకరణ, రోడ్డు విస్తరణ పనులపై ఫోకస్ పెడుతోంది. గత ప్రభుత్వం హయంలో ఇన్నర్, ఔటర్ రింగు రోడ్ల పనుల ప్రతిపాదనలు పట్టాలెక్కినా.. నిధులలేమితో అడుగులు ముందుకు పడలేదు. నాటి సర్కారు వీటికి పైసా నిధులు కేటాయించకపోవటంతో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) నిధుల నుంచే రూ.120కోట్ల వరకు ఖర్చు చేసి ప్రాథమిక పనులు పూర్తి చేశారు. తాజాగా మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇన్నర్, ఔటర్ రింగు రోడ్లను పూర్తి చేసేందుకు అధికారులతో సమీక్షలు నిర్వహించటంతో ఆర్ఆర్‌లపై ఆశలు చిగురిస్తున్నాయి. అయితేనిధులు సమీకరణతోపాటు భూసేకరణ ప్రధాన సవాల్‌గా మారనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



సమగ్రాభివృద్ధికి.. బాటలు..

ఔటర్, ఇన్నర్ రింగ్‌రోడ్ల పనులపై ప్రభుత్వం నజర్

- వరంగల్ మహా నగరంలో ట్రాఫిక్ సమస్య లేకుండా రహదారులు
- పూర్తయితే అభివృద్ధి పరుగులేనంటున్న ప్రజాప్రతినిధులు
- ఎయిర్‌పోర్టు, వరంగల్ కోట, మెగా టెక్స్‌టైల్ పార్కులకు సులభ ప్రయాణం
- రూ.1,500కోట్లతో ఔటర్, రూ.570కోట్లతో ఇన్నర్ రింగ్‌రోడ్లకు ప్రతిపాదనలు
- నిధులు కేటాయింపు, భూసేకరణే ప్రధాన సవాళ్లు
- పైసా విడుదల చేయని గత ప్రభుత్వం
- నాడు 'కుడా' నుంచి రూ.120కోట్లు వెచ్చించి ప్రాథమిక పనుల పూర్తి
- రేవంత్ సర్కారు హడావుడితో ఓరుగల్లువాసుల్లో పెరుగుతున్న ఆశలు



ఔటర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్)

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అభివృద్ధిలో కీలక పాత్రపోషించే రోడ్ల విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో భాగంగా మహానగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్‌పెడుతూ అభివృద్ధికి బాటలు వేస్తూ ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టింది. కొత్తగా నిర్మించే 13కి.మీ ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) చుట్టూ భూములకు భారీగా డిమాండ్ పెరగనుంది. కొత్త వ్యాపారాలు, పరిశ్రమలు ఏర్పాటుకు అనుకూలంగా ఔటర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) ఉండనుంది. అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకునే అవకాశం ఉంది. ఓఆర్ఆర్‌తో భారీ వాహనాలు నగరంలోకి రాకుండా హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్, భూపాలపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లనున్నాయి. ఓఆర్ఆర్ చుట్టూ కొత్త పరిశ్రమల ఏర్పాటు, విద్యా సంస్థలు తదితర వ్యాపారాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఓఆర్ఆర్, ఐఆర్ఆర్‌పై అధికారులతో ఇటీవల కీలక సమావేశం నిర్వహించారు. త్వరగా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ రెండింటికి సుమారు రూ.2వేల కోట్ల వరకు నిధులు అవసరం కానుండటంతో వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. ఓఆర్ఆర్, ఐఆర్ఆర్ పనుల్లో కదిలిక రావటంతో ఓరుగల్లువాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం 53ఏళ్లుగా ఎదురుచూపు

వరంగల్ నగర వాసుల 53ఏళ్ల

మిగతా 6లో...

8వ పేజీలో..



వర్ధన్నపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- రుణమాఫీలో సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తాం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వర్ధన్నపేటలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారానికి హాజరు



భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో కులగణన సర్వేను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం

కుటుంబ సర్వే.. దేశానికే దిక్సూచి

- కుల గణనతో పెరుగనున్న బీసీ రిజర్వేషన్లు
- ఇళ్లకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పంటలకు మద్దతు ధర అందేలా కృషి
- కేంద్రం పత్తి దిగుమతులు నిలిపివేయాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కాటారం మండలంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం



మేడపై గంజాయి సాగు

శివనగర్‌లో ఓ వ్యక్తి పెంపకం

ఖిలావరంగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో తన ఇంటి మేడపైన గంజాయి మొక్కల పెంపకాన్ని చేపట్టిన ఓ వ్యక్తి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన పల్లెబోయిన కుమార్ అనే వ్యక్తి సులభంగా డబ్బు సంపాదన తోపాటు తన అవసరాల కోసం ఏకంగా తన ఇంటి మేడపైనే పూల కుండీల్లో గంజాయి మొక్కల పెంపకం చేపట్టాడు. గురువారం రైల్వేస్టేషన్ తనిఖీల్లో భాగంగా యాంటీ డ్రగ్స్ టీం పోలీసులు మత్తు పదార్థాలను పసిగట్టే పోలీసు జాగిలంతో మేడపైన గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ కంట్రోల్ టీం పోలీసులు గంజాయి మొ క్కలను పెంచిన నిందితుడిని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో యాంటీ డ్రగ్స్ టీం ఇన్‌స్పెక్టర్ జె.సురేష్, ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్ఐ పూర్ణచంద్రారెడ్డి, ఎస్ఐ చాంద్‌పాషా, ఏఎస్ఐ సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



కల్లంలో ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

నెల రోజులైనా గింజ కూడా

కొనుగోలు చేయలే

- కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలతో రైతులను ఆగం చేస్తోంది
- నమ్మకం లేక ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

6



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ సత్యశారద, తదితరులు



అంతర్జాతీయ విమానాశ్రయంగా మామునూరు

- ఎయిర్‌పోర్టు నిర్మాణంతో యువతకు ఉపాధి అవకాశాలు
- వరంగల్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తాం..
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ఎయిర్‌పోర్టు సందర్శన

8

సాఫీగా భద్రకాళి చెరువు నీరు విడుదల

- నేటి నుంచి నీటి తరలింపు ప్రక్రియ షురూ
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య వెల్లడి



భద్రకాళి చెరువు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువు నుంచి సాఫీగా నీటిని ఖాళీ చేయించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్టు హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. భద్రకాళి చెరువు పూడికతీత పనులకు ముందస్తు చర్యలలో భాగంగా హనుమకొండ కాపువాడ సమీపంలో ఉన్న చెరువు మత్తడి, రెడ్డిపురం సమీపంలోని కెనాల్ బొందల కుంట, హసన్‌పర్తి మండలం నాగారంలోని పెద్దచెరువుతో పాటు వివిధ ప్రాంతాలను బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పర్యటించారు. భద్రకాళి చెరువు నీరుకు సంబంధించిన అంశాలపై సాగునీటి పారుదల శాఖ, మున్సిపల్ శాఖ అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ప్రావిణ్య మాట్లాడుతూ.. నగరంలోని భద్రకాళి చెరువు పూడికతో నిండిపోయి ఉందని, దీంతో నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయిందని అన్నారు. ఈవిషయాన్ని రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. భద్రకాళి చెరువలో పూడికతీత పనులతో పాటు చెరువు చుట్టూ అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. భద్రకాళి చెరువులో పూడికతీత పనులు చేపట్టేందుకు ముందుగా చెరువులో ఉన్న నీటిని క్రమక్రమంగా మత్తడి ద్వారా ఖాళీ చేయిస్తామన్నారు. ఇక్కడి నీరు హసన్‌పర్తి మండలం నాగారం పెద్దచెరువులోకి తరలిస్తామన్నారు. నాగారం చెరువు కూడా నిండితే కింది ప్రాంతాల్లో ఉన్న చిన్న చిన్న చెరువులను నీటితో నింపుతామన్నారు. రైతులకు, పంటలకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. నీటి ప్రవాహం సాఫీగా ఉండేందుకు నీటి పారుదల శాఖ, మున్సిపల్ అధికారులు సమన్వయంలో పని చేస్తారన్నారు. కల్వర్టులు, కాల్వలలో చెత్తా, చెదారం లేకుండా అధికారులు సమన్వయంలో పనిచేయాల్సి ఉందన్నారు. భద్రకాళి చెరవు నీటిని ఒక్కసారిగా పెద్ద మొత్తంలో విడుదల చేయకుండా క్రమ క్రమంగా తక్కువ పరిమాణంతో శుక్రవారం నుంచి విడుదల చేస్తామన్నారు. కాల్వల పక్కన ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

10 నుంచి 15 రోజుల్లో భద్రకాళి చెరువులో ఉన్న నీటిని పూర్తిగా ఖాళీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. చెరువు నీటిని జాగ్రత్తగా తరలించాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. భద్రకాళి చెరువులో పూడికతీయడం వల్ల నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుందన్నారు.

చెరువులో నుంచి నీటిని పూర్తిగా తీసిన తర్వాత కొద్దిరోజులు డ్రై చేసి పూడితతీత పనులు ప్రారంభిస్తామన్నారు. రానున్న రోజుల్లో బొందివాగు నుంచి మురుగునీటి చేరకుండా తగిన చర్యలు చేపడుతామన్నారు. మురుగు నీటి విషయంలో ఎస్‌టీపీ ప్లాన్ కోసం మంత్రులు ఆదేశాల ఇచ్చారని వెల్లడించారు. కాగా, కలెక్టర్‌తో పాటు సాగునీటి పారుదల శాఖ ఈఈ సీతారామ్, మున్సిపల్ శాఖ డీఈ సంతోష్‌బాబుతో పాటు కుడా, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచండి

- బల్దియా అధికారులతో మేయర్ గుండు సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో బల్దియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో పురోగతి అవసరం అన్నారు. ఎల్ఆర్ఎస్ విచారణ కోసం ప్రజల వద్దకు వచ్చే అధికారులకు సహకరించాలన్నారు. ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర మాట్లాడుతూ.. ఇప్పటివరకు 7వేల దరఖాస్తులు పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, డీసీ కృష్ణారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలో దేశానికి ఆదర్శం తెలంగాణ

- సర్వేకు ప్రతీ ఒక్కరు సహకరించాలి
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- హాజరైన కలెక్టర్, మేయర్, కమిషనర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వేదికపై కలెక్టర్, మేయర్, గ్రేటర్ కమిషనర్

కాజీపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట చౌరస్తాలో గురువారం కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్వేను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ఈ సర్వేతో భవిష్యత్‌లో ప్రజలకు ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎన్నో రకాలుగా సర్వే దోహదపడుతుందన్నారు. మూడు రోజులపాటు ప్రతీ ఇంటికి వెళ్లి ఎన్యుమునేటర్లు స్టిక్కర్‌లు అంటిస్తారని, ఈ నెల 9 నుంచి పూర్తి స్థాయిలో సమగ్ర వివరాల కోసం ప్రతీ ఇంటికి వస్తారన్నారు. ఏ కుటుంబం అయినా, ఎక్కడికైనా వెళ్లిన కూడా తిరిగి వచ్చి సర్వే వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు.

నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. దేశచరిత్రలోనే ఏ రాష్ట్రం చేయని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి సామాజిక, రాజకీయ ఆర్థిక సర్వే నిర్వహిస్తున్నారన్నారు. ఇది దేశానికి దిక్సూచి అవుతుందన్నారు. ఈ సర్వేతో అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలు మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లా సగం గ్రామీణ ప్రాంతం, సగం పట్టణ ప్రాంతంగా మిళితమై ఉందన్నారు. సర్వే చేపట్టేందుకు మున్సిపల్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సర్వేలో సరైన వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం విష్ణుపురి వాటర్ ట్యాంక్ సమీపంలోని పలు గృహాలకు ఎన్యుమునేటర్లు సర్వే స్టిక్కర్‌లు అంటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసీల్దార్ బావుసింగ్, 62, 63వ డివిజన్‌ల కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్‌లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, స్థానిక నాయకులు సిరిల్ లారెన్స్‌తోపాటు స్థానికులు, మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

నెల రోజులైనా గింజ కూడా కొనుగోలు చేయలే..

- కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలతో రైతులను ఆగం చేస్తోంది
- నమ్మకం లేక ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనులు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులైనా ప్రభుత్వం ఒక్క గింజ కూడా రైతుల నుంచి కొనుగోలు చేయలేదని, ప్రభుత్వం నమ్మకం లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నా రని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. గురువారం వర్ధన్నపేట మండలం రాంధాన్‌తండా నుంచి వెళ్తూ ఇల్లంద గ్రామ సమీపంలోని ఓ పొలం వద్ద ఆగిన ఆయన అక్కడి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఎదుట పలువురు రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. పంటకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వకపోగా కనీసం మద్దతు ధర కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త పథకాల అమలు మాట దేవుడెరుగు గానీ, పాత పథకాలైన రైతుబంధు నిలిపివేసి రుణమాఫీ ఎగ్గొటిందని, ఈ ప్రభుత్వంపై తమకు నమ్మకం లేకపోవడంతో తాము ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలవుతున్నా ఒక్క గింజను కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తే ఈ ప్రభుత్వం తడిచిన ధాన్యమని, తేమశాతం ఎక్కువ ఉందని కొర్రీలు పెడుతూ రైతులను ఆగం చేస్తోందన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలుచేసే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ప్రతీ గింజను కొనుగోలు చేయాలని, మద్దతు ధరతోపాటు బోనస్‌ను కూడా ఇవ్వాలని, రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు అనిమిరెడ్డి రాజమల్లయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ హెచ్‌ఆర్ఎం పీడీఎఫ్ స్కాలర్‌పై ఫిర్యాదు

కేయూ క్యాంపస్, నవంబరు 7,(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఆర్ఎం విభాగం పోస్టు డాక్టరేట్ (పీడీఎఫ్) ఫెల్లో శ్రీశైలంపై కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఆర్ఎం విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్‌రావు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. తన పర్యవేక్షణలో ఐసీఎస్ఎస్ఆర్ ఫెల్లోషిప్ పీడీఎఫ్ పరిశోధన చేస్తున్న శ్రీశైలం తనపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు బెదిరింపులకు గురిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డిపార్టు అభివృద్ధికి గతంలో స్కాలర్స్ కొంత మేర ఆర్థిక సహాయం చేశారని,

అదే క్రమంలో తమ ఫెలో షిష్ కాంటీజెన్సీ విభాగాభివృద్ధికి డొనేట్ చేయాలని కోరినట్లు తెలిపారు. అయి తే దీనిపై అసత్య ఆరోపణలు, నిందలకు గురిచేస్తూ నీ అంతు చూస్తా.. అం టూ బెదిరింపుకు గురిచేశారని పేర్కొన్నారు. అలాగే తనపై భౌతికంగా దాడి చేసేందుకు వచ్చారని, తోటి అధ్యాపకులు కాపాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీశైలంపై చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌కు విన్నవించిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫార్మసీ విభాగంలో వైశాలి వీరారెడ్డికి డాక్టరేట్

హనుమకొండ టౌన్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి): చైతన్య డీమ్డ్ యూనివర్శిటీ మొయినాబాద్ నుంచి ఫార్మసీ విభాగంలో వైశాలి వీరారెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. 'డెవలప్‌మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ ఎనలిటికల్' అనే అంశంపై ఆచార్య గాండ్ల కుమారస్వామి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి యూనివర్శిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి చేతుల మీదుగా బుధవారం డాక్టరేట్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌రెడ్డి, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ కిష్టోఫర్ రూబెన్, రిజిస్ట్రార్ రవీందర్, పరీక్షల నియంత్రణాధికారి జగదీశ్వర్, ఫార్మసీ డీన్ పి.శంకరయ్య, పీఆర్‌వో గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



డాక్టరేట్ అందుకుంటున్న వైశాలి

నకిలీ వైద్యులతో జాగ్రత్తగా ఉండాలి

- తెలిసీ తెలియని వారి వద్ద వైద్యం చేయిచుకుని ఇబ్బందులు పడొద్దు
- వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా

వరంగల్ మెడికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీలు, పీఎంపీలు వైద్యులు కాదని, ప్రజలు తెలిసీతెలియక వారి వద్దకెళ్లి చికిత్స పొంది ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని వరంగల్ జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా సూచించారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం ఏనుకుంట తండాకు చెందిన బానోతు ఐశ్వర్య (16)కు హరిపిరాలకు చెందిన నకిలీ వైద్యుడు చెన్నా సారయ్య వైద్యం చేయడంతో గత నెల 25న మృతిచెందారు. ఈ ఘటనపై సుమోటా తీసుకున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ నరేశ్‌కుమార్ నేతృత్వంలో వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా, వరంగల్ లీగల్, యాంటీక్వాకరీ కమిటీ ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ శిరీష్, సభ్యులు డాక్టర్ తిరేష్‌లతో కూడిన బృందం గురువారం విచారణ చేపట్టింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాలలో చట్టవిరుద్ధంగా ఎలాంటి అర్హత లేకుండా నకిలీ వైద్యుడు చెన్న సారయ్య నిర్వహిస్తున్న సెంటరును తనిఖీ చేసింది. ఈ సందర్భంగా సారయ్యకు వైద్యపరంగా ఎలాంటి విద్యార్హత లేదని, కనీసం పదో తరగతి కూడా పాస్ కాకుండానే ఆర్ఎంపీగా అవతారం ఎత్తినట్లు పేర్కొన్నారు. సారయ్య ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఫార్మసిస్టు లేకుండా సాయిరామ్ మెడికల్ షాపు నిర్వహిస్తూ మందులు కూడా విక్రయిస్తున్నట్లు తెలిపారు. సారయ్యకు ఫార్మసీ సర్టిఫికెట్ ఇచ్చిన గజవెల్లి స్వాతిపై చర్యలు తీసుకోవాలని ఫార్మసీ కౌన్సిల్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ తెలిపారు. అనంతరం తండాలోని మృతురాలి ఇంటికి వెళ్లిన బృందం కుటుంబసభ్యులను బృందం పరామర్శించింది. వారికి మనో ధైర్యాన్నింది. నకిలీ వైద్యులు సారయ్య ఇచ్చిన ఇంజక్షన్ వల్లనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు విచారణ బృందంతో చెప్పి కన్నీటి పర్యంతం అయినట్లు తెలిపారు.



వివరాలు తెలుసుకుంటున్న కమిటీ బృందం

కేయూ డిగ్రీ సెమిస్టర్ ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్, నవంబరు 7: (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ బీఏ, బీకామ్, బీఎస్సీ తదితర డిగ్రీ కోర్సుల 1, 3, 5వ సెమిస్టర్ ఫీజు గడువును నవంబరు 11వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50అపరాధ రుసుంతో నవంబరు 13 వరకు గడువు ఉం దని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని తెలిపారు.

సమగ్రాభివృద్ధికి.. బాటలు..

(5వ పేజీ తరువాయి)

కల సాకారం కాబోతోంది. 1971లో వరంగల్ మాస్టర్ ప్లాన్‌లో 200అడుగుల ఇన్నర్ రింగు రోడ్డును ప్రతిపాదించారు. అప్పట్లో దీనికి రోడ్ల, భవనాల శాఖ రూ.50కోట్లతో అంచనాలు నూపొందించగా. అప్పటి ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అయితే అప్పటి నుంచే పలు కారణాలతో పనులు ముందుకు సాగలేదు. అయితే 2008లో ఐఆర్‌ఆర్ పనుల్లో కొంత కదిలిక వచ్చినా ముందుకు సాగులేదు. 200 అడుగుల వెడల్పుతో ఆరెపల్లి వద్ద ఉన్న ఆర్ఆర్ నుంచి 13కిలో మీటర్ల దూరంలో ఉన్న నాయుడు పెట్రోల్ బంక్ జంక్షన్ వరకు ఐఆర్‌ఆర్ నిర్మాంచాలని ప్రతిపాదించారు. ఇందుకోసం 2012లో ప్రభుత్వం రూ.20కోట్లు కేటాయించింది. వీటితో భూసేకరణకు మార్కింగ్ చేశారు. ఆ తరువాత రోడ్డు పనులు అటకెక్కాయి. 2018లో మరోసారి ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి. 2019మే నెలలో భూసేకరణకు అధికారులు నోటిఫికేషన్ జారీకి చర్యలు చేపట్టారు. ఇందులో మొదటి దశలో నాయుడు పెట్రోల్ బంకు నుంచి ఎనుమాముల వరకు 8కిలో మీటర్లు, రెండో దశలో ఎనుమాముల నుంచి ఆరెపల్లి ఆర్ఆర్ వరకు 5కిలో మీటర్ల ఐఆర్‌ఆర్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు. 360మంది భూనిర్వాసితుల్లో 200మందికి పరిహారం ఇవ్వగా, ఇంకా 160మందికి పరిహారం ఇచ్చే విషయంలో గత ప్రభుత్వం తాత్సారం చేసింది. దీంతో నిర్వాసితుల ఆందోళనలు, నిధుల లేమితో పనులు మరోసారి నిలిచిపోయాయి. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వరంగల్ సమగ్రాభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. వరంగల్ నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు ఐఆర్‌ఆర్ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇన్నర్ రింగు రోడ్డును 13కి.మీ పొడవుతో 200 అడుగుల వెడల్పుతో నాయుడు పెట్రోల్ పంపు నుంచి ఉర్సు, తిమ్మాపూర్, ఫోర్ట్ వరంగల్, గొర్రెకుంట, ఎనుమాముల, పైడిపల్లి, నుంచి ఆరెపల్లి వద్ద ఓఆర్‌ఆర్‌కు అనుసంధానం చేసేలా మ్యాప్ సిద్ధం చేశారు. ఇందు కోసం ప్రభుత్వం తాజాగా రూ.570కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం డీపీఆర్‌ను రూపొందించింది. ఇందులో నుంచి భూసేకరణ కోసం రూ.350కోట్లు, రోడ్లు, చెట్లు తొలగింపు తదతర వాటి కోసం రూ.220కోట్లు ఖర్చు చేయనున్నారు. అయితే గత ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయింపులు లేకపోవటంతో కూడా నుంచి రూ.120కోట్లు ఖర్చు చేశారు. రోడ్డు మార్కింగ్‌తో పాటు లైనింగ్, భూ నిర్వాసితులకు పరిహారం తదితర వాటికి కూడా నిధులనే వెచ్చించారు. ప్రభుత్వం మరో రూ.450కోట్ల వరకు నిధులు ఐఆర్‌ఆర్‌కు కేటాయిస్తే పనులు ముందుకు సాగుతాయి.

ఓఆర్‌ఆర్‌తో ట్రాఫిక్ కష్టాలకు చెక్...

ఓరుగల్లువాసుల మరో కలయిన ఔటర్ రింగ్‌రోడ్డు పనులను చేపట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. 2017లో 71కిలో మీటర్ల వరకు ఓఆర్‌ఆర్‌ను నిర్మించాలని ప్రతిపాదనలు చేయగా.. ఇందులో భాగంగా ఉత్తరం వైపు రాంపూర్ నుంచి ఆరెపల్లి వరకు 30కిలోమీటర్ల రోడ్డును జాతీయ రహదారుల శాఖ నిర్మించింది. ఇక దక్షిణం వైపు రాంపూర్ గ్రామం నుంచి నష్కల్, ధర్మపురం, వెంకటాపూర్, ఐనవోలు, పున్నెలు, బొల్లికుంట, కాపుల కానిపర్తి, వసంతాపూర్, ధర్మారం, బొడ్డు చింతలపల్లి. మొగిలిచర్ల, కొత్తపేట మీదుగా 41 కిలోమీటర్ల రోడ్డును ఆరెపల్లి వద్ద ఓఆర్‌ఆర్‌కు అనుసంధానం చేయాల్సిన రోడ్డును ఆర్ అండ్ బీ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే ఓఆర్‌ఆర్‌కు అధికారులు మార్కింగ్ చేసినా గత ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవటంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ క్రమంలో రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత వరంగల్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిని చేయాలనే లక్ష్యంతో ఓఆర్‌ఆర్ నిర్మాణం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. దక్షిణం వైపు 41 కిలో మీటర్ల రోడ్డును మూడు విడతల్లో పూర్తి చేయాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు. తొలి విడతలో 20కిలో మీటర్లు, రెండో విడతలో 11కిలో మీటర్లు, మూడో విడతలో 10కిలో మీటర్ల రోడ్డును నిర్మించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందు కోసం సుమారు 911ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని అధికారులు ప్రతిపాదనలు చేశారు. భూసేకరణతో పాటు రోడ్డు నిర్మాణం, వంతెనల నిర్మాణం తదితర వాటికోసం సుమారు రూ.1,500కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు చేశారు. ఇందులో ఉత్తరం వైపు రూ.700కోట్లతో పనులు పూర్తయ్యాయి. ఇక మిగిలిన సుమారు రూ.800కోట్లతో ఓఆర్‌ఆర్ పూర్తి అయితే ములుగు, భూపాలపల్లి, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, వర్ధన్నపేట, జనగామ, స్టేషన్‌ఘనపూర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు నగరంలోని ట్రాఫిక్ కష్టాలు లేకుండా వెళ్లేందుకు సౌకర్యవంతంగా మారనుంది. అంతేకాకుండా మామునూరు ఎయిర్‌పోర్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, వరంగల్ కోట, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ తదితర వాటికి వెళ్లేందుకు నగరంలోకి రానవసరం ఉండదు. మొత్తానికి సుదీర్ఘ నిరీక్షణ తరువాత ఓఆర్‌ఆర్, ఐఆర్‌ఆర్‌లపై ప్రభుత్వంలో కదిలిక రావటంతో ఓరుగల్లు వాసుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్‌ఆర్)

ఉత్తరం వైపు ఎన్‌హెచ్163 నుంచి 30కిలో మీటర్లు పనులు పూర్తయ్యాయి. దక్షిణం వైపు 41కిలో మీటర్లు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. సుమారు 911ఎకరాల భూమి భూసేకరణ చేయాల్సి ఉంది. అంచనా వ్యయం సుమారు రూ.1,500కోట్లు కాగా ఇందులో ఉత్తరం వైపు రూ.700కోట్లతో పనులు పూర్తయ్యాయి. ఓఆర్‌ఆర్ పరిధిలోకి వచ్చే **ప్రాంతాలు**: రాంపూర్, నష్కల్, ధర్మపురం, వెంకటాపూర్, ఐనవోలు, పున్నెలు, బొల్లికుంట, కాపుల కానిపర్తి, వసంతాపూర్, ధర్మారం, బొడ్డు చింతలపల్లి. మొగిలిచర్ల, కొత్తపేట నుంచి ఓఆర్‌ఆర్‌కు అనుసంధానం చేయనున్నారు.

ఇన్నర్ రింగురోడ్డు (ఐఆర్‌ఆర్)

13కి.మీ పొడవు.. 200ఫీట్ల వెడల్పు ఉంటుంది. అంచనా వ్యయం రూ.570కోట్లు కాగా ఇందులో భూసేకరణ కోసం రూ.350కోట్లు, రోడ్లు, వంతెనలు తదతర వాటి కోసం రూ.220కోట్లు వెచ్చించాలి. ఇప్పటి వరకు రూ.120కోట్లు కూడా నిధులు ఖర్చుచేశారు. ఐఆర్‌ఆర్ పరిధిలోకి వచ్చే ప్రాంతాలు: నాయుడు పెట్రోల్ పంపు నుంచి ఉర్సు, తిమ్మాపూర్, ఫోర్టు వరంగల్, గొర్రెకుంట, ఎనుమాముల, పైడిపల్లి, ఆరెపల్లి ఓఆర్‌ఆర్ అనుసంధానం అవుతుంది.

గుట్కా గోదాములపై టాస్క్‌ఫోర్స్ దాడులు

రూ.24.51లక్షల నిషేధిత గుట్కాల స్వాధీనం

మట్టెవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధిలో రామన్నపేట, పిన్నవారి వీధిలో నిషేధిత గుట్కా గోదాములపై గురువారం వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పెద్దఎత్తున గుట్కాలను స్వాధీనప ర్చుకున్నారు. మట్టెవాడ పోలీసుస్టేషన్ పరిధిలో పెద్ద ఎత్తున గుట్కాలు గోదాములో నిల్వ ఉంచా రనే సమాచారం రావడంతో గురువారం వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ ఆధ్వ ర్యంలో దాడులు నిర్వహించారు.

రామన్నపేటలో గోదాము లో గొల్ల మల్లికార్జున్ నిల్వ ఉంచిన రూ.22.43లక్షల విలువైన గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీన పర్చుకున్నా రు. అదేవిధంగా వరంగల్ పిన్నవారివీధిలో భూపేందర్ చౌదరి నివాసంలో తనిఖీలు నిర్వహించగా రూ.2.08 లక్షల విలువ గల గుట్కాలను స్వాధీనపర్చుకున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. స్వాధీన పర్చుకున్న గుట్కాలను మట్టెవాడ పోలీసుస్టేషన్‌కు తరలించారు. మల్లికార్జున్, భూపేందర్ చౌరదిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వరంగల్‌లో నిషేధిత గుట్కా దందా యథేచ్ఛగా సాగుతోంది. వరుస టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులతో లక్షల్లో గుట్కా నిల్వలు దాచి పెట్టినట్లు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్ దాడులతో స్థానిక పోలీసులు ఖంగుతిన్నారు.



దాడుల్లో పట్టుబడిన గుట్కా బ్యాగులు

నగదు, బంగారం అపహరణ

కారు అద్దాలు పగలగొట్టి దుండగుల చర్య

మట్టెవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫంక్షన్‌హాల్ ఎదుట పార్కు చేసిన రెండు కార్ల అద్దాలను పగలగొట్టి మూడు గ్రాముల బంగారం, రూ.13వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు. గురువారం వరంగల్ భద్రకాళి రోడ్‌లోని కీర్తిగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బంధువుల వివాహ వేడుకల్లో కుటుంబసభ్యులతో పాల్గొనేందుకు వచ్చిన హనుమకొండకు చెందిన సంతోష్. ఫంక్షన్‌హాల్ ఎదుట కారు పార్కు చేశారు. అదేవిధంగా హైదరాబాద్ నుంచి కారు లో రాము వివాహ వేడుకల్లో పాల్గొన డానికి వచ్చి కారు పార్కు చేశారు. వివాహం అనం తరం సాయంత్రం బయటికి వచ్చి చూసేసరికి రెండు కార్ల అద్దాలు పగిలి ఉండటాన్ని గమని ంచారు. సంతోష్ కారులో హ్యాండ్‌బ్యాగులో ఉన్న 3 గ్రాముల బంగారు వస్తువులు, రూ.8వేల నగదు, రాము కారులో రూ.10వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.



పగిలిన కారు అద్దాలు

సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

వరంగల్ భద్రకాళి రోడ్‌లోని కీర్తిగార్డెన్ ముందు పార్కింగ్ చేసిన రెండు కార్ల అద్దాలను పగలగొట్టి నగదు, బంగారం అపహరించిన సంఘటన స్థలాన్ని గురువారం సాయంత్రం మట్టెవాడ పోలీసులు సందర్శించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు.

రైల్వేస్టేషన్‌లో డ్రగ్స్ నిరోధక బృందం తనిఖీలు

గిర్మాజిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా గురువారం డ్రగ్స్ నిరోధక బృందం, ఇంతేజార్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా జాగిలంతో వరంగల్ రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు చేశారు. డ్రగ్స్ నిరోధక బృందం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్ఐ పూర్ణచందర్‌రెడ్డి, ఎస్ఐ చాంద్‌పాషా, ఏఎస్ఐ సాంబయ్య, రైల్వే పోలీసులు రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు, టికెట్ కౌంటర్లు, విశ్రాంతి మందిరాలలో ఉన్న ప్రయాణికుల బ్యాగులు, సూట్‌కేసులు, లగేజీలను జాగిలంతో తనిఖీ చేశారు. రైలు ప్రయాణంలో ఎక్కడైనా గంజాయి తదితర మత్తు పదార్థాలు కనిపించినా, మత్తు పదార్థాలు సేవించిన వ్యక్తులు కనిపించినా వెంటనే 8712584473 నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రయాణికులను సీఐ సురేష్ కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఆయన తెలిపారు.



వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుడి బ్యాగును జాగిలంతో తనిఖీ చేస్తున్న డ్రగ్స్ నిరోధక బృందం

పులిపిరికి అరుదైన చికిత్స

- ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు

వరంగల్ జిల్లా, నవంబర్ 7: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కల గుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి అైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శనివా రం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అం దుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరా రు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

రెండో రోజూ కొనసాగిన ఇంటింటి సర్వే

- ఇంటింటికీ వెళుతున్న ఎన్యుమరేటర్లు
- సర్వే చేసిన ఇళ్లకు స్టిక్కరింగ్

హనుమకొండ, నవంబరు 07 (ఆంధ్రజ్యోతి): వరంగల్ హనుమకొండ జిల్లాలో గురువారం రెండోరోజు ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగింది. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌ల పరిధిలోని ఇంటింటికి వెళ్లి కుటుంబాలను గుర్తించి ఇంటికి స్టిక్కర్లను అంటిస్తున్నారు. శుక్రవారం కూడా ఇదే విధంగా సర్వే నిర్వహిస్తారు. ఈనెల 9వ తేదీన రెండో దశ కింద ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను చేపడతారు. ఈ నెల 9వ తేదీ నుంచి మరోసారి ఇంటికి వస్తామని, తాము అడిగిన సమాచారాన్ని ఇవ్వాలని చెబుతున్నారు. సమాచార సేకరణకు ఉపయోగపడే ఆధార్‌కార్డు, పాస్‌బుక్కులు, రేషన్‌కార్డులు, కుల ధృవీకరణ పత్రాలు ఇతరత్రా డాక్యుమెంట్లను దగ్గర ఉంచుకోవాలని సూచిస్తున్నారు. కాగా, ఎన్యుమరేటర్లు వెళ్లిన సందర్భంగా కొన్ని ఇళ్లకు తాళాలు వేసి ఉండడం, ఇంట్లో ఎవరూ లేకపోవడం వంటి సంఘటనలు ఎదురవుతున్నాయి. అయినా కూడా పక్క ఇంటివాళ్లతో మాట్లాడి వివరాలు తీసుకొని స్టిక్కర్లు అంటిస్తున్నారు. ఫలానా రోజునాడు ఇంటింటి సమగ్ర సర్వేకు వస్తామని, ఆ సమయంలో ఇళ్ల వద్దే ఉంటేట్లు చూడమని వారిని కోరుతున్నారు. ఒక్క ఇంట్లో ఒకటికన్నా ఎక్కువ కుటుంబాలు ఉన్నప్పటికీ ఇంటి నెంబరు ఒకటే ఉన్నందువల్ల స్టిక్కర్ ఒకటే అంటిస్తున్నారు. కాకపోతే ఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉన్నది స్టిక్కర్‌పై పేర్కొంటున్నారు. ఇంటింటి సర్వే జరిపే సందర్భంగా ఆ ఇంట్లో ఉన్న అన్ని కుటుంబాల గురించిన సమాచారాన్ని విడివిడిగా నమోదు చేసుకోవడానికి వీలవుతుందని ఎన్యుమరేటర్లు చెబుతున్నారు. ఇంటింటి సమగ్ర సర్వే సందర్భంగా దూరప్రాంతాలకు వెళ్ళినవారు ఆ తర్వాత అయినా తమ కుటుంబ వివరాలను గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలు, వరంగల్ నగర పాలక సంస్థలో నమోదు చేసే అవకాశం కల్పించనున్నట్టు తెలుస్తోంది. ఇందు కోసం ప్రత్యేంగా కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేసే సందర్భంలో ఒక్కో ఇంటిలోని కుటుంబ వివరాల సేకరణకు గరిష్ఠంగా 30 నిమిషాలు పట్టవచ్చునని అంచనా వేస్తున్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ రోజూ 15 కుటుంబాల వివరాలను సేకరించాల్సి ఉంటుంది. అంటే సుమారు ఒక రోజులో ఏడు గంటలు పట్టవచ్చు. వివరాలు ఇచ్చేదానిని బట్టి ఈ సమయం ఉంటుంది. అందుబాటులో వివరాలు లేక కుటుంబ సభ్యులు సర్వే సందర్భంగా వెదుకులాడే పరిస్థితి ఏర్పడిన పక్షంలో ఈ సమయం ఇంతకన్నా ఎక్కువగా సుమారు 45 నిమిషాలు, ఆపైన కూడా పట్టే అవకాశం ఉంది. మొత్తం 75 ప్రశ్నలకు సమాధానాలను ఫారమ్‌లో నింపాల్సి ఉంటుంది. పార్ట్ 1,2గా ఈ వివరాల పూరింపు ఉంటుంది. ప్రస్తుతం జరుగుతున్న ఇంటి స్టిక్కరింగ్ సందర్భంగా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పాల్గొని పర్యవేక్షిస్తున్నారు.

ఫుడ్ సేఫ్టీ ల్యాబోరేటరీ కోసం కేఎంసీలో స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ మురళి

వరంగల్ మెడికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కళాశాలలోని పీఎంఎ స్ఎస్‌వై విభాగంలో తలసే మియా యూనిట్ కోసం గురువారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరి ంటెండెంట్ డాక్టర్ మురళి మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్, కమిషనర్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ ల్యాబోరేటరీ కోసం వరంగల్ కేఎంసీలో ప్రస్తుతం ఉన్న భవనాల్లో స్థలాన్ని పరిశీలించామన్నారు. పరిశీలన అనంతరం పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి HANUMAKONDA RURAL శుక్రవారం 8 నవంబరు 2024

హనుమకొండ రూరల్

పూర్వ ఎంఈవోకు సన్మానం

ఐనవోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఐనవోలు ఇంచార్జి ఎంఈవోగా విధులు నిర్వహించిన ఎ. వెంకటేశ్వర్‌రావును గురువారం ఉపాధ్యాయులు సన్మానించారు. నూతన ఎంఈవో పులి ఆనందం, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, విద్యావారధి జిల్లా అధ్యక్షుడు భీమళ్ళ సారయ్య, ఉపాధ్యాయులు శ్రీహర్షుడు, సుధాకర్, సీఆర్పీ రేవతి, రాజ్‌కుమార్, వసంత కార్యక్రమంలో పాల్గొని ఆయన అందించిన సేవలను కొనియాడారు.



వెంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సంక్షిప్త వార్తలు

చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభం

భీమదేవరపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలలో 8,9,10వ తరగతులు చదువుకునే 1134మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాల పోటీల్లో గురువారం పాల్గొన్నారు. విద్యార్థులు సమాజంలో ఉన్న మూఢనమ్మకాల పట్ల చిన్నప్పటి నుంచి అవగాహన కలిగి ఉండాలని జన విజ్ఞన వేదిక జిల్లా కార్యదర్శి రామంచ భిక్షపతి అన్నారు. పాఠశాల స్థాయిలో టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయిలో పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పోలవేని రవిప్రకాష్, రహ్మాన్, దాసరి రవీందర్, కె సురేష్, రాజ్ మహ్మద్ పాల్గొన్నారు.

శివాలయాన్ని దర్శించుకున్న బీజేపీ నేతలు



ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ నేతలు

ఆత్మకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మండల కేంద్రంలోని పంచలింగాల శివాలయాన్ని బీజేపీ నేతలు గురువారం దర్శించుకున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వంగాల సమ్మిరెడ్డి, మంద ఐలయ్య, కన్నెబోయిన రాజయ్య యాదవ్, మాజీ సర్పంచ్ పలకల మంజుల, ఆలయ కమిటీ బృందం బుచ్చిరెడ్డి, రేవూరి దేవేందర్‌రెడ్డి, సిరిపురం సంపత్, బూర కిశోర్ గౌడ్, రేవూరి జైపాల్‌రెడ్డి హోమంలో పాల్గొని అనంతరం ప్రత్యేక పూజలు నిర్రవహించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

వేలేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : వేలేరు మండల కేంద్రానికి చెందిన మహ్మద్ సలీమ్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్నస్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట గోవింద సురేష్, రాజు, మాధవరెడ్డి, కుమారస్వామి, జానీ, సలీమ్‌మాలిక్ ఉన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు పులుకుర్తి విద్యార్థి ఎంపిక

దామెర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల హనుమకొండ జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్-14 బాలుర విభాగంలో జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు జరిగాయి. ఈ నేపథ్యంలో దామెర మండలం పులుకుర్తి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి దండు భరత్‌కుమార్ జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ పట్టణంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు భరత్‌కుమార్ ఎంపికయ్యాడు. ఈ క్రమంలో గురువారం పులుకుర్తి హై స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బానోతు జుమ్మ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థి భరత్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ అర్షం శ్రీనివాస్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు హరిందర్, మురళీ ధర్, రాధాకృష్ణచారి, ఆనంద్, ఫిజికల్ డైరెక్టర్ జట్టి రాజేశ్వర్, విద్యార్థులు తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి : సీఐ

భీమదేవరపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ఎల్కతుర్తి సీఐ రమేష్ అన్నారు. గురువారం మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామంలో విద్యార్థులకు సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులను సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండే విధంగా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్లు రోజు రోజుకు సమాజంలో ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దోచుకుంటున్నారన్నారు. నిత్యం ప్రజలు సైబర్ నేరాలను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సాయిబాబు పాల్గొన్నారు.

● వేలేరు. నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఏ.సురేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గొల్లకిష్టంపల్లి గ్రామ శివారులోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ.. సెల్ ఫోన్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించిన మెసేజ్‌లకు స్పందించ వద్దన్నారు. ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తిన 100కు డయల్ చేయాలన్నారు. వీటితో పాటు నూతన చట్టాలపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో శ్రవంతి, పాఠశాల ఉద్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

భక్తులతో కిటకిటలాడిన పంచలింగాల శివాలయం

పంచామృతాలతో విగ్రహాలకు అభిషేకాలు

మహామృత్యుంజయ హోమం



విగ్రహాలకు సప్త నది జలాలు, పంచామృతాలతో అభిషేకం చేస్తున్న భక్తులు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ఆత్మకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలో పంచలింగాల శివాలయంలో నిర్వహిస్తున్న పునఃప్రతిష్ఠ ఉత్సవాలు గురువారానికి రెండోరోజుకు చేరుకున్నాయి. వేడుకలకు ఆడబిడ్డలు, బంధువులు, శ్రేయోభిలాషులు, మిత్రులు తరలిరావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. రెండోరోజైన గురువారం గణపతి హోమం, కలిషా ఆరాధన, విగ్రహాలకు పంచామృతాలతో వేద పండితులు రవీంద్ర శర్మ, శ్రావణ్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. పంచలింగాల శివాలయం నుంచి విగ్రహాలను మేళతాళాలు, డప్పుచప్పుళ్లు, భక్తుల నృత్యాలతో హర హర మహాదేవ శంభో శంకర.. అంటూ శివనామస్మరణతో నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు నూతన వస్త్రాలు ధరించి, ఉత్సవాలలో పాల్గొని, భక్తి గీతాలు ఆలపిస్తూ తన్మయం చెందారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకల సౌకర్యాలను కల్పిస్తూ నిత్యం పదివేల మందికి మహాన్నదానం, ప్రసాదాల వితరణ అందిస్తున్నారు. ఆత్మకూరు సీఐ సంతోష్ కుమార్ పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

వైభవంగా దాన్యాధివాసం

వేద పండితుల వేద మంత్రాల నడుమ విగ్రహాలకు ధాన్యాధివాసాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో రైతులు పండించిన ధాన్యాన్ని ఆడబిడ్డలు తీసుకువచ్చిన రకరకాల పండ్లను నూతన వస్త్రాలను దేవతామూర్తులకు భక్తి శ్రద్ధలతో సమర్పించి మొక్కులు చెల్లించారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు

పరకాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధిగ్ర స్తులు పెరుగు తున్నారని క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాల్సిన అవ సరం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోష్ కుమార్ అన్నారు. గురువారం పరకాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్ కుమా ర్ మాట్లాడుతూ.. క్యాన్సర్ గడ్డలు రెండు రకాలుగా ఉంటాయని అందులో మాలిగ్నెంట్ క్యాన్సర్ గడ్డలు, ప్రాణాంతకం అని క్యాన్సర్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీమ్‌రావు, డాక్టర్ బి.విజ యపాల్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మోరె అశోక్, డాక్టర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ జి.రామకృష్ణ, కె.జగదీష్‌బాబు, బల్గూరి మహేందర్‌రావు, ఎం.సమ్మయ్య, డాక్టర్ ఏ.రమేశ్, ఆర్.ఈశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్

ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ మండల కన్వీనర్లు ఎన్నిక

శాయంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోష లిస్టు పార్టీ మండల కన్వీనర్లుగా మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన తుడుం వెంకటేష్, కొప్పుల గ్రామానికి చెందిన మామిడి భాస్కర్ ఎన్నికైనట్లు జిల్లా కోఆర్డినేటర్ జన్ను దినేష్ తెలిపారు.

ఈ మేరకు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ యువ నాయకుడు ముఖేష్ అధ్యక్షతన ఎ మ్మార్పీఎస్, ఎమ్మెస్పీ సమావేశంలో గురువారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లా డుతూ.. వర్గీకరణ చేయకపోవడంతో ఇటీవల డీఎస్సీ నియామకాలలో మాదిగలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వంపై మరో ధర్మపోరాటం చేస్తామని ప్రకటించారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కొనుగోళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి



సీసీఐ కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం పరకాల వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని, 8 శాతం తేమ కలిగిన పత్తికి రూ. 7521 కనీస మద్దతు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు తాము పండించిన పత్తిని 8 శాతం తేమ మించకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు దళారులకు పత్తిని విక్రయించరాదన్నారు. సీసీఐ అధికారులు రైతులను ఇబ్బందులు పెట్టకుండా మద్దతు ధర కల్పించాలని, రైతులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని ఈ విషయంలో రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీఐ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహా సభను విజయవంతం చేయాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కు రాజుగౌడ్

ఎల్కతుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించే ఆటో డ్రైవర్స్ ప్రథమ మహాసభను విజయ వంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కు రాజుగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఆటో డ్రైవర్స్ ప్రథమ సహా సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించారన్నారు. ఆటో కార్మికులకు ఎలాంటి సమస్యలు ఎదురైన వాటి పరిష్కారానికి కృషి చేసేది కేవలం ఏఐటీయూసీనే అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆటో కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. ప్రతి ఆటో కార్మికుడికి సంవత్సరానికి రూ. 12 వేల ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. అలాగే రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గ ప్రసాద్, నాయకులు శనిగరపు రాజ్‌కుమార్, ఆటో డ్రైవర్లు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, రుఖుమొద్దిన్, రహిమొద్దిన్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

ఐనవోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మదేవి ఆలయ నిర్మాణ పనులను దేవస్థానం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు గురువారం పరిశీలించారు. హైదరాబాద్‌కు చెందిన మల్లన్న భక్తుడు పర్షసర్వేశ్వరయాదవ్‌రావు తన సొంత నిధులు సుమారు రూ. 30 లక్షల వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. ఎండోమెంట్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు(స్థపతి) పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. జనవరిలో జరిగే జాతర వరకు ఆలయ నిర్మాణ పనులను పూర్తిచేసేందుకు పనులను వేగవంతంగా చేస్తున్నారు. ప్రస్తుత ఆలయం జీర్ణోద్ధరణలో భాగంగా నూతనంగా ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు ఈవో తెలిపారు. సంక్రాంతి నుంచి ఉగాది వరకు ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తుల్లో మహిళా భక్తులు బోనం వండి బోనాలతో ఆలయం చుట్టు ప్రదిక్షణలు చేపట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ. నూతన ఆలయ నిర్మాణం పూర్తయితే భక్తులకు సౌలభ్యంగా ఉండనుంది. జాతరకు ముందే ఆలయ నిర్మాణం పనులు పూర్తి చేసి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

'లింగమూర్తి కుటుంబానికి అండగా ఉంటాం'

భీమదేవరపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యడు సామల లింగమూర్తి కుటుంబానికి అండగా ఉంటాని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ గడ్డు పరిస్థితుల్లో ఉన్న సమయంలో లింగమూర్తి పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారన్నారు. భవిష్యత్తులో వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. లింగమూర్తి సతీమణి, ఆయన పెద్దకుమారుడు రాంబాబు, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికే కులగణన

ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

సర్వేను పరిశీలించిన ప్రజాప్రతినిధులు



పున్నేలులో పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో



భీమదేవరపల్లిలో స్టిక్కరింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో రమేష్

ఆత్మకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల కోసమే కులగణన సర్వేను ప్రభుత్వం నిర్వహిస్తోందనీ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో సర్వేలో భాగంగా ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్‌తో పాటు గ్రామంలో పర్యటించి ప్రజల వివ రాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం సర్వే చేయిస్తుందని ఈ సర్వేలో అధికారులతోపాటు నాయకులు కూడా పా ల్గొనాలని సూచించారు. సంక్షేమ పథకాలు అందాలన్నా, ఎన్నికల్లో రిజర్వేషన్లు రావాలన్నా ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

మండలంలోని 16 గ్రామాలలో అధికారులు పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఇంటింటికి స్టిక్కర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో నారాయణ, కాంగ్రెస్ జిల్లా నాయ కులు ముద్దం సాంబయ్య, ముద్దం కృష్ణం రాజు, మండల అధికార ప్రతినిధి అబ్దుల్ గఫూర్, సామల భద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

65 శాతం స్టిక్కరింగ్ పూర్తి

భీమదేవరపల్లి, (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో సమ గ్ర కుల గణన సర్వేలో 65శాతం ఇళ్లకు స్టిక్క రింగ్ పనులు పూర్తయ్యాయని, ఆర్డీవో రాథోడ్ రమేష్ అన్నారు. గురువారం భీమదేవరపల్లి మండలం కేంద్రంలో ఇంటింటికి స్టిక్కరింగ్ పను లను తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వీరే శంతో కలిసి పరిశీలించారు. భీమదేవరపల్లిలో 15,333, వేలేరులో 6132, ఎల్కతుర్తిలో 12,299, కమలాపూర్‌లో 19,803, హసన్‌పర్తిలో 9,366, ధర్మసాగర్‌లో 13,677, ఐనవోలులో 16,287 ఇళ్లు ఉన్నాయన్నారు. అలాగే హనుమకొండ, కాజీపేట జీహెచ్‌ఎంసీ పరిధిలో 1,32,926 ఇళ్లు ఉన్నాయన్నారు. వీటికి 1916 ఎన్యుమరేటర్లు, 196మంది సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పరిశీలన

ఐనవోలు, (ఆంధ్రజ్యోతి): జడ్పీ సీఈవో విద్యలత గురువారం పున్నేలు, పంథినిలో ఇంటింటా కుటుంబ సర్వే స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేలో ఎలాంటి పొరపాటు జరుగకుండా వివరాలను అడిగి నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు. ఎన్యూమరేటర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



కొనుగోలు కేంద్రంలో సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

ఐనవోలు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : కొండపర్తి ధాన్యం కొనుగోలు కేంద్రా న్ని అడిషినల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి గురువారం పరిశీలించారు. కొనుగోలు సెంటర్ నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. సన్న రకం ధాన్యం కొలతలను ఏవిధంగా చేపడుతారని అడిగి తెలుసుకున్నారు. కొలతల్లో తేడా వస్తే సన్నాలుగా నమోదు చేయవద్దని సూచించారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు రైస్ మిల్‌ను కేటాయిస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు లేకుం డా చూడాలని ఆదేశించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, డీటీ అనిల్, సెర్ప్ బాధ్యులు శిరీష, పద్మ, శ్రీలత, సీసీ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి

భీమదేవరపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులు వరి ధాన్యాన్ని విక్రయించాలని అడిషనల్ డీఆర్‌డీవో సుధీర్ అన్నారు. గురువారం మండలంలోని వంగరలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో 48 ఐకేపీ కేంద్రాలకు గాను 36 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయన్నారు. ధాన్యం కోత కానీ ప్రాంతాల్లో కొద్దిగా ఆలస్యంగా ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. సన్నరకం వరిధాన్యానికి రూ. 500 బోనస్‌తో కలిపి రైతులకు నగదు చెల్లిస్తామన్నారు. ఇందులో ప్రజలు ఎలాంటి అపోహలు చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం దేవానంద్, వ్యవసాయాధికారి పద్మ, ఏఈవోలు రవితేజ, సీసీ సతీష్, వీవో అధ్యక్షురాలు కడారి మంజుల, కార్యదర్శి రజిత, కోశాధికారి భూశెట్టి రమ, వీవోఏ కమల, రాధిక, నాయకులు చిట్టంపల్లి అయిలయ్య, చంద్రారెడ్డి, ఒల్లా రమేష్, గజ్జెల సంజీవ్, తిరుపతిరెడ్డి, శ్రీరామోజు మొండయ్య పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎర్ర జెండా

సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి

ఎల్కతుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పేదల పక్షాన ఎర్రజెండా పార్టీ అండగా ఉంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మండల శాఖ మొదటి మహాసభ జిల్లా కమిటీ సభ్యుడు గుమ్మడి రాజుల రాములు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అంబాల స్వరూప, లోకిని స్వరూపల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సుందరయ్య భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, జిల్లా కార్యదర్శి సభ్యుడు సారంపల్లి వాసుదేవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు గొడుగు వెంకన్నలు హాజరైయ్యారు. సభ ప్రారంభంలో జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ముఖ్య అతిధులు మాట్లాడుతూ .. సీపీఐ పార్టీ ప్రతీ గ్రామంలో విస్తరించాలన్నారు. పేదల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. బీజేపీ బహుళ జాతి కంపెనీలకు కొమ్ముకాస్తు పేదల నడ్డి విరుస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలలో కేవలం ఉచిత విద్యుత్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప మరే పథకం అమలు కావడం లేదన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దుంపెల్లి అరుణ పాల్గొన్నారు.

స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

శాయంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా పోలీసులు కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం శాయంపేట పోలీస్ స్టేషన్‌ను సీపీ తనిఖీ చేశారు. ఈ క్రమంలో పోలీస్ ఆర్టికల్స్, రిసెప్షన్ పనితీరు, పరిసరాలను తనిఖీ చేసి, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీషీటర్ల వివరాలు, ప్రమాదాల నివారణ చర్యలు, కోర్టు పెండింగ్ కేసులు, దర్యాప్తు వివరాలు తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. నిజాయితీగా పని చేస్తూ, పోలీసులపై నమ్మకాన్ని పెంచాలని సూచించారు. పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టేషన్ అధికా రులు, సిబ్బంది సత్ప్రవర్తనతో ఉంటూ ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. తదనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ తనిఖీలలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, పరకాల ఏసీపీ కిషోర్ కుమార్, సీఐరంజిత్ రావు, ఎస్ఐ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఐకేపీ కేంద్రాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే



ధర్మసాగర్ మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్ , నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే రాజయ్య గురువారం సందర్శించారు. రైతుల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఐకేపీ ద్వారా రైతుల ఖాతాలో ఇప్పటి వరకు డబ్బులు పడలేదన్నారు. రైతులను పట్టించుకోకపోవడం వల్ల దళారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని అన్నారు. సన్న, దొడ్డు వడ్లకు బోనస్ చెల్లిస్తామని చెప్పి కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్‌ను చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ఎమ్మెల్యేకు పట్టించుకునే సమయం కూడా లేదా అన్ని రాజయ్య ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రభుదాస్, జూబేదలాల్, సోవిఎరెడ్డి ,బాలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేలేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రా మంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకు న్నట్లు ఎస్‌ఐ ఏ.సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన రేణ సత్యనారా య ణ పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి విక్రయిస్తున్నట్లు తెలి పా రు. ఈ క్రమంలో తన ఇంటి వద్ద సేకరించిన బియ్యాన్ని నిల్వ చేయ గా పోలీసులు గ్రామంలో తనిఖీ చేస్తున్న క్రమంలో 5.50 క్వింటాళ్ల బియ్యా న్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ. 9900 ఉంటుందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొ న్నా రు. బియ్యాన్ని పట్టుకున్న కానిస్టేబుళ్ల వెంకటయ్య, హోంగార్డులను ఎస్సై సురేష్ అభినందించారు.


చింతల శివకృష్ణ


నూకల అనిల్


తిక్క వినోద్


బండి ప్రశాంత్


నల్లపు అనిల్ (ఆర్మీ)


యూ వెంకటేశ్వర్లు, (ఆర్మీ)


యాసం ప్రశాంత్ (సీఐఎస్ఎఫ్)


కన్నెబోయిన కుమార్ (ఆర్మీ)

దేశ సేవలో.. రైతు బిడ్డలు

- పుట్టింది పూరి గుడిసెల్లో.. చేరింది సైన్యంలో..
- ఒకే ఊరి నుంచి ఏడుగురు సైనికులు
- మాతృభూమిపై మమకారంతో ముందుకొస్తున్న యువకులు
- పుట్టిన గ్రామం, అయిన వారిని వదిలి దేశం కోసం సేవ
- త్రివిధ దళాల్లో సీతారాంపురం, అప్పలరావుపేట యువత


ఇష్టబోయిన నరేష్ యాదవ్


ఇష్టబోయిన రమేష్ యాదవ్


బండి తిరుపతి

పరకాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నింగి అంచున రెపరెపలాడుతున్న ఓ త్రివర్ణ పతాకమా నీ సంతోషానికి కారణం ఏమిటని ప్రశ్నిస్తే ఇదిగో నా సైనికుల గుండెలపై మోస్తున్న జెండా అంటూ బదులిచ్చింది. పుట్టింది పూరి గుడిసెల్లో అయినా మాతృభూమిపై మమకారంతో పుట్టిన ఊరు, అయిన వారిని వదిలి ఏళ్ల తరబడి దేశ రక్షణకు అంకితమయ్యారు. ఆ యువకులు ఆదర్శంగా నిలుస్తున్నారు. హనుమకొండ జిల్లా పరకాల మునిసిపల్ విలీన గ్రామం సీతారాంపురానికి చెందిన ఇష్టబోయిన రమేశ్, తిక్క వినోద్, బండి తిరుపతి, ఇష్టబోయిన నరేశ్, నూకల అనిల్, చింతల శివకృష్ణ, బండి ప్రశాంత్ (సీఆర్‌పీఎఫ్)కు ఒకే ఊరి నుంచి ఏడుగురు జవాన్లుగా ఎంపికయ్యారు. ఇందులో కొందరు తండ్రిని కోల్పోయి తల్లుల ఆసరాతోనే దేశ సేవ కోసం ముందడుగు వేశారు. అందరూ రైతు బిడ్డలే. వ్యవసాయ పనులు చేసుకొని జీవనం సాగించేవారే.

ఇందులో చింతల శివకృష్ణ కుటుంబం పేదరికంలో ఉండేది. ఒకసారి గాలివానకు ఊరు చివర వేసుకున్న పాక కొట్టుకపోయింది. కొన్ని రోజులు ప్రభుత్వ పాఠశాలలోని ఓ గదిలో తల దాచుకున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఓ వైపు అప్పులు మరో వైపు ఆర్థిక ఇబ్బందులతో కాలం వెళ్లదీసే కుటుంబాలే. బండి రవి- సులోచన దంపతుల కుమారులు తిరుపతి, ప్రశాంత్. రవి తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తూ అలాగే వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. అనుకోకుండా రవి మృతితో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భర్త చనిపోయినా సులోచన ధైర్యం కోల్పోకుండా పట్టుదలతో ఇద్దరి కుమారులను దేశ సేవ కోసం సైన్యంలోకి పంపించింది. అదేవిధంగా నూకల కొమురయ్య కుమారుడు అనిల్ చాలా కష్టపడి సీఆర్పీఎఫ్‌లో ఉద్యోగం సంపాదించాడు. తన తండ్రి తమ గొర్లను కాస్తూ వ్యవసాయం చేసేవాడు. తను కూడా అకాల మరణంతో అనిల్ కృంగిపోకుండా దేశ సేవ చేయాలనే పట్టుదలతో ముందుకు సాగాడు. నిరుపేద కుటుంబాల పిల్లలే నేడు సైనికుల్లా మారారు.

దేశ రక్షణకు అంకితం..

దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరిన యువకులకు నేటికి ఇబ్బందులు తప్పడం లేదు. సరిహద్దుల్లో ప్రాణాలను లెక్క చేయకుండా దేశ రక్షణ కోసం ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఏళ్ల తరబడి కన్నవారిని, పుట్టిన గ్రామాన్ని వదిలి సేవ చేస్తున్నారు. ఇందులో ఒక్కరిద్దరికి పెళ్లయినా భార్య పిల్లలను వదిలి దేశ రక్షణ కోసం వెళ్లారు. ఎన్నో కష్టనష్టాలను ఓర్చి దేశ సేవ చేస్తున్న యువకులది మా ఊరు అంటూ చెప్పుకొని ఆ గ్రామం నేడు గర్విస్తోంది. అంతే కాకుండా గ్రామానికి చెందిన ఇష్టబోయిన సురేశ్ ఎస్ఐగా ఉద్యోగం నిర్వహిస్తున్నాడు.

అడప రాజు కానిస్టేబుల్‌గా.. ఇలా గ్రామం నుంచి పోలీసు సేవలు అందించడం సీతారాంపురం గ్రామానికి ఆదర్శంగా నిలుస్తోంది.

తల్లిగా గర్వపడుతున్నా..



బండి సులోచన, సీతారాంపురం

భర్త చనిపోయినా ధైర్యం కోల్పోలేదు. పిల్లలను దేశ రక్షణలో చేర్పించాలని ఒక సంకల్పంతో ముందుకు సాగా. అడ్డంకులు, ఇబ్బందులు వచ్చినా ఇద్దరు కుమారులు పట్టుదలతో సైనికులై దేశ సేవ చేస్తున్నారు. నాకు చాలా గర్వంగా ఉంది.

మా ఊరు నుంచే ఎక్కువ మంది సైనికులు



నల్లెల్ల జ్యోతి, కౌన్సిలర్

మా ఊరు సీతారాంపురం నుంచే దేశ రక్షణ కోసం ఏడుగురు జవాన్లు ఎంపికయ్యారు. దేశ సేవ చేయడం చాలా సంతోషంగా ఉంది. అందులో మా బంధువులు కూడా ఉన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మరి కొంత మంది యువకులు సైన్యంలో చేరేందుకు ముందుకు వస్తున్నారు.

ఆదర్శం

నెక్కొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నేడు విద్యావంతులు ఆర్థికంగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని జన్మభూమిని వదిలి 70 శాతం మంది విదేశాలకు వెళ్తున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామ యువకులు దేశ సేవ కోసం ఆర్మీలో చేరి ఆదర్శంగా నిలుస్తున్నారు. పిల్లలు ఆర్మీలో చేరడానికి తల్లిదండ్రులు అడ్డు చెప్పకపోగా జన్మభూమికి సేవచేసే భాగ్యం అందరికి దొరకదంటూ ప్రోత్సహిస్తు న్నారు. గతంలో గ్రామంలో యువత వ్యవసాయం తో పాటు కులవృత్తులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకునేవారు. ప్రభుత్వం ఉద్యోగం అంటే ఏమిటో తెలియని ఆ గ్రామం నుంచి ఏకంగా దేశరక్షణ కోసం వీధికొక్కరు ఎంపికయ్యారు. ఈ ఒక్క గ్రా మం నుంచే ఇరవై మందికి పైగా త్రివిధ దళాలైన ఇండియన్ ఆర్మీ, నావికదళం, ఎయిర్‌ఫోర్స్‌లో విధు లు నిర్వర్తిస్తున్నారు. మండల ప్రజల నుంచి అభినందనలు అందుకుంటున్నారు.

ఆర్మీలో చేరుతున్న యువత

నాటి నుంచి నేటి వరకూ ప్రతి ఏటా గ్రామానికి చెందిన యువకులు సైన్యంలో చేరుతున్నారు. ఇప్పటి వరకు ఇరవై మందికి పైగా రక్షణ విభాగంలోని అనేక శాఖల్లో విధులను నిర్వర్తిస్తున్నారు. యువత సైన్యంలో చేరుతుండడంతో అప్పల్‌రావుపేట గ్రామానికి జిల్లాలో మంచి గుర్తింపు వస్తుంది. సైన్యంలోనే కాకుండా పోలీసు శాఖలో సైతం పలువురు విధులు నిర్వహిస్తున్నారు. యువత సైన్యంలో చేరాలంటూ ఆర్మీలో విధులను నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రోత్సహిస్తున్నారు.


అప్పల్‌రావుపేట

ఆర్మీ వీరులు వీరే..

ఆర్మీల్లో 18 సంవత్సరాల నుంచి ఊడుగుల సంతోష్, మడత రాజ్‌కుమార్, ఊడుగుల వెంకటేశ్వర్లు, ముత్తినేని శివ, నల్లపు అనిల్, కన్నెబోయిన కుమార్, మురారిశెట్టి రాజులు విధులు నిర్వర్తిస్తున్నారు. సీఐఎస్ఎఫ్‌లో బోళ్ల అనిల్, యాసం ప్రశాంత్, మహ్మద్ రహీంపాషా, బోళ్ల అరుణ్, కొయ్యడి అఖిల్, నావికదళంలో బేర మణికృష్ణ, ఎయిర్‌ఫోర్స్‌లో అక్కల అనిల్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు.

ఒకే కుటుంబంలో పోలీసులుగా..

ఈ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన తిప్పని చంద్రశేఖర్, తిప్పని శ్రావణ్, తిప్పని రంజిత్ కుమార్, తిప్పని అరుణ్‌కుమార్ విధులు నిర్వర్తించడం విశేషం. అలాగే మడత సృజన, మాలి సురేష్ కూడా పోలీసు శాఖలో పని చేస్తున్నారు.


బోర్ల అరుణ్ (సీఐఎస్ఎఫ్)


మడత సృజన (పీసీ)

మొదట సైన్యంలో చేరిన మైబూబ్‌పాషా, శ్రీధర్


మైబుబ్‌పాషా (బీఎస్ఎఫ్)

సైనిక ఉద్యోగం అంటే భయపడుతున్న రోజుల్లో ఇదే గ్రామానికి చెందిన మైబూబ్‌పాషా బీఎస్ఎఫ్, ఊడుగుల శ్రీధర్ 2001 సంవత్సరంలో ఆర్మీల్లో చేరారు. ఇద్దరు యువకులు ధైర్యంగా ముందడుగు వేయడంతో యువతకు దేశరక్షణలో సేవలందించాలనే ఆసక్తి కల్గింది. అప్పటివరకూ ఆర్మీలో చేరాలంటే ఉన్న భయాన్ని యువత, వారి తల్లిదండ్రుల్లో పారదోలి ఆదర్శంగా నిలిచారు.


ఊడుగుల శ్రీధర్ (ఆర్మీ)

అంతర్జాతీయ విమానాశ్రయంగా మామునూరు

- ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఉపాధి అవకాశాలు
- వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తాం
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఎంపీ, ఎమ్మెల్యేలతో ఎయిర్‌పోర్టు సందర్శన

శంభునిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర అభివృద్ధిలో ఎంతో కీలకమైన మామునూరు ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దుతామని, ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారదలతో కలిసి ఆమె గురువారం మామునూరు విమానాశ్రయాన్ని పరిశీలించారు. భూసేకరణ గురించి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి అనంతరం ఎయిర్‌పోర్టుతో భూములు కోల్పోతున్న నక్కలపల్లి, గాడెపల్లి, గుంటూరుపల్లి గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. మామునూరు విమానాశ్రయం కోసం 253 ఎకరాల భూమి అవసరం ఉండగా, ఆ భూముల యజమానులు 233 మంది రైతులు, ప్లాట్ల యజమానులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న రైతులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు.

చారిత్రక నేపథ్యం ఉన్న వరంగల్‌లో పర్యాటకపరంగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, భద్రకాళి, వేయిస్తంభాల ఆలయాలతో పాటు మెగా టెక్స్‌టైల్ పార్కు, భవిష్యత్ పరిశ్రమలకు అనుగుణంగా మామునూరు ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లాలో మెగా టెక్స్‌టైల్ పార్కుతో పాటు పలు పరిశ్రమలు ఉండటం వలన ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి 150 కిలోమీటర్లలోపు ఉన్న వరంగల్‌లో ఎయిర్‌పోర్టు కుదరదని చెప్పినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం, జీఎంఆర్ సంస్థను ఒప్పించారన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా ప్రజల తరపున మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు భూములు అప్పగించేందుకు అంగీకరించిన రైతులను, స్థానిక ప్రజలకు మంత్రి సురేఖ ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపి అభినందించారు. రైతులకు, ప్లాట్ల యజమానులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లిస్తామన్నారు. అందుకు కావాల్సిన నిధులు, రైతులకు కేటాయించే స్థలాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కావాల్సిన మ్యాపింగ్, పరిహారం చెల్లింపు సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి పంపించాలని జిల్లా కలెక్టర్ సత్యశారదను మంత్రి సురేఖ ఆదేశించారు.


అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు

ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా రవాణా వ్యవస్థ మెరుగుపడాలన్నారు. అందుకు అణుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విమానాశ్రయం ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనితోపాటు నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వేలైన్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులకు భూములు త్యాగం చేసిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కావాల్సిన నిధులను సీఎం ద్వారా మంత్రి కొండా సురేఖతో కలిసి మంజూరు చేయిస్తామని అన్నారు.

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నగర ప్రజల కల అయిన ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో నగర రూపురేఖలు మారుతాయన్నారు. నగర అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఓరుగల్లు ప్రజలు రుణపడి ఉంటారన్నారు. స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు, ఇన్నర్ రింగ్‌రోడ్, ఓఆర్ఆర్, అండర్ డ్రైనేజీ నిర్మాణాలతో వరంగల్ ప్రపంచ శ్రేణి నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులను సంతృప్తి పరిచి వారి అంగీకారం మేరకు ముందుకు వెళ్లాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సహకరిస్తున్న రైతులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని, ప్రస్తుతం ఉన్న భూమిని పూర్తి స్థాయిలో సర్వే చేయించి మ్యాపింగ్ చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలు, రైతులు కోరుతున్న ధరలు, కావాల్సిన నిధులతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి సమర్పిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణచందర్, ఈదురు అరుణ, బైరబోయిన ఉమదామోదర్ యాదవ్, చింతాకుల అనిల్, సురేష్ జోషి, భోగి సువర్ణ -సురేష్, ముష్కమల్ల అరుణ, ఓని స్వర్ణలత, సోమిశెట్టి ప్రవీణ్, పల్లం పద్మ, ఫుర్ఖాన్, టీపీసీసీ సెక్రెటరీ మీసాల ప్రకాశ్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగేందర్‌రావు, ఈఈ జితేందర్ రెడ్డి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- రుణమాఫీలో సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తాం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వర్ధన్నపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఏఎంసీ ప్రమాణ స్వీకారానికి హాజరు

వర్ధన్నపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం వర్ధన్నపేట పట్టణంలో అమృత్ పథకాలకు సంబంధించిన శిలాఫలకాలకు, మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పథకాలకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలతో కలిసి శంకు స్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామాల్లో నడిబొడ్డున గ్రామ సభ ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తిస్తామని పేర్కొన్నారు. రుణమాఫీకాని రైతులకు సాంకేతిక లోపాలు తొలగించి డిసెంబర్ చివరి నాటికి వారి ఖాతాలో డబ్బులు జమ చేయనున్నామన్నారు. రైతుబంధు పథకం ద్వారా రైతులను ఆదుకుంటామని తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, సభకు హాజరైన ప్రజలు

దేశ చరిత్రలోనే రూ.31వేల కోట్లు రైతుల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని అన్నారు. కారు కూతలు కూసిన ప్రతిపక్ష నేతలు టైరు కింద తలకాయ పెడతారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ పథకాలన్నీ గులాబీ రంగు చొక్కా వేసుకున్న వారికే చెందాయని విమర్శించారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున పక్కా గృహాలను మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు.

ఈ ఐదేళ్లలో అర్హులైన వారందరికీ అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అవసరయ్యే విధంగా, అన్ని సంక్షేమ పథకాలకు ఉపయోగపడేలా ఒక్కో కుటుంబానికి ఒక స్మార్ట్ కార్డును అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు చెప్పిన, చెప్పని అంశాలు, అభివృద్ధి పనులు చేసి చూపించామన్నారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

అనంతరం వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నరుకుడు వెంకటయ్య, డైరెక్టర్‌లతో సభా వేదికపై ప్రమాణ స్వీకారం చేయించారు. సభలో స్థానిక ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గంలోని విలీన గ్రామాల్లో మౌలిక వసతులు కరువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గానికి అదనంగా మరో 1,500 గృహాలను మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, కమిషనర్ సుధీర్‌కుమార్, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి, పిన్నింటి అనిల్‌రావు, ఎద్దు సత్యనారాయణ, మైస సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పంటలకు మద్దతు ధర అందేలా కృషి
- కేంద్రం పత్తి దిగుమతులు నిలిపివేయాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు
- సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కాటారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మద్దతు ధర అందేలా సర్కారు కృషి చేస్తోందని తెలిపారు. మండలంలో ఆయన గురువారం పర్యటించారు. కాటారంలోని మీనాక్షి, చల్లపల్లిలోని రుద్ర జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంత్రి ప్రారంభించారు. రైతులు ట్రాక్టర్లలో తెచ్చిన పత్తిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి పెట్టుబడులు, దిగుబడులు, ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. మీనాక్షి జిన్నింగ్ మిల్లులో పత్తి జిన్నింగ్ చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ దేశంలో పత్తి దిగుబడులు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయన్నారు. నాణ్యమైన పత్తి లక్షలాది టన్నుల నిల్వలున్నా కేంద్రం విదేశాల నుంచి దిగుమతులు చేసుకోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. కేంద్రం పత్తి దిగుమతులు నిలిపేసి రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. సీసీఐ ద్వారా పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 చెల్లిస్తున్నా తేమ శాతం పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తేమ శాతంపై సీసీఐ కఠినంగా వ్యవహరించకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా సీసీఐ కేంద్రాల నిర్వాహకులు పత్తి కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. వడ్ల కొనుగోళ్ల కోసం పీపీసీల ప్రారంభం జరుగుతుందన్నారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేలా ప్రభు త్వం చర్యలు తీసుకుంటుందన్నారు.


కాటారంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మిల్లర్లు తేమ, తాలు పేరిట కటింగ్ చేస్తే సహించేది లేదన్నారు. రైతులు వడ్లను శుభ్రపరిచి ఆర బెట్టి కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర అందుతుందని తెలిపారు. కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)అశోక్ కుమార్, డీసీఎస్‌వో శ్రీనాథ్, సివిల్ సప్లయ్ డీఎం రాములు, డీసీవో వాల్యానాయక్, డీఎంవో కనకశేఖర్, ఏఎంసీ కార్యదర్శి లా షరీఫ్, సీపీవో ఇలంగోన్, మిల్లర్లు సాగర్‌రెడ్డి, శివకుమార్, సాంబిరెడ్డి, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే.. దేశానికే దిక్సూచి

- కుల గణనతో పెరగనున్న బీసీ రిజర్వేషన్లు
- అధికారులకు ప్రజలు సహకరించాలి
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణన ఇంటింటి కుటుంబ సర్వే తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు సామల లింగమూర్తి ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించి ఓదార్చారు. అనంతరం గట్లనర్సింగాపూర్ గ్రామంలోని పలు విధుల్లో పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.


గట్లనర్సింగాపూర్‌లో కూరగాయలు అమ్మే మహిళతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అలాగే గట్లనర్సింగాపూర్ గ్రామంలో జరుగుతున్న ఇంటింటి కులగణన సర్వేను పరిశీలించారు. కుల గణనపై అధికారులకు సమగ్ర వివరాలు ఇవ్వాలని, సమాచారం గోప్యత ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, కూరగాయలు అమ్ముతున్న మహిళలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో 1.17 కోట్ల ఇళ్లపై సర్వే జరుగుతుందన్నారు. ఇందుకోసం 87వేల మంది ఎన్యుమరేటర్లను నియమించామన్నారు. ప్రస్తుతం ఇళ్లకు సర్వేలో స్టిక్కరింగ్ జరుగుతుందన్నారు. సర్వే ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉందన్నారు.

ప్రధాని కులాన్ని అడిగామా ?

'ప్రధాని నరేంద్రమోదీ ఏం కులమో తాము అడిగామా..? రాహుల్‌గాంధీ కులాన్ని అడిగేందుకు బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఎవరు' అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో పాదయాత్ర నిర్వహించిన సందర్భంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుల గణన చేస్తామని ప్రకటించారన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కుల గణన చేస్తుంటే బీజేపీ పార్టీ అక్కసును వెళ్లగక్కుతోందన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణనకు బీజేపీ పార్టీ వ్యతిరేకమన్నారు. రాహుల్‌గాంధీ కులాన్ని ప్రశ్నించడం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వ్యక్తిగతమా..? లేక బీజేపీ సిద్ధాంతమా..? తెలపాలని పొన్నం ప్రశ్నించారు. ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుద్ధి, జ్ఞానం లేని వాళ్లు రాహుల్‌గాంధీ కులం గురించి ప్రశ్నిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేస్తే ఎవరి కులం ఏమిటో బయట పడుతుందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కులగణనకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజు, ఏఎస్‌వో రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గుడికందుల మధు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, నాయకులు పిడిశెట్టి కనకయ్య, ఎదులాపురం తిరుపతి, పొన్నాల మురళీ పటేల్, బీపీటీ అయిలయ్య, పోచయ్య, నాగరాజు, చెప్యాల ప్రకాష్, స్వర్ణలత, కంకల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య నివేదన
శుక్రవారం • 8 నవంబరు 2024

శైవ -బౌద్ధ సమాగమం

ధర్మపథం

హిందూ చాంద్రమానంలో కార్తిక మాసం ఎనిమిదో నెల. ఇది దక్షిణాయనంలో వస్తుంది. బౌద్ధంలో 'కఠిన మాసం' మూడు నెలల వర్షాకాలం ముగింపులో వస్తుంది. బౌద్ధ భిక్షువులకు వస్త్రాలు, ఔషధాలు, భోజనం, నివాస స్థలాలు లాంటి నాలుగు ప్రాథమిక అవసరాలను అందించడం ద్వారా భక్తులు తమ కృతజ్ఞతలను తెలియజేస్తారు. హిందువులకు కార్తికమాసం మాదిరిగా ఇది బౌద్ధులకు ఒక పవిత్ర మాసం. నిజానికి హిందూ, బౌద్ధ సంప్రదాయాల మధ్య చాలా సామ్యం కనిపిస్తుంది. హిందువులకు శివుడు ఆరాధ్య దైవమైతే... బౌద్ధులకు అవలోకితేశ్వరుడు ఆరాధ్య దైవం. ఇండోనేసియాలోని జావా, బాలి ప్రాంతాల్లోని హిందూత్వం... శైవ, బౌద్ధ అంశాల సమ్మేళనం. అక్కడ దీన్ని 'ఆగమ శివ-బుధ' లేదా 'ఆగమ హిందూ-బుధ' సంప్రదాయం అంటారు. అవలోకితేశ్వరుడి గురించి రాసిన ప్రధాన మహాయాన సూత్రాలలో 'కారండక వ్యూహ సూత్రం' ఒకటి. ఈ సూత్రంలో అవలోకితేశ్వరుణ్ణి అందరికన్నా పూర్వీకుడిగా కీర్తించారు. ఒకానొక సమయంలో బుద్ధుడు శ్రావస్తి నగరంలో, అనాథపిండకుడి ఉపవనంలో నివసిస్తున్నాడు. అక్కడికి స్వర్గలోక దేవతలు, బోధిసత్త్వులు, భిక్షువులు వేంచేసారు. విష్ణువు, శివుడు స్వయంగా బుద్ధుడి ఉపదేశాలను వినడానికి హాజరైనట్టున్న వర్ణనలు 'కారకండ వ్యూహసూత్రం'లో దొరుకుతాయి.

ఈ సూత్రం ప్రకారం... అవలోకితేశ్వరుడి నుదుటి నుంచి శివుడు జన్మించాడు. తన శరీరం నుంచి శివుడు ఉద్భవించిన తరువాత... అతనితో అవలోకితేశ్వరుడు మాట్లాడుతూ కలియుగంలో తను జన్మిస్తాననీ, ప్రపంచ సృష్టికర్త అయిన ఆది దేవుణ్ణి తనేననీ చెప్పాడు. కలియుగంలో జ్ఞాన మార్గా న్ని కోల్పోయిన మానవులు అవలోకితేశ్వరుణ్ణి విస్మరించి... శివారాధన వైపు మళ్ళారని, 'అంతరిక్షం అతని లింగం, భూమి అతని పీఠం, ఇంకా అన్ని జీవులు అతనిలో కలిసిపోతాయి' అని పేర్కొంటూ.. శివుణ్ణి లింగ రూపంలో ఆరాధించడం మొదలుపెట్టారనీ ఆ సూత్రం పేర్కొంటోంది.

మరి కొన్ని గాథల ప్రకారం... వ్యాకరణ శాస్త్రాన్ని బోధించమని అడిగిన శివుని అభ్యర్థనపై అవలోకితేశ్వరుడు బుద్ధత్వానికి సంబంధించిన 'భవిష్యసి త్వం కులపుత్ర వివృతాయాం లోకధాతౌ, భస్మేశ్వరో నామ తథాగతోర్హన్ సమ్యక్ సంబుద్ధో విద్యాచరణ-సంపన్నో, సుగతో, లోకవిదనుత్తరో పురిస దమ్మ సారథీ, సత్తా దేవ మనుస్సానం' అనే ప్రవచనాన్ని అందించాడు. 'తథాగత తత్త్వ సంగ్రహం'లో... శివుడు భవిష్యత్ బుద్ధుడిగా మారాడనే విషయం ఉంది. బౌద్ధులు మొదట్లో శైవ సిద్ధాంతాన్ని విమర్శించారు. చివరకు శివుణ్ణి జ్ఞానోదయం పొందిన బుద్ధుడిగా మహాయాన బౌద్ధంలో అంగీకరించడం జరిగింది. శివుడు... అవలోకితేశ్వరుడి నుంచి ఉద్భవించినట్టు పరిగణిస్తున్నందున... శివుని లక్షణాలు అనేకం అవలోకితేశ్వరుడికి ఆపాదించారు. ఇదంతా శివుణ్ణి బౌద్ధమతంలో ఒక దేవతగా మార్చే ప్రయత్నమేనని కొందరు భావిస్తారు. ఈ విషయంలో లోతైన అధ్యయనం అవసరం.



ఆచార్య చౌడూరి ఉపేంద్రరావు
జెఎన్‌యూ, ఢిల్లీ.

సహజయోగ

శివుడు ప్రసన్నం కావాలంటే...



ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యత ఉన్న మాసం కార్తికం. భక్తులందరూ శివాలయాల దర్శనం, అభిషేకాలు, పూజలు, ఉపవాసాలతో ఈ మాసమంతా గడుపుతారు. శివారాధనలో లీనమవుతారు. కానీ ఈ పూజలన్నీ శివుడికి ఆనందాన్ని ఇస్తున్నాయా? ఆ శంకరుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... నిత్య జీవితంలో మనం ఎలా ఉండాలి? ఈ అంశాలను సహజయోగప్రదాయిని శ్రీ మాతాజీ నిర్మలాదేవి తన ప్రవచనాలలో వివరించారు.

మన సూక్ష్మ శరీరంలో శివుని స్థానం... మన హృదయం. అక్కడ ఆత్మ రూపంలో శివుడు నివసిస్తాడు. సచ్చిదానంద స్వరూపమైన శివతత్త్వాన్ని, అంటే ఆయన సాన్నిధ్యాన్ని పొందడం సమస్త మానవాళి ఆధ్యాత్మిక ఉత్థానంలో పరమ గమ్యం. కొన్ని వేల సంవత్సరాల నుంచి ఋషులు, మునులు ఆ గమ్యాన్ని చేరడానికే కఠోరమైన తపస్సులు ఆచరించారు. ఇంతకీ శివతత్త్వం అంటే ఏమిటి? శివుని గుణగణాలు, స్వరూప స్వభావాలు ఏమిటి? వాటిని మనం ఎలా ఆకళింపు చేసుకోగలం? ఎలా ఆచరించుకోగలం? అనేవి ముందుగా తెలుసుకోవాలి.

అడిగినవన్నీ ఇచ్చే అమాయకత్వం, తనకోసం ఏమీ దాచుకోని త్యాగశీలత... ఇవి ప్రేమకు ప్రతిరూపమైన శివుడి ప్రత్యేక గుణాలు. ఆయనది అపరిమితమైన దయాగుణం. అందుకే రాక్షసులకైనా వారు కోరుకున్న వరాలు ఇచ్చేవాడు. శివుని అనుగ్రహంతో వరాలను పొంది, ఆ తరువాత లోకాన్నే కాదు, ఆయననూ ఇబ్బంది పెట్టిన రాక్షసుల కథలు కోకొల్లలు. భస్మాసురుడి కథ దీనికి ఒక ఉదాహరణ. అయినా ఆయన అడిగినవి కాదనకుండా ఇస్తూనే ఉంటాడు. అందుకే శివుణ్ణి భోళా శంకరుడు అంటారు. కానీ దుష్టులు, దుర్మార్గులు ఎప్పుడూ భౌతికమైన భోగ భాగ్యాలను, అధికారాన్ని, అపారమైన శక్తులను కోరుకుంటారు. వాటి కారణంగా అహంకారం పెంచుకుంటారు. తమ వినాశనాన్ని తామే కొనితెచ్చుకుంటారు. సజ్జనులు ఆధ్యాత్మికమైన సుగుణాలను, భగవంతుడి సేవా భాగ్యాన్ని కోరుకుంటారు. వాటి ద్వారా మోక్షాన్ని పొందుతారు. ఆ భగవంతుడికి చేరువవుతారు. సర్వాంతర్యామి అయిన శివుడికి ఇది తెలుసు.

విలువనిచ్చేది భక్తిప్రపత్తులకే...

విశ్వానికి అధినాథుడైన, లోకాలను ఏలే రాజైన శివుడికి తల మీద కిరీటమైనా ఉండదు. దేవతలందరూ కిరీటాలను, ఆడంబరమైన ఆభరణాలను ధరించినా... ఆ మహాదేవుడు మాత్రం జటాజూటంతోనే ఉంటాడు. ఆయన విలువనిచ్చేది భౌతికమైన వస్తువులకు, ఆభరణాలకు కాదు... ఆధ్యాత్మికతతో నిండిన వైఖరికి, భక్తిప్రపత్తులకు మాత్రమే. శంకరుడి నిరాడంబరత గురించి శ్రీ మాతాజీ ఒక సందర్భంలో ప్రస్తావిస్తూ.... శివ పార్వతుల వివాహ ఘట్టాన్ని వివరించారు. తన వాహనమైన ఎద్దును ఎక్కి, ఎలాంటి ఆభరణాలు లేకుండా, కేవలం వ్యాఘ్ర చర్మాన్ని ధరించి, విభూతిని, చందనాన్ని పులుముకొని... ఒక సన్యాసిలా శివుడు తన పెళ్ళికి తరలివచ్చాడు. పర్వతరాజ కుమార్తె అయిన పార్వతి. ఆమె సోదరుడైన విష్ణువు రాజులా సకల సిరిసంపదలతో, సమస్త అలంకారాలతో తులతూగుతూ ఉంటాడు. శివుణ్ణి, అతని పరివారాన్ని చూసిన పార్వతీదేవి సిగ్గుపడింది. 'ఏమిటీయన? వివాహానికి ఇలా వచ్చారు? ఆయన పరివారం కూడా అలాగే ఉన్నారు. ఒకరికి ఒకే కన్ను ఉంటే, మరొకరికి ఒక కొమ్ము ఉంది. ఇలా వస్తే మా బంధువులందరూ ఏమనుకుంటారు?' అనుకుంది. కళ్ళు మూసుకొని, విష్ణువును తలచుకుంటూ 'మన స్థాయి ఏమిటో అందరికీ అర్థమయ్యేలా చెయ్యి' అని ప్రార్థించింది. ఆమె కళ్ళు తెరిచి చూసేసరికి... శివుడి పాదాలను విష్ణువు కడుగుతూ కనిపించాడట. "నా దగ్గర ఉన్న సంపదలన్నీ నా సోదరికి కట్నంగా ఇచ్చినా... ఈయన పాదధూళికి సరితూగవు" అన్నాడట. శివుని నిరాడంబరతను, ఆయన గొప్పతనాన్ని ఈ కథ వెల్లడిస్తుందని శ్రీమాతాజీ పేర్కొన్నారు. సకల చరాచర సృష్టికర్త అయిన శివుడికి తన సృష్టి పట్ల ఉన్న ప్రేమను తెలియజేసే అద్భుతమైన ఘట్టం క్షీరసాగర మథనం. దేవతలు, రాక్షసులు, అమృతం కోసం అర్రులు చాస్తే... శివుడు మాత్రమే హాలాహలాన్ని స్వీకరించి... సమస్త విశ్వాన్నీ రక్షించాడు.

> **శివకేశవులు ఇద్దరూ ఒక్కటే. మార్గం విష్ణువు అయితే గమ్యం శివుడు. మన సూక్ష్మ శరీరంలోని కుండలినీ శక్తి జాగృతి చెందిన తరువాత... విష్ణువు అధిష్ఠానదేవతగా ఉండే సుషమ్నా మార్గం ద్వారా... ఊర్ధ్వ ముఖంగా ప్రయాణించి, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, సహస్రారంలో ఉండే శివుణ్ణి చేరుకుంటుంది.**

ఆత్మావలోకనం చేసుకోవాలి...

శివుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... మనలో ఆయన నివసించే చోటైన మన హృదయం స్వచ్ఛంగా ఉండాలి. దానిలో సాటి మానవుల పట్ల ప్రేమ ఉండాలి. కామం, లోభం, ప్రతిఫలాపేక్ష ఉండకూడదు. మన హృదయంలో ఆ మహాదేవుడి ప్రతిబింబం కొలువై ఉన్నదనీ, అది అన్నిటికీ మించినదనీ, మన మనస్సుకు, ఆలోచనలకు అతీతమైనదనీ గ్రహించాలి. శివతత్త్వాన్ని గ్రహించాలంటే ఆత్మావలోకనం చేసుకోవాలి. మన హృదయంలోని మురికిని తొలగించుకోవాలి. మనకు అసూయ ఉంటే హృదయం అనే అద్దం శుభ్రంగా ఉండదు. దానిలో భగవంతుడి ప్రతిబింబం కూడా పరిపూర్ణంగా ఉండదు. రోజూ శివుణ్ణి పూజిస్తున్నా, అభిషేకాలు చేస్తున్నా... మనలోని అరిషడ్వర్గాలను వదిలిపెట్టకపోతే శివతత్త్వాన్ని అందుకోలేం. దాన్ని పొందాలంటే హృదయం నిర్మలంగా ఉండాలి. ఎలాంటి అలజడులు లేకుండా, స్వచ్ఛమైన నీరు ఉన్న సరస్సు మాత్రమే ఆకాశంలోని సూర్యుణ్ణి చక్కగా ప్రతిబింబిస్తుంది. అదే విధంగా మన హృదయంలో ఎలాంటి ఆలోచనలు లేకుండా, నిర్విచారంగా, ఎవరిపట్లా ఏ విధమైన ద్వేషం, కోపం లేకుండా ఉన్నప్పుడు మాత్రమే.... భగవంతుడి నిజమైన స్వరూపాన్ని ప్రతిబింబించగలుగుతాం.

శివకేశవుల మధ్య భేదాన్ని చూడకూడదని కూడా శ్రీమాతాజీ ఉపదేశించారు. శివకేశవులు ఇద్దరూ ఒక్కటే. మార్గం విష్ణువు అయితే గమ్యం శివుడు. విష్ణువును పూజించనిదే శివుణ్ణి చేరుకోలేం. శివుణ్ణి పూజించకపోతే విష్ణువు మార్గంలో ఉండలేం. మన సూక్ష్మ శరీరంలోని కుండలినీ శక్తి జాగృతి చెందిన తరువాత... విష్ణువు అధిష్ఠానదేవతగా ఉండే సుషమ్నా మార్గం ద్వారా... ఊర్ధ్వ ముఖంగా ప్రయాణించి, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి, సహస్రారంలో ఉండే శివుణ్ణి చేరుకుంటుంది. మన సూక్ష్మ శరీరంలో ఎడమవైపున... శివుడి స్థానమైన హృదయ చక్రం... మన తల్లితో మనకు ఉన్న అనుబంధాన్ని సూచిస్తుంది. ఎవరైతే తల్లిని దైవ సమానంగా భావిస్తారో... వారిపట్ల శంకరుడు అత్యంత ప్రసన్నుడై ఉంటాడు. వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రుల సంరక్షణను, బాగోగులను పట్టించుకోనివాళ్ళు కాశీకి వెళ్ళి గంగానదిలో ఎన్నిసార్లు మునిగినా శివుడి అనుగ్రహం పొందడం కష్టం.

> **శివుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే మనలో ఆయన నివసించే చోటైన మన హృదయం స్వచ్ఛంగా ఉండాలి. దానిలో సాటి మానవుల పట్ల ప్రేమ ఉండాలి. కామం, లోభం, ప్రతిఫలాపేక్ష ఉండకూడదు.**

సత్యం తెలిసేది అక్కడే...

ఇక... ఆదిదంపతులైన శివపార్వతులు... భార్యాభర్తల మధ్య ఉండవలసిన ప్రేమానుబంధానికి ప్రతీకలు. ఏ ఇంట్లో భార్యాభర్తలు అటువంటి ప్రేమానుబంధాన్ని కలిగి ఉంటారో... వారి ఇంట్లో ఆ ఆది దంపతులు కొలువై ఉంటారు. శివుణ్ణి సచ్చిదానంద స్వరూపునిగా వర్ణించారు పూర్వులు. అంటే సత్యాన్ని, చిత్తాన్ని, ఆనందాన్ని స్వరూపంగా కలిగినవాడు. ఏ విషయంలోనైనా సత్యం అనేది సహస్రారంలో ఉండే ఆ సదాశివుడి పాదాల చెంతనే మనకు తెలుస్తుంది. మన చిత్తం ప్రకాశవంతమైనప్పుడే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. నిర్మలమైన ఆనందంతో ఉండే వ్యక్తి భగవంతుణ్ణి సంపూర్ణంగా ప్రతిబింబించగలుగుతాడు. సచ్చిదానంద స్వరూపమైన శివతత్త్వాన్ని పొందగలిగినవారి జన్మ ధన్యం. కానీ మన లోపల ఉండే అరిషడ్వర్గాలు దానికి అడ్డుపడతాయి. సహజయోగంలో కుండలినీ జాగృతి ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు... మనలోని ఆత్మ ఉనికిని అనుభూతి చెందడం ప్రారంభిస్తాం. ఆత్మ పరిశీలనద్వారా అరిషడ్వర్గాలను క్రమంగా తొలగించుకున్నప్పుడు పరిపూర్ణమైన ఆత్మస్వరూపులం అవుతాం. అప్పుడు భగవంతుడి ప్రతిబింబాన్ని మన హృదయంలో స్పష్టంగా ప్రతిబింబించగలుగుతాం. అలాంటి వ్యక్తులలో దైవిక గుణాలన్నీ ప్రస్ఫుటం అవుతూ ఉంటాయి. వారు నిత్యమైన, నిరామయమైన సదాశివుడి సాన్నిధ్యాన్ని పొందుతారు.



డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



దక్షిణ రాజగోపురం వద్ద ఫ్లోరింగ్‌కు మరమ్మతు చేసిన దృశ్యం

యాదగిరిగుట్టలో దిద్దుబాటు చర్యలు

» ఫ్లోరింగ్‌కు మరమ్మతు... 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

యాదాద్రి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో బయటపడ్డ నాణ్యతా లోపాలపై వైటీడీఏ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఆలయ దక్షిణ భాగంలోని ప్రాకార మండపం తిరువీధిలో 50 మీటర్ల మేర ఫ్లోరింగ్ రెండు అంగుళాల వరకు కుంగింది. ఈ ఘటనపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'యాదగిరిగుట్ట ఆలయంలో కుంగిన ఫ్లోరింగ్' శీర్షికన ఈ నెల 7వ తేదీన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఆలయంలోని దక్షిణ రాజగోపురానికి బయట భాగంలో ఫ్లోరింగ్ కుంగిన ప్రాంతానికి వైటీడీఏ అధికారులు మరమ్మతులు చేయించారు. ఆలయం కోసం వినియోగించే మ్యాట్లను, వంట చెరుకును ప్రాకార మండపం నుంచి తొలగించారు. రిటైనింగ్ వాల్‌కు ఒక చోట బండలు ఊడిపోవడంతో సిమెంట్‌తో సరిచేయించారు. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం లక్ష్మీనృసింహుడి దర్శనానికి వస్తుండటంతో ఆలయాన్ని శుభ్రపరిచి, తగిన ఏర్పాట్లు చేశారు.

ఓటుకు నోటు కేసు మళ్లీ వాయిదా!

» మరికొంత సమయం కోరిన ఇరు పక్షాలు

న్యూఢిల్లీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసు విచారణ సుప్రీంకోర్టులో మరోసారి వాయిదా పడింది. తాను నిర్దోషినని, కేసు నుంచి తప్పించాలని కోరుతూ జెరూసలేం మత్తయ్య తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. అతని పేరును తొలగించింది. దాన్ని సవాలు చేస్తూ 2016 జూలై 6న తెలంగాణ ఏసీబీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్ గురువారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ కేసులో మరికొంత సమయం కావాలని ఇరుపక్షాలు విన్నవించడంతో.. కేసు విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

వాస్తు పిచ్చితో సచివాలయంలో మార్పులు: హరీశ్

హైదరాబాద్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త సచివాలయ భవనాన్ని నిర్మిస్తే వాస్తుపిచ్చి అంటూ నాడు గాయ్ గత్తర చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రిగా అదే చోట పూటకో మార్పు చేస్తున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సచివాలయానికి వాస్తుదోషం పేరిట ఒక్కగేట్ మార్పు చేసేందుకు రూ.4కోట్లు ఖర్చు పెడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో గ్రీన్‌టెక్నాలజీ, ఫైర్ సేఫ్టీ నిబంధనలతో దీన్ని నిర్మించామని, వాస్తు పిచ్చితో సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయానికి మార్పులు చేస్తున్నారని హరీశ్‌రావు చెప్పారు.

ఇంటర్ బోర్డులో క్వశ్చన్ బ్యాంక్ మిస్?

» కల్పిత ప్రచారమన్న బోర్డు

ఇంటర్ ప్రశ్నపత్రాల రూపకల్పనలో తప్పిదాలు చోటుచేసుకుండా ఉండేందుకు ఉపయోగపడే క్వశ్చన్ బ్యాంక్ మిస్సయ్యిందా? ప్రస్తుతం ఇదే అంశం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ప్రశ్నపత్రాల తయారీలో ఈ క్వశ్చన్ బ్యాంకునే ప్రామాణికంగా చేసుకొని ప్రశ్నలు ఇస్తారు. ఈ క్వశ్చన్ బ్యాంక్ మిస్ అయితే ఆ ప్రభావం ప్రశ్నపత్రాల తయారీపై ఉంటుందని పలువురు చెబుతున్నారు. దీనిపై ఇంటర్‌బోర్డు స్పందించింది. క్వశ్చన్ బ్యాంక్ మిస్సయిందనే వార్తలో వాస్తవంలేదని, ఇది కల్పిత ప్రచారమని కొట్టిపారేసింది.

బొక్కలో ఎవరిని వేయాలి జగన్!?

'ఆంధ్రజ్యోతి'పై జగన్ ఫేక్ స్టేట్‌మెంట్

కడప ఎస్పీకి భారతి ఫోన్ చేసినట్లు.. ఫేక్ న్యూస్ ప్రచురించారని అక్కసు

రాధాకృష్ణను బొక్కలో వేయాలని డిమాండ్.. లేని వాక్యాలు ఉన్నట్లు జగన్ వ్యాఖ్యానం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణను బొక్కలో ఎయ్యాలంట! ఎందుకంటే... ఆంధ్రజ్యోతి ఫేక్ న్యూస్ వేసిందట... ఇది మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉవాచ! బుధవారం రాత్రి నిద్రలో ఏం కలకన్నారో తెలియదు కానీ... గురువారం ఉదయాన్నే జగన్ ఈ 'ఫేక్' మాటలు చెప్పారు. ఎప్పట్లాగానే తన భజన బృందంలాంటి మీడియా ప్రతినిధులతో గురువారం ఆయన మాట్లాడారు. "ఆంధ్రజ్యోతిలో ఈరోజు పొద్దున రాసినట్టున్నారు.. కడప ఎస్పీకి నా భార్య ఫోన్ చేసిందని! అది ఫేక్ న్యూస్ కదా మరి! ఆంధ్రజ్యోతి రాధాకృష్ణను బొక్కలో వేస్తున్నారా మరి! ఎయ్యాలి కదా మల్లా!" అని పోలీసులను ప్రశ్నించారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త, భారతీ రెడ్డి పీఏ, అవినాశ్ రెడ్డి అనుచరుడైన వర్రా రవీంద్రారెడ్డి 'గ్రేట్ ఎస్కేప్'పై 'ఆంధ్రజ్యోతి' గురువారం సవివరమైన కథనం ప్రచురించింది. ఇందులో ఎక్కడా 'కడప ఎస్పీకి భారతీ రెడ్డి ఫోన్ చేశారు' అనే వాక్యమే లేదు. పత్రికలో ప్రచురితమైన ప్రతి అక్షరం అందరికీ ఒకేలా కనిపించింది. రవీంద్రా రెడ్డి భారతీ రెడ్డి పీఏగా పని చేశారని మాత్రమే 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించింది. అది 'ఫేక్' కాదు. ముమ్మాటికీ నిజం. కానీ... జగన్మోహన్ రెడ్డికి మాత్రం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించని, ఎవరికీ కనిపించని వాక్యాలు కనిపించాయి. ఆయన అంతటితో ఆగలేదు. 'ఆంధ్రజ్యోతి'పైనా, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాధాకృష్ణపైనా అక్కసు వెళ్లగక్కారు. పత్రికలో రాయని వాక్యాలు ఎలా కనిపించాయో, తన ఊహల్లో మెదిలిన వాక్యాలకు రాధాకృష్ణ ఎలా బాధ్యుడో జగనే తెలియాలి! 'ఫేక్ న్యూస్ వేసినందుకు రాధాకృష్ణను బొక్కలో వేయాలి' అంటూ ఫేక్ స్టేట్‌మెంట్ ఇచ్చిన జగన్‌ను కదా బొక్కలో వేయాలి! ఈ ప్రెస్‌మీట్‌కు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులనూ పిలిచి ఉంటే... విషయం అక్కడే తేలిపోయేది. కానీ... చెప్పింది వినే మీడియా ప్రతినిధులతోనే ఆయన మాట్లాడతారు. సీఎంగా ఉన్నపుడూ అంతే, ప్రతిపక్షంలోకి వచ్చాకా అంతే! గత టీడీపీ ప్రభుత్వంలో డీఎస్పీల పదోన్నతులకు కులం ఆపాదించడంతో మొదలుకుని 'నారాసుర రక్త చరిత్ర'ను దాటుకుని... తాజాగా విజయవాడ వరద సాయంపై తప్పుడు లెక్కల దాకా ఫేక్ న్యూస్ రాసింది, రాసేది జగన్ రోత పత్రికే! మరి... బొక్కలో వేయాల్సింది ఎవరిని... జగన్!

వైసీపీ సైకోలకు వాత ఖాయం!

కొవ్వు ఎక్కువై జనం మీద పడ్డారు.. ఆంబోతుల్లా ఆడబిడ్డలపై పడితే ఊరుకోను

» చట్టపరిధిలోనే కఠిన చర్యలు

» ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు



గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఇష్టారాజ్యంగా దాడులు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? భావ ప్రకటన స్వేచ్ఛ పేరిట ఇలాంటి వాళ్లను సహించాలా? అని ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి.. చట్ట పరిధిలోనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీలో వైసీపీ సోషల్ మీడియా మూకల ఆట కట్టించి తీరుతామని స్పష్టంచేశారు. శాంతిభద్రతలు, సోషల్ మీడియా సైకోలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనితతో గురువారం విడివిడిగా జరిపిన సమీక్షల్లో ఈ అంశాలపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "వైసీపీ సోషల్ మీడియా మూకలు అడ్డూఅదుపు లేకుండా చెలరేగిపోతున్నాయి. వాళ్లకు కుటుంబాలు లేకపోవచ్చు. మనకు కుటుంబాలు ఉన్నాయి. గౌరవంగా బతకాలనుకుంటున్నాం. అలిపిరిలో 24 క్లైమోర్ మైన్లు పేలినా లెక్కచేయని నేను అసెంబ్లీలో నా భార్య గురించి మాట్లాడినప్పుడు కన్నీళ్లు పెట్టుకున్నా.. నా గురించి, హోంమంత్రి అనిత గురించి, ఉప ముఖ్యమంత్రి పవన్ గురించి, ఆయన పిల్లల గురించి, న్యాయమూర్తుల కుటుంబాల గురించి విచ్చలవిడిగా పోస్టులు పెడుతుంటే.. చూస్తూ ఊరుకోవాలా.. ఊరుకునే ప్రసక్తే లేదు. వైసీపీకి వాత పెట్టడం ఖాయం. రౌడీలు, గూండాలు ఏ ముసుగులో వున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదు!' అని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఆంబోతుల మాదిరిగా ఆడబిడ్డలపై ఇష్టానుసారం మాట్లాడితే ఏ ఒక్కరినీ విడిచిపెట్టబోమని హెచ్చరించారు. ఒక్క సీటు కూడా గెలవడానికి వీల్లేని వ్యక్తులు వైసీపీ వాళ్లని, అసలు రాజకీయాల్లోనే ఉండకూడని వ్యక్తులని ధ్వజమెత్తారు. వ్యక్తులు, కుటుంబాలను లక్ష్యంగా చేసుకుంటే చర్యలు తప్పవన్నారు. వైసీపీ నేతల ఇళ్లలో ఆడబిడ్డలు కూడా స్పందించాలనీ, ఆ పార్టీలో తమ కుటుంబ సభ్యులు ఉండడం సబబేనా అనేది ఆలోచించుకోవాలన్నారు. పోలీసులపై నేరస్థులు పైచేయి సాధిస్తే పరిణామాలు ఇలానే ఉంటాయన్నారు. నేరస్తులపై పోలీసులు పైచేయి సాధిస్తేనే వారు అదుపులో ఉంటారని, పోలీసుల గౌరవం పెరుగుతుందని హితవు చెప్పారు.

నేనూ సోషల్ సైకోల బాధితురాలినే

» వైఎస్‌ఆర్‌కు పుట్టలేదని నన్ను అవమానించారు

» నాపైన, అమ్మ, సునీతపై పోస్టులు పెట్టారు

» వారు భయపడేలా చర్యలుండాలి: వైఎస్ షర్మిల

అమరావతి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'కొంతమంది సైకోలు, సైకో పార్టీలతో కలసి ఉచ్చం నీచం లేకుండా సోషల్ మీడియాను భ్రష్టు పట్టించారు. మానవ, రక్త సంబంధాలు మరిచి మృగాల లెక్క మారారు. అలాంటి సోషల్ సైకోల బాధితుల్లో నేనూ ఒకరిని' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. గురువారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. సైకో వర్రా రవీంద్రారెడ్డి అరెస్టును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 'సోషల్ మీడియాలో సైకోలు... మహిళలు అనే జ్ఞానం లేకుండా ఇంట్లో తల్లి, అక్క, చెల్లి కూడా సాటి మహిళే అనే ఇంగితం లేకుండా, రాష్ట్రంలో ప్రశ్నించే మహిళలపై అసభ్యకరమైన పోస్టులు పెట్టి, వికృత చేష్టలతో రాక్షసానందం పొందారు. ప్రతిష్ఠ దెబ్బతినేలా పోస్టులు పెట్టి, పైశాచికానందం పొందే సైకోలపై కఠినంగా చర్యలు ఉండాలి. నా మీద, మా అమ్మ మీద, సునీత మీద విచ్చలవిడిగా పోస్టులు పెట్టారు. నేను, వైఎస్ రాజశేఖరరెడ్డికి పుట్టలేదని అవమానించారు. నా ఇంటి పేరు మార్చి శునకానందం పొందారు. నాపై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రారెడ్డిపై నేను కూడా పోలీసు కేసు పెట్టాను. అరాచక పోస్టులు పెట్టేవాళ్లు ఏ పార్టీలో ఉన్నా అంతు చూడాల్సిందే. వాళ్లు భయపడేలా చర్యలు కొనసాగాలి' అని షర్మిల పేర్కొన్నారు.


నా కుమార్తె కన్నీళ్లు చూసే.. | నేనూ ఫేక్ న్యూస్ బాధితురాలినే..

ఏపీ డిప్యూటీ సీఎం పవన్, హోంమంత్రి అనిత మాటామంతి

శాంతిభద్రతలు, సోషల్‌సైకోలపై సీఎం చంద్రబాబు సమీక్షకు హాజరు



అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'నా కుమార్తె కన్నీళ్లు చూసే అలా మాట్లాడానమ్మా'....' నేను కూడా ఫేక్ న్యూస్ బాధితురాలినే సర్..' రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మధ్య ముఖ్యమంత్రి కార్యాలయంలో గురువారం జరిగిన చర్చ ఇది. రాష్ట్రంలో చెలరేగిపోతున్న సోషల్ మీడియా సైకోలు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంశాఖ మంత్రి అనిత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తోపాటు వారి కుటుంబ సభ్యులపైనా అనుచిత పోస్టులు సోషల్ మీడియాలో పెడుతున్నారు. వారి ఆగడాలు భరించలేని పవన్ కల్యాణ్.. ఇటీవల పిఠాపురం పర్యటనలో పదునైన వ్యాఖ్యలు చేశారు. హోంమంత్రి కఠినంగా వ్యవహరించక పోతే తానే హోంశాఖ తీసుకుని ఉత్తరప్రదేశ్‌లో బుల్డోజర్ తరహా చర్యలకు ఉపక్రమిస్తానని అనడంతో జాతీయ స్థాయిలో పవన్ వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ ఇదే అంశం ప్రముఖంగా చర్చకు వచ్చింది. ఈ నేపథ్యంలో నెల రోజుల్లో పోలీసు శాఖను బలోపేతం చేస్తానని, తప్పు చేసిన వారిని ఉపేక్షించే ప్రసక్తేలేదని చంద్రబాబు అన్నారు. అన్నట్టుగానే సోషల్ మీడియా సైకోల భరతం పట్టేందుకు ముఖ్యమంత్రి గురువారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రితో విడి విడిగా సమావేశమయ్యారు. అంతకుముందు.. పవన్ కల్యాణ్, అనిత కొద్దిసేపు విడిగా చర్చించుకున్నారు. తొలుత.. పవన్‌కల్యాణ్‌ను చూడగానే అనిత నమస్కరించి పలకరించారు. పవన్ ఆప్యాయంగా స్పందిస్తూ..."నా కుమార్తె కన్నీళ్లు చూసే అలా మాట్లాడానమ్మా.. వాళ్లు ఇంట్లో నుంచి బయటికి రావడానికే ఇబ్బంది పడుతున్నారు.." అని తెలిపారు. దీనిపై స్పందించిన అనిత... "నేను కూడా ఫేక్ న్యూస్ బాధితురాలినే సర్. నాపై దారుణమైన ట్రోలింగ్స్ చేశారు" అని వాపోయారు. "రాష్ట్రంలో చిన్నారు లు, మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలి. మీకు..మా ఇళ్లలో ఆడవాళ్లకే రక్షణ లేకపోతే ఇక సమాజానికి మనం ఏమి భరోసా ఇస్తాం?" అని పవన్ అన్నారు. ఆడబిడ్డలకు అన్యాయం జరిగితే ఊరుకునే ప్రసక్తేలేదనీ, హిందూపురం, కడప, చీరాల, తిరుపతి...ఎక్కడ జరిగినా గంటల్లోనే నిందితుల్ని అరెస్టు చేసినట్లు అనిత వివరించారు. అంతకన్నా ప్రమాదకరమైన సోషల్ సైకోలను ఉపేక్షిస్తే మొత్తం సమాజమే నాశనం అయ్యే ప్రమాదం ఉందని పవన్ పేర్కొన్నారు. దీనిపై అనిత స్పందిస్తూ.. "మీరు చెప్పిన దాంతో విభేదించను సర్.. సీఎం గారికి అన్నీ చెబుదాం. మనం ఏది మాట్లాడినా వివాదం చేస్తున్నారు" అంటూ పవన్ పిఠాపురం వ్యాఖ్యల్ని పరోక్షంగా గుర్తు చేశారు. కూటమి కలిసి ఉండకూడదనుకుని వారు ఏవేవో చేస్తుంటారని పవన్ వ్యాఖ్యానించారు. "కూటమి కలిసే ఉంటుంది.. వీళ్ల తాట తీస్తుందని మనం నిరూపిద్దాం" అంటూ పవన్ నవ్వుతూ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఆ తర్వాత సీఎం చంద్రబాబుతో వారు వేర్వేరుగా సమావేశమై.. రాష్ట్రంలో శాంతి భద్రతలు, సోషల్ మీడియాలో పెరిగిపోతున్న అరాచక పోస్టులపై చర్యల గురించి చర్చించారు.


HAPPY
Birthday
సినీ నిర్మాత, డైనమిక్ లీడర్
శ్రీ గొట్టిముక్కల పద్మారావు గారికి
హార్దిక జన్మదిన శుభాకాంక్షలు
Padma Priya Arts
Colour Bottles Productions



PAKKAA ENTERTAINER
FRIDAY FRAMEWORKS
నేడే
విడుదల
CHETAN MADDINENI
ధూం ధాం



నేడే
విడుదల
అప్పుడో
ఇప్పుడో
ఎప్పుడో
BVSN PRASAD SUDHEER VARMA


GALLA MANJUNATH PRESENTS
RADHAKRISHNAA PRODUCTION COMPANY
Releasing
Today
SATHISH BABU IN
జాతర
PRODUCED BY DWARAMPUDI RADHAKRISHNA REDDY
A FILM BY SATHISH BABU RATAKONDA


MSK PRAMIDHA SHREE FILMS
PRESENTS
నేడే
విడుదల
SHRI VISHNU GLOBAL MEDIA
డేరింగ్ స్టార్ క్రిష్ణసాయి
IN & AS
జ్యూయల్ థీఫ్
మీ నగలు జాగ్రత్త
మల్లెల ప్రభాకర్
పి.యస్. నారాయణ
ADITYA MUSIC


SVM
NOVEMBER
28th
WORLDWIDE RELEASE
IN THEATRES
శ్రీ శ్రీ శ్రీ
రాజావారు
VEGESNA SATISH
CHINTHAPALLI RAMARAO


INDIA'S PRIDE
MAJOR
SUCCESS
2ND
WK
THIS
IS
THE
FACE
OF
THE
INDIAN
ARMY
అమరన్


PEOPLE'S CHOICE
ROARING
2ND
WEEK
DIWALI
BLOCKBUSTER



● ఒకే ఫ్రేమ్‌లో ఐదుగురు హీరోలు!

మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున, మహేశ్‌బాబు, రామ్‌చరణ్, అఖిల్... ఇలా మూడు తరాలకు చెందిన ఐదుగురు హీరోలు ఒకే చోట చేరి విందు ఆరగిస్తున్న అరుదైన దృశ్యం ఇది. తెరపై సరే.. బయట ఇద్దరు స్టార్ హీరోలు కలిస్తే చూడ ముచ్చటగా ఉంటుంది. అటువంటిది ఇంతమంది హీరోలు.. ఇలా ఒక చోట కలవడం అందరికీ ఆనందాయకమైన విషయమే. వీరితో పాటు నమ్రత, ఉపాసన కూడా ఉన్నారు. ఓ వ్యాపారవేత్త పుట్టిన రోజు సందర్భంగా ఇలా హీరోలంతా కలసినట్లు సమాచారం. వీరి కలయికకు మాల్దీవులు వేదిక అయింది.

ఈ పాపం ఎవరిది?

» పది రోజులుగా తిండి లేక 8 వీధి కుక్కల మృతి

» మంచిర్యాల పశు సంరక్షణ కేంద్రంలో దారుణం

» కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మరో 12 శునకాలు



మంచిర్యాలలోని పశు సంరక్షణ కేంద్రం

మంచిర్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దొరికిందేదో తింటూ వీధుల్లో తిరిగే ఆ శునకాలు మునిసిపల్ సిబ్బంది కంటపడకుండా ఉంటే బాగుండేదేమో.. ప్రాణాలతో ఉండేవి ఎప్పట్లానే హాయిగా సంచరించేవి. కానీ వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించే సిబ్బంది చేతికి చిక్కి... తినడానికి తిండి దొరక్క ఆకలితో అలమటించి నరకయాతన అనుభవిస్తూ చచ్చిపోయాయి. ఇలా ఒకటి, రెండు కాదు.. మంచిర్యాల పశు సంరక్షణ కేంద్రంలో ఏకంగా ఎనిమిది వీధి కుక్కలు మృత్యువాత పడగా.. మరో 12 శునకాలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆ ఆస్పత్రి నుంచి భరించలేని దుర్వాసన వస్తుండడంతో ఈ దారుణం గురువారం తెలిసింది. అసలేం జరిగిందంటే... వీధి కుక్కలకు కు.ని ఆపరేషన్లు చేసేందుకు మంచిర్యాలలో ప్రత్యేకంగా ఓ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఇందులో ఓ ఆపరేషన్ థియేటర్, శస్త్రచికిత్స అనంతరం శునకాలను అబ్జర్వేషన్‌లో ఉంచేందుకు మరో గది ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన యానిమల్ వెల్ఫేర్ సొసైటీ.. మునిసిపాలిటీ నిర్వహించిన టెండరు ప్రక్రియలో ఆస్పత్రి నిర్వహణ బాధ్యతను దక్కించుకుంది. ఆస్పత్రిలో ఓ వెటర్నరీ వైద్యుడు, ఇద్దరు వెటర్నరీ అసిస్టెంట్లు, ఓ వాచ్‌మన్, హెల్పర్‌ను నియమించింది. ఆస్పత్రిలో రోజూ 15 శునకాలకు శస్త్రచికిత్సలు చేస్తుంటారు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం 20 శునకాలను సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. అయితే, సెప్టెంబరు, అక్టోబరు నెలల జీతాలు ఇవ్వకపోవడంతో సిబ్బంది తమ యాజమాన్యాన్ని నిలదీయగా డాక్టర్ మినహా అందరినీ పది రోజుల క్రితం ఉద్యోగం నుంచి తీసేశారు. అప్పట్నించి సిబ్బంది ఎవరూ ఆస్పత్రికి ఎవరూ రావడం లేదు. అప్పటికే ఆస్పత్రిలో ఉన్న శునకాలకు ఇదే శాపమైంది. ఆలనాపాలన చూసే వారు లేక, ఆకలితో అలమటించి ఎనిమిది కుక్కల వారం క్రితం చనిపోయాయి. మరణించిన శునకాల కళేబరాలు తొలగించే వారు కూడా లేకపోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వ్యాపించడంతో మూగ ప్రాణాల నరకయాతన బయటకు తెలిసింది. కాగా, ఈ విషయమై ఆస్పత్రి వైద్యుడిని సంప్రదించగా అతను బదులివ్వడం లేదు.

ఒద్దొద్దంటున్నా.. మళ్లీ ఆర్ఎంసీ!

రిజర్వాయర్ నిర్వహణ కమిటీ పునరుద్ధరణ

» కృష్ణా బోర్డు అత్యుత్సాహం

» తెలంగాణ విజ్ఞప్తులు బేఖాతరు

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరదల సమయంలో తరలించే నీటిని వినియోగం కింద లెక్కించొద్దనే ప్రధాన ఎజెండాపై చర్చించడానికి వీలుగా రిజర్వాయర్ నిర్వహణ కమిటీ (ఆర్ఎంసీ)ని పునరుద్ధరిస్తూ కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సంచలన నిర్ణయం తీసుకుంది. వరదల సమయంలో తరలించే ప్రతీ నీటిచుక్కను వినియోగం కిందే పరిగణించాలని పదేళ్లుగా తెలంగాణ చేస్తున్న విజ్ఞప్తికి పూర్తి విరుద్ధంగా.. ఈ అంశంపై చర్చకు బోర్డు నిర్ణయం తీసుకోవటం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో, గత ఆర్ఎంసీ తాలూకు అంశాలు ముందుకొస్తున్నాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో రూల్‌కర్వ్‌ను (ఏ సమయంలో ఎంత మేర నీటి నిల్వలు ఉండాలి అన్నదానిని) ఖరారు చేయడం, ఆయా ప్రాజెక్టుల్లో జలవిద్యుత్ ఉత్పాదన, మిగులు జలాలను ఏ విధంగా పరిగణనలోకి తీసుకోవాలనే అంశాలపై 2022 మే నెలలో ఆర్ఎంసీని ఏర్పాటు చేశారు. ఏడు నెలల పాటు పలు సమావేశాలు జరిగాయి. ముసాయిదా నివేదికను రూపొందిస్తున్న సమయంలో.. తెలంగాణ తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేసింది. దీంతో ఆర్ఎంసీ ఏర్పాటు లక్ష్యం విఫలమయిందని పేర్కొంటూ అప్పటి ఆర్ఎంసీ కన్వీనర్ రవికుమార్ పిళ్లై కృష్ణా బోర్డుకు నివేదిక ఇచ్చారు. తర్వాత.. మళ్లీ ఆర్ఎంసీని ఏర్పాటు చేయాలంటే తెలుగు రాష్ట్రాల ఏకాభిప్రాయం అవసరం. కానీ, తెలంగాణతో మాటవరసకైనా సంప్రదింపులు జరపకుండానే ఆర్ఎంసీని కృష్ణా బోర్డు తాజాగా పునరుద్ధరించటం వివాదంగా మారింది. అంతేకాకుండా, శుక్రవారం (ఈనెల 8వ తేదీన) ఆర్ఎంసీ సమావేశాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. ఏపీ విజ్ఞప్తితో ఈ సమావేశం వాయిదా పడినప్పటికీ కృష్ణాబోర్డు నిర్ణయం వివాదాస్పదంగా మారింది. ఆర్ఎంసీ ఎజెండాలో చేర్చిన మూడు అంశాలూ తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసేవేనని రాష్ట్ర అధికారులు మండిపడుతున్నారు. మూడు అంశాల్లో ముఖ్యమైనది.. వరదల సమయంలో జూరాల నుంచి ప్రకాశం బ్యారేజీ దాకా అన్ని రిజర్వాయర్లు నిండిన తర్వాత, ఆ నీటిని ఇరు రాష్ట్రాలు కిందికి తరలిస్తే, వాటిని వినియోగం కింద లెక్కించరాదు అనే అంశం. రెండోది.. శ్రీశైలం, సాగర్‌లలో జలవిద్యుత్ కేంద్రాల నిర్వహణ. మూడవది.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లపై కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) సిద్ధం చేసిన రూల్‌కర్వ్‌కు తుదిరూపు ఇవ్వడం. ఒకవైపు కృష్ణా జలాల పంపిణీపై ట్రిబ్యునల్ విచారణ ఢిల్లీలో జరుగుతుండగా.. ఆర్ఎంసీ సమావేశం ఉండనుందని బోర్డు చెప్పటం గమనార్హం.

ఎజెండా అంతా తెలంగాణకు వ్యతిరేకమే!

ఆర్ఎంసీలో చర్చించే ఎజెండా అంతా కూడా తెలంగాణకు వ్యతిరేకంగా ఉందని అధికారులు మండిపడుతున్నారు. ఏపీలో ఇటీవలి వరదల సమయంలో పోతిరెడ్డిపాడు నుంచి పెన్నా బేసిన్‌కు దాదాపు 210 టీఎంసీలకు పైగా జలాలు తరలించారని లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణలో మాత్రం ఈ విధంగా నీటి తరలింపునకు వీలుగా కృష్ణా నదిపై సరిపడా రిజర్వాయర్లు లేవు. దీనివల్లే వరదల సమయంలో ప్రతీ నీటి చుక్కను లెక్కించి, ఆయా రాష్ట్రాల వినియోగం ఖాతాలో వేయాలనేది తెలంగాణ వాదన. రాష్ట్రంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో రిజర్వాయర్లు సిద్ధంగా ఉన్నా... పంప్‌హౌస్‌లు, ప్రధాన కాలువల పనులే జరుగలేదు. పట్టుమని 50 టీఎంసీలను కూడా ఒడిసిపట్టుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు.. వరదల సమయంలో వినియోగాన్ని లెక్కించరాదని ఎజెండాలో పెడతారని అధికారులు అడుగుతున్నారు.

కన్వీనర్ వైఖరికి నిరసనగా లేఖ

2022 మేలో ఏర్పాటైన ఆర్ఎంసీ ఆరు సమావేశాలు నిర్వహించగా.. మూడు సమావేశాలకు తెలంగాణ హాజరు కాగా... ఏపీ ఐదుసార్లు హాజరైంది. ఈ సమావేశాల్లో శ్రీశైలం రూల్‌కర్వ్‌పై ఏకాభిప్రాయం కుదిరినట్లే కుదిరి... మొత్తం వ్యవహారం అడ్డం తిరిగింది. ఆర్ఎంసీ కన్వీనర్ వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తూ ఆర్ఎంసీ ముసాయిదాను అమలు కాకుండా నిలుపుదల చేయాలని కోరుతూ తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్‌కుమార్ 2022 డిసెంబరులో లేఖ రాశారు. లేఖ రాసిన మరుసటి రోజే కేఆర్ఎంబీ సభ్యుడు, ఆర్ఎంసీ మెంబర్ కన్వీనర్ రవికుమార్ పిళ్లై ఢిల్లీకి బదిలీ అయ్యారు. ఆర్ఎంసీ నిర్ణయాలను అమలులోకి తీసుకురావాలని పిళ్లై చేసిన ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. పలు సందర్భాల్లో ఆయన నేరుగా తెలుగు రాష్ట్రాల అధికారులను కలిసి ఆర్ఎంసీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 2022 డిసెంబరు 3వ తేదీన శ్రీశైలం నిర్వహణపై ఏకాభిప్రాయం కుదిరిందని తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలు, ఆర్ఎంసీ కన్వీనర్ కూడా ప్రకటించారు. కానీ, ఆ తర్వాత రెండు రోజులకే వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఏపీ ఆర్ఎంసీ ముసాయిదాపై సంతకాలు చేసింది. తెలంగాణ సంతకాలు చేసేందుకు నిరాకరించింది. ఇప్పుడు మళ్లీ ఆర్ఎంసీని పునరుద్ధరించడంతో వాతావరణం వేడెక్కే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

స్పీకర్ నిష్క్రియాపరత్వంపై న్యాయసమీక్ష చేయొచ్చు!

» అనర్హత పిటిషన్లపై కోర్టు జోక్యం చేసుకోవచ్చు

» ఫిరాయింపు ఎమ్మెల్యేలు పదవుల్లో ఉండడానికి అనర్హులు

» హైకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాదన

» '3 నెలల్లో తేల్చాలి' అని సుప్రీం చెప్పలేదు

» ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం, కడియం

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం స్పీకర్ తన ఎదుట ఉన్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోకుండా చూస్తూ ఊరికే ఉంటానంటే కుదరదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద హైకోర్టుకు తెలిపారు. స్పీకర్ నిష్క్రియాపరత్వంపై అన్ని దశల్లోనూ న్యాయ సమీక్ష చేపట్టవచ్చని.. అందులో భాగంగానే సింగిల్ జడ్జి సరైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి, కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా, దానిపై నిర్ణయం తీసుకోకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం.. అనర్హత పిటిషన్ల విచారణకు నాలుగు వారాల్లో షెడ్యూల్ ఇవ్వాలని, వాటిని స్పీకర్ ఎదుట ఉంచాలని.. పేర్కొంది. ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పు స్పీకర్‌ను బెదిరించేలా ఉందని.. స్పీకర్ అధికారాలపై న్యాయ సమీక్షకు అవకాశం లేదని పేర్కొంటూ అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. వాటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం గురువారం విచారణ కొనసాగించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. "స్పీకర్ తన ఎదుట పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లను పరిష్కరించకుండా ఐదేళ్లు గడిపేస్తానంటే కుదరదు. వీలైనంత వేగంగా వాటిని విచారించి, నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కైశం మేఘచంద్రసింగ్ తీర్పులో తగిన సమయం అంటే మూడు నెలలని సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొంది. స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి ముందు, తర్వాత కూడా న్యాయ సమీక్షకు అవకాశం ఉంది. స్పీకర్ చర్యలపై అన్ని దశల్లోనూ కోర్టులు జోక్యం చేసుకోవచ్చు. మరోవైపు అసెంబ్లీ కార్యదర్శికి ఈ అప్పీళ్లు దాఖలు చేసే అర్హత లేదు. సుప్రీం తీర్పు ఆధారంగానే సింగిల్ జడ్జి నిర్ణయం తీసుకున్నారు. చట్టవిరుద్ధంగా పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఒక్కరోజు కూడా పదవుల్లో కొనసాగడానికి వీల్లేదు" అని పేర్కొన్నారు. తెల్లం, కడియం తరఫున సీనియర్ న్యాయవాదులు దేశాయి ప్రకాశ్‌రెడ్డి, మయూర్‌రెడ్డి వాదనలు వినిపించారు. "స్పీకర్ అధికారాలకు సంబంధించి 'కిహోటో హోలోహాన్' తీర్పు ఇప్పటికీ శిరోధార్యంగా ఉంది. స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి ముందు ఎలాంటి న్యాయసమీక్షకు అవకాశం లేదు. స్పీకర్ తుది తీర్పు ఇచ్చిన తర్వాతే పరిమిత స్థాయిలో న్యాయసమీక్షకు అవకాశం ఉంటుంది. మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలన్న విషయాన్ని ఇటీవలి 'సుభాష్ దేశాయి' తీర్పు ధ్రువీకరించలేదు. వీలైనంత వేగంగా అని మాత్రమే సుప్రీంకోర్టు పేర్కొంది. స్పీకర్‌కు నిర్ణీత షెడ్యూల్ అంటే ఏదీ ఉండదు" అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాదనలు ముగియకపోవడంతో తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

కొడుకు డబ్బులివ్వడం లేదని తల్లి కిడ్నాప్

మహారాష్ట్రకు చెందిన ఓ కాంట్రాక్టర్ కిరాతకం

నిందితుల అరెస్టు, సురక్షితంగా ఇంటికి చేరిన వృద్ధురాలు



భీమాబాయిని బలవంతంగా కారులో ఎక్కిస్తున్న కాంట్రాక్టర్, అతడి అనుచరులు

వేములవాడ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తామిచ్చిన డబ్బును ఓ వ్యక్తి తిరిగివ్వడం లేదనే కోపంతో అతడి తల్లిని ఓ కాంట్రాక్టర్ అపహరించాడు. అతని ఇంట్లోకి చొరబడి వృద్ధురాలిని బలవంతంగా తన కారులో ఎక్కించాడు. తనకివ్వాల్సిన డబ్బు చెల్లించి ఆమెను తీసుకెళ్లమని ఆ కుటుంబానికి హుకుం జారీ చేశాడు. దీనిపై ఫిర్యాదు అందుకుని రంగంలోకి దిగిన పోలీసులు.. నిందితులను పట్టుకుని ఆ వృద్ధురాలిని సురక్షితంగా ఇంటికి చేర్చారు. మహారాష్ట్రకు చెందిన లాలు నాగోరావు దయా రంగలోడ్ కర్ణాటకలోని చెరుకు తోటలు కోసే పనుల కాంట్రాక్టు తీసుకుని కూలీల కోసం వేములవాడ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన పల్లపు శ్రీనివాస్‌ను సంప్రదించాడు. ఈ పనుల కోసం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కూలీలను మాట్లాడేందుకు మధ్యవర్తిగా వ్యవహరించిన శ్రీనివాస్ సదరు కాంట్రాక్టర్ నుంచి రూ.3.80 లక్షలు తీసుకున్నాడు. అయితే, కూలీలు పనులకు వెళ్లకపోవడంతో ఆ డబ్బు విషయంలో ఇరువురి మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో లాలూ, తన భార్య పంచతుల, మరో నలుగురితో కలిసి కొడుముంజలోని శ్రీనివాస్ ఇంటికి బుధవారం వచ్చారు. శ్రీనివాస్ ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో ఉండగా.. అతడి కుటుంబసభ్యులతో వాగ్వాదానికి దిగాడు. తొలుత శ్రీనివాస్ భార్యను తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా ఆమె తప్పించుకోవడంతో శ్రీనివాస్ తల్లి భీమాబాయిని ఎక్కించారు. నానమ్మను తీసుకెళ్లొద్దంటూ అడ్డుకున్న పిల్లలను తోసేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న వేములవాడ పోలీసులు .. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు రెండు బృందాలుగా మహారాష్ట్ర వెళ్లారు. నాందేడ్ సమీపంలో లాలు వాహనాన్ని గుర్తించి భీమాబాయిని రక్షించారు. లాలు, పంచతులను అరెస్టు చేశారు. మరో నలుగురు పరారయ్యారు.

తోపుడు బండి సాదిక్ అలీ కన్నుమూత

150కుపైగా గ్రంథాలయాలు నెలకొల్పడంలో ప్రధాన పాత్ర



సాదిక్ అలీ

కల్లూరు, హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తోపుడు బండి ద్వారా ఇంటింటికి సాహిత్యాన్ని పరిచయం చేసిన గ్రంథాలయ ఉద్యమకర్త, సీనియర్ జర్నలిస్టు షేక్ సాదిక్ అలీ (61) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఛాతీ నొప్పితో బాధపడుతున్న ఆయన మొదట ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చేరారు. బుధవారం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సాదిక్ స్వస్థలం ఖమ్మం జిల్లా కల్లూరు. ఉస్మానియా వర్సిటీలో ఎం.ఏ తెలుగు చదువుతున్న రోజుల్లో పీడీఎస్‌యూ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అదే సమయంలో 'ఉదయం' దినపత్రికలో పాత్రికేయ జీవితం ప్రారంభించారు. సాదిక్ జీవిత సహచరి ఉష ప్రస్తుతం తెలంగాణ వ్యవసాయశాఖలో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్నారు. తోపుడు బండి ద్వారా తెలుగు సాహిత్యాన్ని ఇంటింటికి పరిచయం చేసే వినూత్న ఉద్యమాన్ని 2014లో ప్రారంభించారు. ఆనాటి నుంచి తోపుడు బండి సాదిక్‌గా సాహిత్యాభిమానుల అభిమానాన్ని పొందారు. పుస్తకాలతో నిండిన తోపుడు బండి నెట్టుకొంటూ 'పల్లెకు ప్రేమతో' నినాదంతో వంద రోజుల్లో వెయ్యి కిలోమీటర్ల యాత్ర చేపట్టారు. తోపుడు బండి ఫౌండేషన్ ద్వారా ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని మారుమూల పల్లెల్లో 150కుపైగా గ్రంథాలయాలు నెలకొల్పడంలో ప్రధాన పాత్ర పోషించారు. మరికొన్ని గ్రంథాలయాలకు పుస్తకాలు అందించడంలో సహకరించారు. తన సొంత పట్టణం కల్లూరులో కరోనా సమయంలో అనారోగ్యానికి గురైన వందల మందికి అన్నదానం, వైద్య సహాయం అందించారు. సాదిక్ మృతి పట్ల పలువురు కవులు, రచయితలు సంతాపం ప్రకటించారు. సత్తుపల్లిలో ఇస్లాం ఆచారాల ప్రకారం సాదిక్ అలీ భౌతికకాయాన్ని ఖననం చేశారు.

జెట్ ఎయిర్‌వేస్ దుకాణం బంద్

లిక్విడేషన్‌కు 'సుప్రీం' అనుమతి • రుణదాతలకు రూ.350 కోట్లు

రిటైల్ వాటాదారులకు మొండిచేయి



న్యూఢిల్లీ: భారత విమానయాన రంగంలో మరో విమానయాన సంస్థ కథ ముగిసింది. పాతికేళ్ల పాటు ఒక వెలుగు వెలిగిన జెట్ ఎయిర్‌వేస్ కంపెనీ ఆస్తుల అమ్మకం ద్వారా తమ బకాయిల వసూలు కోసం ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్షియం దాఖలు చేసిన లిక్విడేషన్ పిటిషన్‌కు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం జెట్ ఎయిర్‌వేస్ పునరుద్ధరణ కోసం జలాన్ కల్‌రాక్ కన్సార్షియం (జేకేసీ) డిపాజిట్ చేసిన రూ.200 కోట్లను, రూ.150 కోట్ల పెర్‌ఫార్మెన్స్ బ్యాంకు గ్యారెంటీ (పీబీజీ)ని బ్యాంకులు స్వాధీనం చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. జెట్ ఎయిర్‌వేస్ పునరుద్ధరణ బిడ్‌లో నెగ్గిన జేకేసీ చెల్లించాల్సిన తొలి విడత మొత్తాన్ని పీబీజీ నుంచి సర్దుబాటు చేసుకోవాలని స్పష్టం చేసింది. కాగా జెట్ ఎయిర్‌వేస్ దివాలా ప్రక్రియకు సంబంధించి ఎన్‌సీఎల్‌ఏటీ ఇచ్చిన ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుపట్టింది. తమ తీర్పు ఇలాంటి కేసుల విచారణకు కనువిప్పుని ధర్మాసనం పేర్కొంది.

వాటాదారులకు రిక్త హస్తం

సుప్రీంకోర్టు తాజా తీర్పుతో జెట్ ఎయిర్‌వేస్ ఈక్విటీలో 19.29 శాతం వాటా ఉన్న 1.43 లక్షల మంది రిటైల్ ఇన్వెస్టర్లకు చిల్లిగవ్వ కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదు. 2019 ఏప్రిల్‌లోనే జెట్ ఎయిర్‌వేస్ మూతపడింది. అయినా ఈ షేర్లలో ట్రేడింగ్ జరుగుతోంది. ఎయిర్‌లైన్‌ను మళ్లీ టేకాఫ్ చేయించేందుకు జేకేసీ ముందుకు రావడంతో ఈ ఏడాది మార్చి 22న జెట్ ఎయిర్‌వేస్ షేరు బీఎస్ఈలో రూ.63.15 స్థాయిని తాకింది. తాజాగా సుప్రీం తీర్పుతో గురువారం కంపెనీ షేరు ధర 5 శాతం నష్టంతో రూ.34.04కి స్థాయికి చేరింది. మరోవైపు మార్కెట్ క్యాప్ రూ.386.69 కోట్లకు పడిపోయింది. ఐదు శాతం సర్క్యూట్ బ్రేకర్ లేకపోతే షేరు మరింత కుప్పకూలేది. గురువారం నాటి మార్కెట్ క్యాప్ ఆధారంగా చూస్తే రిటైల్ ఇన్వెస్టర్ల వాటా విలువ రూ.74.6 కోట్లుగా ఉంది.

మార్కెట్ల నుంచి డీలిస్టింగ్ ఖాయం కావడంతో ముందు ముందు జెట్ ఎయిర్‌వేస్ షేర్లు చిల్లిగవ్వకు కూడా కొరగావని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కంపెనీ ఈక్విటీలో రిటైల్ ఇన్వెస్టర్లకు 19.29 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కి 26 శాతం, ఎతిహాద్ ఎయిర్‌వేస్‌కు 24 శాతం, నరేశ్ గోయల్ కుటుంబం, ఇతరులకు మరో 25 శాతం వాటా ఉంది.

ఎన్‌సీసీ లాభంలో రెండింతల వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌సీసీ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏకంగా రెండింతలు వృద్ధితో రూ.174.79 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.86.49 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.4,746.40 కోట్ల నుంచి రూ.5,224.36 కోట్లకు పెరిగింది.

ఈ-కామర్స్ విక్రేతలకు ఈడీ షాక్

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజాలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్.. ప్రిఫర్డ్ విక్రేతల (వెండార్స్)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం షాకిచ్చింది. హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, పంచకుల, గురుగ్రామ్‌లలో వారికి చెందిన 15 కార్యాలయాల్లో సోదాలు జరిపింది. ఈ సోదాల్లో ఈడీ అధికారులు కొన్ని కీలక పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టాన్ని (ఫెమా) తుంగలో తొక్కి, ప్రిఫర్డ్ వర్తకుల ద్వారా ఈ సంస్థలు అడ్డగోలు డిస్కౌంట్లతో దేశంలోని చిన్న చిన్న వ్యాపారుల పొట్టకొడుతున్నాయని ఎప్పటి నుంచో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈడీ ఈ సోదాలు జరపడం విశేషం.

ఫేక్ ఈ-మెయిల్‌తో అడ్డంగా దొరికిన రిలయన్స్ పవర్

న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ అక్రమాలు ఆగడం లేదు. పీకల్లోతు అప్పుల్లో ఉన్నా కంపెనీ కొత్త ప్రాజెక్టుల కోసం పోటీపడుతోంది. 2,000/3,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న భారీ సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటు కోసం ఇటీవల ప్రభుత్వ రంగంలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) ఇటీవల బిడ్స్ ఆహ్వానించింది. ఈ బిడ్స్ సందర్భంగా రిలయన్స్ పవర్, రిలయన్స్ ఎన్‌యూ బీఈఎస్ఎస్ అనే తన అనుబంధ సంస్థ ద్వారా బిడ్ సమర్పించింది. ఈ బిడ్‌తో పాటు తమ కంపెనీకి ఎస్‌బీఐ నుంచి బ్యాంకు హామీ ఉందని చెబుతూ, దాన్ని నిజమనిపించేలా ఎస్‌బీఐ పేరు మీద ఈ-మెయిల్ పంపించింది. అయితే ఆ ఈ-మెయిల్ నకిలీ (ఫేక్)దని ఎస్ఈసీఐ తేల్చింది. దీంతో రిలయన్స్ పవర్, దాని అనుబంధ సంస్థలు మూడేళ్ల పాటు తాము ఫ్లోట్ చేసే ఎటువంటి బిడ్స్‌లో పాల్గొనకుండా నిషేధం విధించింది.

మార్కెట్లో ట్రంప్ ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో రెండు రోజుల భారీ లాభాల ర్యాలీకి అడ్డుకట్ట పడింది. బ్యాంకింగ్, ఆటో రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు గురువారం ఒక శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ 836.34 పాయింట్లు కోల్పోయి 79,541.79 వద్దకు జారుకుంది. నిఫ్టీ 284.70 పాయింట్ల నష్టంతో 24,199.35 వద్ద ముగిసింది.

ఫెడ్ రేటు 0.25% తగ్గింపు

న్యూయార్క్: అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మార్కెట్ అంచనాలకు తగ్గట్టుగానే మరో 0.25 శాతం తగ్గించింది. దాంతో ఫెడ్ రేట్ల శ్రేణి 4.50-4.75 శాతానికి తగ్గింది. ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడం వరుసగా ఇది రెండోసారి. గత సమీక్షలో అర శాతం తగ్గించింది.

బీఓఈ సైతం..

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ) సైతం ప్రామాణిక వడ్డీ రేటును 0.25 శాతం తగ్గించింది. దాంతో ప్రామాణిక రేటు 4.75 శాతానికి తగ్గింది. ఈ ఏడాదిలో బీఓఈ వడ్డీ రేట్లను తగ్గించడం ఇది రెండోసారి. ఈ ఆగస్టులోనూ పావు శాతం తగ్గించింది.

లీడ్ గ్రూప్ నుంచి టెక్‌బుక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎడ్‌టెక్ సంస్థ లీడ్ గ్రూప్.. టెక్‌బుక్ పేరుతో ఇంటరాక్టివ్ లెర్నింగ్ టూల్‌ను తీసుకువచ్చింది. సాంప్రదాయ పాఠ్యపుస్తకాలను పూర్తిగా ఇంటలిజెంట్ పుస్తక రూపంలో టెక్‌బుక్ ద్వారా అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు సుమిత్ మెహతా తెలిపారు. మూడు కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీలు.. అగ్‌మెంటెడ్ రియాల్టీ, పర్సనలైజ్డ్ రీడింగ్ ఫ్లూయెన్సీ, పర్సనలైజ్డ్ ప్రాక్టీస్ పేరుతో దీన్ని రూపొందించినట్లు ఆయన చెప్పారు. 3డీ విధానంలో విద్యార్థులు సులభంగా పాఠాలను అర్థం చేసుకోవచ్చన్నారు. యాప్ ద్వారా పాఠాన్ని స్కాన్ చేయటం ద్వారా విద్యార్థులు పాఠాలను అభ్యసించవచ్చని పేర్కొన్నారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈ టెక్‌బుక్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వందకు పైగా పాఠశాలల్లో టెక్‌బుక్ టూల్‌ను ఈ ఏడాది అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నట్లు సుమిత్ చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,560 ▼	72,000 ▼	1,02,000 ▼
ముంబై	76,780 ▼	70,331 ▼	90,369 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	565
వరంగల్	557	గోదావరి	560
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	125
వరంగల్	120	గుంటూరు	126
కరీంనగర్	120	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	120
కర్నూలు	120	నెల్లూరు	120
విశాఖపట్నం	111	అనంతపురం	120
గోదావరి	125		

దాతృత్వంలో మేటి నాడార్



రోజుకు 5.9 కోట్ల విరాళం • గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.2,153 కోట్ల దానం

- ఆ తర్వాత స్థానంలో అంబానీ
- సీఎస్ఆర్‌లో రిలయన్స్ టాప్
- ఎడెల్‌గివ్-హురున్ లిస్ట్ విడుదల

జాబితాలో 18 మంది తెలుగు రాష్ట్రాల వారు


న్యూఢిల్లీ: ప్రముఖ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్.. భారత దాతల జాబితాలో మరోసారి అగ్రస్థానంలో నిలిచారు. గురువారం విడుదలైన 'ఎడెల్‌గివ్-హురున్ ఇండియా ఫిలాంత్రఫీ లిస్ట్- 2024' ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో నాడార్ మొత్తం రూ.2,153 కోట్ల విరాళాలిచ్చారు. అంటే, రోజుకు సగటున రూ.5.9 కోట్లు దానం చేశారు. శివ్ నాడార్ ఫౌండేషన్ సంస్థల ద్వారా నాడార్, ఆయన కుటుంబం విద్య, సాంకేతిక సంబంధిత కార్యక్రమాలకు అధికంగా సాయం చేశారు. ఎడెల్‌గివ్-హురున్ దాతల జాబితాలో నాడార్ అగ్రస్థానంలో నిలవడం గత ఐదేళ్లలో ఇది మూడోసారి. ఈ లిస్ట్‌లోని మరిన్ని ముఖ్యాంశాలు..

- భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఫౌండేషన్ గత ఆర్థిక సంవత్సరంలో రూ.407 కోట్ల విరాళాలిచ్చింది. దాంతో అంబానీ ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. రూ.352 కోట్ల విరాళాలతో బజాజ్ కుటుంబం మూడో స్థానంలో ఉంది. ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా (రూ.334 కోట్లు), అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ (రూ.330 కోట్లు) టాప్-5లో చోటు దక్కించుకున్నారు.
- ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నందన్ నీలేకని (రూ.307 కోట్లు), తెలుగు తేజం కృష్ణ చివుకుల (రూ.228 కోట్లు), వేదాంత గ్రూప్ అధిపతి అనిల్ అగర్వాల్ (రూ.181 కోట్లు), సుస్మిత, సుబ్రతో బాగ్చీ (రూ.179 కోట్లు), రోహిణి నీలేకని (రూ.154 కోట్లు) టాప్ టెన్‌లోని మిగతా స్థానాల్లో నిలిచారు.
- దేశంలోని మహిళా దాతల్లో రోహిణి నీలేకని (నందన్ నీలేకని భార్య) అగ్రస్థానంలో ఉండగా.. సుస్మితా బాగ్చీ (రూ.90 కోట్లు), బయోకాన్ చైర్మన్ కిరణ్ మజుందార్ షా (రూ.85 కోట్లు) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు.
- ఆన్‌లైన్ బ్రోకరేజీ సేవల సంస్థ జీరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ (38 ఏళ్లు) దాతల జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు, తన సోదరుడు నితిన్ కామత్‌తో కలిసి ఆయన రూ.120 కోట్ల విరాళాలిచ్చారు.
- ఈ ఏడాది జాబితాలో మొత్తం 203 మందికి చోటు దక్కగా.. వారి మొత్తం విరాళాలు రూ.8,783 కోట్లుగా ఉన్నాయి. రెండేళ్ల క్రితంతో పోలిస్తే 55 శాతం అధికవి ఎది. జాబితాలోని వ్యక్తుల్లో 18 మంది రూ.100 కోట్లకు పైగా దానం చేయగా.. 30 మంది రూ.50 కోట్లకు పైగా, 61 మంది రూ.20 కోట్లకు పైగా విరాళాలిచ్చారు.
- కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల కోసం అత్యధికంగా ఖర్చు చేసిన కంపెనీల జాబితాలో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో నిలిచింది. 2023-24లో ఆర్ఐఎల్ ఇందుకోసం రూ.900 కోట్లు వెచ్చించింది. నవీన్ జిందాల్‌కు చెందిన జిందాల్ స్టీల్ అండ్ పవర్ (రూ.228 కోట్లు) ఆ తర్వాత స్థానంలో ఉంది.
- హురున్ దాతల జాబితాలో 18 మంది తెలుగువారికి చోటు దక్కగా.. కృష్ణ చివుకుల అగ్రస్థానంలో ఉన్నారు. ఐఐటీ మద్రాస్‌కు ఈ ఏడాది రూ.228 కోట్లు విరాళంగా ఇచ్చారు. చివుకుల 1970లో ఐఐటీ మద్రాస్ నుంచే ఎం.టెక్ పూర్తి చేశారు. ఏపీలోని బాపట్లలో పుట్టి పెరిగిన చివుకుల ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డారు. కాగా, మేఘా ఇంజనీరింగ్ (ఎంఈఐఎల్) ప్రమోటర్లు పీవీ కృష్ణా రెడ్డి, పీ పిచ్చి రెడ్డి ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు.

హురున్ దాతల జాబితాలోని తెలుగు రాష్ట్రాలవారు

ర్యాంక్	పేరు	కంపెనీ	విరాళం (రూ.కోట్లు)	ప్రాంతం
7	కృష్ణ చివుకుల	ఇండో ఎంఐఎం	228	ఒడెస్సా(అమెరికా)
40	పీవీ కృష్ణా రెడ్డి	ఎంఈఐఎల్	33	హైదరాబాద్
41	పీ పిచ్చి రెడ్డి	ఎంఈఐఎల్	32	హైదరాబాద్
62	జూపల్లి రామేశ్వర్ రావు	మై హోమ్	18	హైదరాబాద్
69	మురళి కే దివి	దివీస్ ల్యాబ్స్	17	హైదరాబాద్
78	పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి	అరబిందో ఫార్మా	15	న్యూజెర్సీ(అమెరికా)
113	బీ పార్థసారథి రెడ్డి	హెటెరో ల్యాబ్స్	10	హైదరాబాద్
135	సీ వెంకటేశ్వర్ రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	8	హైదరాబాద్
138	ఎస్ సుబ్రమణ్యం రెడ్డి	అపర్ణ కన్‌స్ట్రక్షన్స్	8	హైదరాబాద్
142	జీవీ ప్రసాద్	డాక్టర్ రెడ్డీస్	7	హైదరాబాద్
145	కే సతీశ్ రెడ్డి	డాక్టర్ రెడ్డీస్	7	హైదరాబాద్
165	మహిమ దాట్ల	బయోలాజికల్-ఈ	6	హైదరాబాద్
172	జుగ్‌రాజ్ జైన్, ప్రవీణ్ జైన్	గోల్డ్‌మెడల్	6	విజయవాడ
176	డీ. రాంరెడ్డి	స్నేహ ఫామ్స్	6	హైదరాబాద్
188	చావా సత్యనారాయణ	లారస్ ల్యాబ్స్	5	హైదరాబాద్
193	కృష్ణప్రసాద్ చిగురుపాటి	గ్రాన్యూల్స్ ఇండియా	5	హైదరాబాద్
196	పీ బ్రహ్మానందం	దేవి సీ ఫుడ్స్	5	విశాఖపట్నం
198	గంటా రామచంద్ర నాయుడు	జీఆర్ఎన్ కన్‌స్ట్రక్షన్స్	5	నెల్లూరు

స్పోర్ట్స్



అర్జున్ @ 2

చెన్నై: సంచలన ప్రదర్శనతో అదరగొడుతున్న తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి ప్రపంచ రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీ మూడో రౌండ్‌లో అలెక్స్ సరీనా (సెర్బియా)పై అర్జున్ గెలిచాడు. తెల్ల పావులతో ఆడిన ఇరిగేసి 37 ఎత్తుల్లో సరీనా ఆట కట్టించాడు. ఈ విజయంతో అర్జున్ 2805.8 లైవ్ రేటింగ్‌తో వరల్డ్ నెం:1 మాగ్నస్ కార్ల్‌సన్ (2831) తర్వాతి స్థానంలో నిలిచాడు. కాగా, చాలెంజర్స్ టోర్నీ మూడో రౌండ్‌లో పురానిక్‌తో గేమ్‌ను హారిక డ్రా చేసుకొంది.

హంపిక మరో డ్రా: ఫిడే మహిళల గ్రాండ్ ప్రీలో కోనేరు హంపి మరో గేమ్‌ను డ్రాగా ముగించింది. టైటిల్ రేసు నుంచి ఇప్పటికే అవుటైన హంపి.. గురువారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో అలెగ్జాండ్రా గోర్యాంచ్‌కినాతో పాయింట్ పంచుకొంది. స్టవ్‌రౌలా (గ్రీస్)తో గేమ్‌ను దివ్య డ్రాగా ముగించింది. 8 రౌండ్ల తర్వాత హంపి, దివ్య చెరి 4 పాయింట్లతో 5,6 స్థానాల్లో ఉన్నారు.

కుర్రాళ్లు కుమ్మేస్తారా?

జోష్‌లో యువ భారత్
ప్రతీకారం కోసం దక్షిణాఫ్రికా
నేటి నుంచి నాలుగు టీ20ల సిరీస్

రాత్రి 8.30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో...



ట్రోఫీతో కెప్టెన్లు మార్‌క్రమ్, సూర్య

డర్బన్: సుదీర్ఘ ఫార్మాట్‌లో చిత్తుగా ఓడిన టీమిండియా ఇప్పుడు ధనాధన్ పోరుపై దృష్టి సారించింది. టీ20 వరల్డ్‌కప్ చాంపియన్ హోదాలో.. అదే టోర్నీ ఫైనలిస్టు దక్షిణాఫ్రికాతో నాలుగు టీ20ల సిరీస్‌కు సిద్ధమైంది. నేడు ఇరు జట్ల మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. అయితే పూర్తి స్థాయి జట్టుతో కాకుండా సూర్యకుమార్ నేతృత్వంలోని భారత్.. యువ ఆటగాళ్లతో బరిలోకి దిగనుంది. ఇటీవలి టెస్టు సిరీస్‌లో తమ సీనియర్లకు న్యూజిలాండ్ చేతిలో ఎదురైన దారుణ పరాభవాన్ని కుర్రాళ్లు మరిపించాలనుకుంటున్నారు. బౌన్సీ పిచ్‌లపై అటు బౌలర్లు.. ఇటు బ్యాటర్లు రాణిస్తూ ప్రస్తుతం సంధి దశలో ఉన్న భారత్ తరఫున తమ బెర్త్‌లను ఖాయం చేసుకోవాలనుకుంటున్నారు. అటు తొలి వరల్డ్‌కప్ దక్కకుండా చేసిన భారత్‌పై ఈసారి మాత్రం పైచేయి సాధించాలన్న కసితో ఆతిథ్య దక్షిణాఫ్రికా ఉంది. కానీ తమ చివరి ఆరు టీ20 మ్యాచ్‌ల్లో ఐదింటిని ఓడిన ఈ జట్టు ఏమేరకు పోటీనిస్తుందో చూడాల్సిందే. భారత్ మాత్రం ఆడిన 12 మ్యాచ్‌ల్లో పది నెగ్గి ఓ మ్యాచ్‌ను టై చేసుకుంది. మరోవైపు భారత జట్టులోని 15మంది ఆటగాళ్లలో 11 మందిని ఐపీఎల్ జట్లు అట్టిపెట్టుకోవడం విశేషం.

ఓపెనర్లపై దృష్టి: ఓపెనర్లుగా సంజూ శాంసన్, అభిషేక్‌ల రాణింపుపై అందరి దృష్టీ నెలకొంది. వాస్తవానికి శాంసన్ ఆడిన 33 మ్యాచ్‌ల్లో ఎనిమిదిసార్లు మాత్రమే ఓపెనింగ్ చేశాడు. బంగ్లాతో తన చివరి మ్యాచ్‌లో 47 బంతుల్లో 111 రన్స్‌తో ఆకట్టుకున్నాడు. ఇక్కడ కూడా అదే రీతిన రాణిస్తే రెగ్యులర్ ఓపెనర్లు జైస్వాల్-గిల్‌లకు పోటీనివ్వడం ఖాయమే. ఈ స్లాట్ కోసం పోటీలో ఉన్న మరో ఓపెనర్ అభిషేక్ ఐపీఎల్‌లో అదరగొట్టినవాడే. కానీ అతడి రెండో టీ20లో శతకం తర్వాత మరో ఆరు మ్యాచ్‌ల్లో కనీసం 20 దాటలేకపోయాడు. తిలక్ వర్మ కూడా ఈ ఫార్మాట్‌లో రెగ్యులర్ బెర్త్‌ను ఆశిస్తున్నాడు. ఇక అర్ష్‌దీప్, అవేశ్, వైశాక్, యష్ దయాల్‌లతో కూడిన పేస్ విభాగం అనుభవలేమిగా కనిపిస్తోంది. ఇందులో వైశాక్, యష్‌లకు తొలిసారిగా చోటు కల్పించారు. ఆర్‌సీబీ రిటైన్ చేసుకున్న యష్‌కు చాన్స్ లభిస్తే ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. రమణ్‌దీప్ అటు మిడిలార్డర్‌లో హిట్టర్‌గానే కాకుండా మీడియం పేసర్‌గా సేవలందించగలడు. అలాగే అతడి ఫీల్డింగ్ కూడా జట్టుకు ఉపయుక్తమే.

పటిష్టంగానే..: తమ చివరి సిరీస్‌ల్లో ఐర్లాండ్, విండీస్‌లపై ఓటములు దక్షిణాఫ్రికా జట్టుపై ఒత్తిడిని పెంచాయి. దీంతో విజయాల జోష్‌లో ఉన్న భారత్‌ను కట్టడి చేయడం సవాల్ కానుంది. అయితే మిడిలార్డర్‌లో క్లాసెన్, మిల్లర్‌ల రాకతో బ్యాటింగ్ విభాగం పటిష్టమైంది. అలాగే వీరికి జతగా స్టబ్స్ ఉండనే ఉన్నాడు. మరోవైపు గాయాల నుంచి కోలుకున్న పేసర్లు జాన్సెన్, కొట్జీ జట్టులోకి రావడం ఉత్సాహాన్నిస్తోంది. కెప్టెన్‌గా మార్‌క్రమ్‌కు ఈ సిరీస్ గెలవడం అత్యవసరం కానుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: శాంసన్, అభిషేక్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్, రింకూ సింగ్, రమణ్‌దీప్, అక్షర్, బిష్ణోయ్, అర్ష్‌దీప్, అవేశ్.
దక్షిణాఫ్రికా: రికెల్టన్, హెన్‌డ్రిక్స్, మార్‌క్రమ్ (కెప్టెన్), స్టబ్స్, మిల్లర్, క్లాసెన్, క్రుగెర్, జాన్సెన్, కేశవ్, బార్ట్‌మన్, కొట్జీ.

పిచ్, వాతావరణం

కింగ్స్‌మీడ్ మైదానం అనూహ్య బౌన్స్, పేస్‌కు చిరునామా. ఈ సారి కూడా పేసర్లకే అనుకూలించడం ఖాయం. అలాగే ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టుకు విజయావకాశాలెక్కువ. ఇక్కడ తొలి ఇన్నింగ్స్ సగటు 153. ఆకాశం మేఘావృతంగా ఉండి చిరుజల్లులకు ఆస్కారం ఉంది.

రాధేష్ శతకం

హైదరాబాద్ 410 ఆలౌట్
రాజస్థాన్ 117/1

జైపూర్: రాహుల్ రాధేష్ (100) శతకంతో అదరగొట్టడంతో రాజస్థాన్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ భారీ స్కోరు చేసింది. ఆటకు రెండో రోజైన గురువారం ఓవర్‌నైట్ స్కోరు 261/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 410 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రాహుల్ సింగ్ (66), చామా మిలింద్ (48) రాణించారు. అజయ్ సింగ్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 117/1 స్కోరు చేసింది. లోమ్రోర్ (58 బ్యాటింగ్), అభిజిత్ (44 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు రాజస్థాన్ మరో 293 పరుగుల వెనుకంజలో ఉంది.

అయ్యర్ డబుల్ సెంచరీ

ముంబై 602/4 డిక్లేర్డ్
ఒడిశా 146/5

ముంబై:శ్రేయాస్ అయ్యర్ (233) ద్విశతకంతో చెలరేగడంతో.. ఒడిశాతో రంజీలో ముంబై 602/4 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. సిద్ధేశ్ లాడ్ (169 నాటౌట్), సూర్యాంశ్ షడ్గే (79 నాటౌట్) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ఒడిశా 146/5తో కష్టాల్లో పడింది.

ఐదు దేశాలతో పోటీ

ఒలింపిక్ బిడ్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారత్‌కు పోటీగా పలు దేశాలు గట్టిగానే ప్రయత్నిస్తున్నాయి. 2036లో జరిగే ఈ గేమ్స్ కోసం ఇప్పటికే భారత ఒలింపిక్ సంఘం అధికారికంగా ఐఓసీకి లేఖ రాసింది. మరోవైపు సౌదీ అరేబియా, కతార్, చిలీ, ఇండోనేసియా, తుర్కియే దేశాలు కూడా తమ ఆసక్తిని వ్యక్తపరిచాయి. ఇందులో భారత్‌కు సౌదీ, ఖతార్ నుంచి కాస్త గట్టి పోటీ ఎదురుకానుంది.

దబాంగ్ ఢిల్లీకో విజయం

ప్రో కబడ్డీ లీగ్

హైదరాబాద్: ప్రో కబడ్డీ లీగ్ సీజన్11లో దబాంగ్ ఢిల్లీ నాలుగు వరుసఓటముల తర్వాత విజయం రుచి చూసింది. గురువారం గచ్చిబౌలి స్టేడియంలో ఉత్కంఠభరితంగా సాగిన తొలి మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు బెంగాల్ వారియర్స్‌పై 33-30 తేడాతో నెగ్గింది. ఆ తర్వాత జరిగిన రెండో గేమ్‌లో హరియాణా స్టీలర్స్ 35-22 తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది.

ఆసియా నెం:1 షూటర్ ఇషా



న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన టీనేజ్ పిస్టల్ షూటర్ ఇషా సింగ్ ఆసియా నంబర్ వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకొంది. తాజాగా విడుదల చేసిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ర్యాంకింగ్స్‌లో ఇషా 1500 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో నిలిచింది. కాగా, భారత్‌కే చెందిన రిథమ్ సంగ్వాన్ 1200 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానం, సురభి రావు 896 పాయింట్లతో ఐదో ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నారు. పాకిస్థాన్ షూటర్ కిష్మాల తలత్ (1350) రెండో స్థానంలో దక్కించుకొంది.

రాహుల్ ఫట్.. జురెల్ హిట్


ధ్రువ్ జురెల్ (80)
రాహుల్ (4)

- ధ్రువ్ అర్ధ శతకం
- నెసర్‌కు 4 వికెట్లు
- భారత్-ఎ 161, ఆసీస్-ఎ 53/2
- రెండో అనధికార టెస్ట్

మెల్‌బోర్న్: కేఎల్ రాహుల్ తీరు.. అదే కథ.. అదే వ్యథ అన్నట్టుగా తయారైంది. తాజాగా ఆస్ట్రేలియా-ఎతో గురువారం ఆరంభమైన రెండో అనధికార టెస్ట్‌లో మరోసారి విఫలమయ్యాడు. కానీ, రాహుల్‌తోపాటే హడావుడిగా ఇక్కడకు వచ్చిన ధ్రువ్ జురెల్ (80) అర్ధ శతకంతో ఆదుకోవడంతో.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్-ఎ 161 పరుగులకు ఆలౌటైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. పేసర్ నెసర్ (4/27) దెబ్బకు కేవలం 11 పరుగులకే నాలుగు టాపార్డర్ వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్ రేసులో ఉన్న అభిమన్యు ఈశ్వరన్ (0)తోపాటు సాయి సుదర్శన్ (0)ను నెసర్ తొలి ఓవర్‌లోనే డకౌట్ చేసి గట్టి దెబ్బకొట్టాడు. ఇక రాహుల్ (4) నాలుగు బంతులే ఆడి బొలాండ్ బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచిచ్చాడు. పెర్త్ టెస్ట్‌లో ఓపెనర్ స్థానం కోసం పోటీపడుతున్న రాహుల్ అవుటైన తీరు చూస్తే.. మేనేజ్‌మెంట్ మరో ప్రత్యామ్నాయాన్ని వెదకాలేమో..! కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (4) కూడా స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన జురెల్.. క్లిష్టమైన వికెట్‌పై బంతిని గమనించి ఆలస్యంగా ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. అతడికి దేవ్‌దత్ పడిక్కల్ (26) నుంచి కొంత సహకారం అందింది. నితీశ్ కుమార్ (16)ను వెబ్‌స్టర్ (3/19) వెనక్కిపంపాడు. జురెల్‌ను మెక్‌స్వీనీ అవుట్ చేశాడు. అనంతరం వర్షం కారణంగా తొలి రోజు ఆటనిలిచే సమయానికి ఆసీస్-ఎ తొలి ఇన్నింగ్స్‌లో 17.1 ఓవర్లలో 53/2 స్కోరు చేసింది. మెక్‌స్వీనీ (14)ని ముకేష్.. బాన్‌క్రాఫ్ట్ (3)ను ఖలీల్ అవుట్ చేశారు.

క్వార్టర్స్‌లో కిరణ్ జార్జ్

ఇక్సాన్ (దక్షిణ కొరియా): కొరియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ కిరణ్ జార్జ్ క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ చి యు జెన్ (చైనీస్ తైపీ)ని 21-17, 19-21, 21-17 తేడాతో ఓడించాడు.

విశాఖలో సింధు అకాడమీ

తల్లిదండ్రులతో కలిసి భూమి పూజ

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణానికి స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు గురువారం భూమి పూజ చేసింది. అకాడమీ ఏర్పాటు నిమిత్తం ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం విశాఖపట్నంలోని పెదగదిలి జంక్షన్‌లో రెండెకరాలు కేటాయించింది. అయితే అదనంగా మరింత భూమి కావాలని సింధు కోరగా, ఆ తరువాత ప్రభుత్వం మరో ఎకరా కేటాయించింది. మొత్తం మూడెకరాల్లో అకాడమీ నిర్మాణానికి ఇటీవల భూమి చదును చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఆ స్థలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో సింధు.. సీఎం చంద్రబాబునాయుడును కలిసి సమస్యను వివరించింది. ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని, అక్కడే పనులు ప్రారంభించుకోవాలని సీఎం ఆమెకు సూచించారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌ను ఆ మేరకు తగిన సహకారం అందేలా చూడాలని ఆదేశించారు. కాగా తాము ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే పనులు చేపడుతున్నామని సింధు తండ్రి రమణ చెప్పారు. ఏడాదిలోగా అకాడమీ నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు.


తల్లిదండ్రులతో కలిసి భూమి పూజ చేస్తున్న పీవీ సింధు

రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం

- ఇప్పటికే 50 వేల పోస్టులను భర్తీ చేశాం
- సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూకు ఎంపికైనా రూ.లక్ష సాయం
- రాష్ట్రంలోనూ సివిల్స్ కోచింగ్ అకాడమీలు రావాలి: భట్టి

హైదరాబాద్/చిక్కడపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రకటించినట్లుగా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో గురువారం ఓ సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణను కొట్లాడి తెచ్చుకున్నది ఉద్యోగాల కోసమేనని అన్నారు. ఆ ఉద్యోగాల భర్తీలో భాగంగా ఇప్పటికే 50 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఉద్యోగాల భర్తీకి ప్రతి ఏటా వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ, ఇతర సమస్యలు తలెత్తకుండా పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిభాపాటవాలు ఉన్నప్పటికీ నిరుపేదలు, మధ్య తరగతి వర్గాల విద్యార్థులు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో నెగ్గలేకపోతుండడాన్ని గుర్తించి, వారికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని చెప్పారు. సివిల్ సర్వీసెస్ మెయిన్స్‌కు ఎంపికయ్యే రాష్ట్ర విద్యార్థులకు ఇంధన శాఖ తరఫున ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామన్నారు. మెయిన్స్‌ను సాధించి ఇంటర్వ్యూకు ఎంపికయ్యేవారికీ రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయించామని తెలిపారు. యూపీ క్యాడర్‌లో పని చేస్తున్నప్పటికీ ప్రాంతీయ అభిమానంతో తెలుగువారైన మోహన్‌రావు, అరుణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో యూపీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. తెలంగాణలోనూ పెద్ద సంఖ్యలో సివిల్స్ కోచింగ్ అకాడమీలు ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

కేంద్రం పత్తి దిగుమతుల్ని నిలిపేయాలి: దుద్దిళ్ల

కాటారం/మంథని, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం విదేశాల నుంచి పత్తి దిగుబడులను నిలిపివేసి, రైతులకు గిట్టుబాటు ధరలు అందించి ఆదుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో రెండు జిన్నింగ్ మిల్లుల ఆవరణలో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా, పెద్దపల్లి జిల్లా మంథనిలో కేడీసీసీ బ్యాంక్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో లక్షలాది ఎకరాల్లో పత్తి దిగుబడులు పెరుగుతున్నాయన్నారు. నాణ్యమైన పత్తి లక్షలాది టన్నుల నిల్వలున్నా కేంద్రం ఇతర దేశాల నుంచి దిగుమతులు చేసుకోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతోందన్నారు. తేమ శాతంపై సీసీఐ కఠినంగా వ్యవహరించకుండా రైతులపై ఉదారత ప్రదర్శించి పత్తిని కొనుగోలు చేసేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు.. కాంట్రాక్టు పనుల బిల్లులు చెల్లించకుండా సర్పంచులను రోడ్ల మీదకు తెచ్చిన బీఆర్ఎస్ పెద్దలు ఇప్పుడు వారి ముందుండి ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. పెండిగ్ బిల్లులతో వడ్డీలు పెరిగి అప్పులు తీర్చే మార్గం లేక 60 మంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడింది నిజం కాదా? అని ఆయన, బీఆర్ఎస్‌ను నిలదీశారు.

ప్రపంచ పర్యాటక కేంద్రంగా తెలంగాణ:జూపల్లి

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా తెలంగాణకు గుర్తింపు తెచ్చి పెద్ద సంఖ్యలో విదేశీ పర్యాటకులు తరలివచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. లండన్ వేదికగా మూడ్రోజుల పాటు జరిగిన వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటీఎం) ముగింపు వేడుకల్లో జూపల్లి మాట్లాడారు. పర్యాటక రంగం అభివృద్ధిలో అన్ని వర్గాలను భాగస్వాములు చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వివరించారు. తెలంగాణ పర్యాటక శాఖ నిర్వహించిన రోడ్ షో కార్యక్రమంలో తెలంగాణ ప్రవాసీయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధికి చేయూతనివ్వాలని ప్రవాసీయులను జూపల్లి కోరారు.

సీసీఐ సెంటర్లలో తనిఖీలు చేయాలి:తుమ్మల

రైతుల నుంచి పత్తి కొనుగోళ్ల కోసం జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటుచేసిన సీసీఐ సెంటర్లను మార్కెటింగ్ శాఖ, ప్రాంతీయ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేసి నివేదికను మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌కు ఏరోజుకారోజు పంపించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. పత్తి కొనుగోళ్లపై సెక్రటేరియట్‌లో గురువారం ఆయన సమీక్ష జరిపారు. వరి ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు పత్తి కొనుగోళ్లను కూడా పరిశీలించాలని సూచించారు. రైతులకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తూ, మేజర్ మార్కెట్ కమిటీలను ఆధునీకీకరించాలని అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు వెబ్ పోర్టల్‌లో సమాచారం అప్‌లోడ్ అవుతుందని, పత్తిని తిరిస్కరించిన కారణాలు కూడా పొందుపరుస్తామన్నారు. పత్తి విక్రయాల్లో సమస్యలు వస్తే 8897281111 వాట్సప్ నెంబర్‌కు చాట్ ద్వారా తెలపాలని మంత్రి రైతులకు సూచించారు.

కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలేంటీ!?

- మాజీ ఆర్డీవోను ప్రశ్నించిన ఈడీ

రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని నాగారంలో 42 ఎకరాల భూ వ్యవహారంలో మాజీ ఆర్డీవో, ప్రస్తుత డీఆర్‌వో వెంకటాచారి గురువారం ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ భూ వ్యవహారానికి సంబంధించి పలు అంశాలపై వెంకటాచారి నుంచి ఈడీ వివరాలు రాబట్టింది. అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్ ఏమని ఆదేశాలిచ్చారు? ఈ వ్యవహారంలో రాజకీయ నాయకుల జోక్యం ఎంత వరకు ఉంది? అనే కోణంలో వెంకటాచారిని ప్రశ్నించినట్లు సమాచారం.

నీలోఫర్‌లో నీళ్లు లేక నిలిచిపోయిన సర్జరీలు

- రెండు రోజులుగా నరకం చూస్తున్న రోగులు

మంగళ్‌హాట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నీలోఫర్ ఆస్పత్రిలో నీళ్లు లేక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు రోజులుగా బోర్లు పనిచేయకపోవడంతో సర్జరీలు నిలిచిపోయాయి. రాష్ట్రంలోనే చిన్న పిల్లల పెద్ద ఆస్పత్రిగా పేరుగాంచిన నీలోఫర్‌లో రెండు రోజుల క్రితం సంపు వద్ద ఉన్న బోర్ పాడవడంతో అత్యవసర విభాగంలోని ఐదంతస్తులకు నీటి కొరత ఏర్పడింది. ఈ భవనంలో పిడియాట్రిక్, పిడియాట్రిక్ సర్జరీ, గైనిక్ విభాగానికి సంబంధించి ప్రసవాల గదితోపాటు నిత్యం 25 నుంచి 30 సర్జరీలు జరిగే ఆపరేషన్ థియేటర్ ఉన్నాయి. రెండు రోజులుగా నీరందక నరకం చూసినట్లు రోగులు, రోగి సహాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు సకాలంలో స్పందించలేదని ఆరోపించారు. బయట నుంచి వాటర్ ట్యాంకర్లు తెప్పించి కొంత ప్రయత్నించినప్పటికీ ఇబ్బందులు తగ్గలేదని తెలిసింది. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో అధికారులు కాస్త ఆలస్యంగానైనా సమస్యను పరిష్కరించారని సమాచారం. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో కూడా ఇటీవల నీరందక సర్జరీలు వాయిదా వేశారు.

పీఎఫ్ చెల్లించని సంస్థపై కొరడా

- తల్వార్ మొబైల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సీజ్ చేసిన అధికారి
- డైరెక్టర్లపై కేసు.. ఒక డైరెక్టర్ జైలుకు తరలింపు

బర్కత్‌పురా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీఎఫ్ చెల్లించని ఓ ప్రైవేట్ సంస్థపై పీఎఫ్ రికవరీ ఆఫీసర్ కొరడా ఝుళిపించారు. సదరు సంస్థను సీజ్ చేయడంతోపాటు కేసు నమోదు చేసి ఒక డైరెక్టర్‌ను జైలుకు తరలించారు. సికింద్రాబాద్‌లో తల్వార్ మొబైల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ (హ్యుందాయ్ డీలర్‌షిప్ కూడా ఉంది)కు భరత్‌పూడి శ్రీనివాస్, సరల్ తల్వార్‌లు డైరెక్టర్లుగా ఉన్నారు. గత 15 ఏళ్లుగా సంస్థకు సంబంధించిన పీఎఫ్ మొత్తం రూ.1.23 కోట్లు చెల్లించడం లేదు. పలుమార్లు పీఎఫ్ అధికారులు నోటీసులు జారీ చేసినా.. సంస్థ డైరెక్టర్లు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బర్కత్‌పురలోని పీఎఫ్ రీజినల్ కార్యాలయం రికవరీ ఆఫీసర్ గురువారం ఈపీఎఫ్ ఎంపీ యాక్ట్-1952 ప్రకారం తల్వార్ మొబైల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సీజ్ చేశారు. అలాగే సంస్థ డైరెక్టర్లపై కేసులు నమోదు చేశారు. డైరెక్టర్ శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి చర్లపల్లి జైలుకు తరలించగా.. మరో డైరెక్టర్ సరల్ తల్వార్ పరారీలో ఉన్నారు. అతడిని త్వరలో పట్టుకుని జైలుకు తరలిస్తామని పీఎఫ్ రికవరీ ఆఫీసర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థలు, కంపెనీలు పీఎఫ్‌ను సకాలంలో చెల్లించకుంటే బ్యాంకు ఖాతాలను సీజ్ చేయడంతోపాటు ఆస్తులను జప్తు చేస్తామని రికవరీ ఆఫీసర్ హెచ్చరించారు.

సర్కారీ లాలన

- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రెష్‌ల ఏర్పాటు
- రెండున్నరేళ్లలోపు పిల్లల సంరక్షణే లక్ష్యం
- 'అంగన్‌వాడీ'ల తరహాలో నిర్వహణ
- త్వరలో నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ఇప్పటి వరకూ ప్రైవేటులో ఉన్నత వర్గాలకు మాత్రమే డే కేర్ సెంటర్లు అందుబాటులో ఉండగా.. సర్కారు ఆధ్వర్యంలో పేదల కోసం 'క్రెష్'లు ఏర్పాటు కానున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక వ్యవస్థనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రెండున్నరేళ్లలోపు పిల్లలను ఈ కేంద్రాల్లో చేర్చుకుంటారు. ఇందుకు సంబంధించి మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. రెండున్నరేళ్లలోపు పిల్లలున్న తల్లులు.. పనికి వెళ్లేందుకు అవకాశం ఉండదు. దాంతో వారు ఉపాధి కోల్పోవడమే కాకుండా.. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అయితే, పిల్లల కారణంగా మహిళలెవరూ ఉపాధి కోల్పోకూడదన్న ఉద్దేశంతో సర్కారు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఈ కేంద్రాల్లో ప్రధానంగా పిల్లల ఆలనాపాలనా చూసుకోవడం, సమయానికి భోజనం అందించడం, నిద్రపుచ్చడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు కృషి చేయనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల తరహాలోనే క్రెష్‌ల్లోనూ ఇద్దరేసి చొప్పున సిబ్బందిని నియమించనున్నారు. ఇప్పటికే కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో స్థలం ఉంటే అక్కడ, లేదంటే వేరే భవనంలో క్రెష్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. అంతేకాదు.. రెండున్నరేళ్లలోపు వయసున్న పిల్లల తల్లులనే సిబ్బందిగా నియమించే అవకాశాన్నీ పరిశీలిస్తున్నారు. ఆ వయసు పిల్లలకు ఏ సమయానికి ఏం ఆహారం అందించాలన్న అంశంపై అవగాహన ఉంటుందన్న అభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ జారీ కానుంది. ఆ తర్వాత సిబ్బందిని నియమించనున్నారు. ఈ కేంద్రాలు ఏర్పాటైతే.. రెండున్నరేళ్లలోపు పిల్లలున్న తల్లులు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పని చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, వారి ఉపాధికి ఇబ్బంది ఉండదని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'తో పేర్కొన్నారు.

మహిళల ఉపాధిని పెంపొందించడమే లక్ష్యం



6 నెలల నుంచి రెండున్నరేళ్లలోపు వయసున్న పిల్లల పర్యవేక్షణ కోసం 'క్రెష్'లను తీసుకురానున్నాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోజు వారీ పనికి వెళ్తే తప్ప పూట గడవని కుటుంబాలు, మహిళలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం. రెండు న్నరేళ్లలోపు వయసున్న పిల్లలను సంరక్షించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల.. ఆ పిల్లల తల్లులు పనికి వెళ్లేందుకు అవకాశం ఉ ంటుంది. తద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతారు. 'క్రెష్'లను అంగన్‌వాడీల తరహాలోనే నిర్వహిస్తాం. సిబ్బందినీ ప్రత్యేకంగా తీసుకుంటాం.

\- సీతక్క, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి

'మూసీ పునరుజ్జీవం'పై నేడు యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొంటారు. ఉదయం 11:30 గంటలకు వైటీడీఏ, ఆలయ అభివృద్ధి కార్యకలాపాలపై ప్రెసిడెన్షియల్ సూట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1:30 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి సంగెం దగ్గరకు చేరుకుంటారు. సంగెం నుంచి మూసీ నది పునరుజ్జీవ సంకల్ప యాత్రను ప్రారంభిస్తారు. మూసీ నది కుడి ఒడ్డున ఉన్న భీమలింగం వరకు దాదాపు 2.5 కిలోమీటర్లు, అక్కడి నుంచి తిరిగి ధర్మారెడ్డిపల్లి కెనాల్‌కట్ట వెంబడి సంగెం-నాగిరెడ్డిపల్లి రోడ్డు వరకు పాదయాత్ర చేసి, అక్కడ మూసీ పునరుజ్జీవ సంకల్ప రథంపై నుంచి సీఎం ప్రసంగిస్తారు. సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుంటారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. వలిగొండ మండలం సంగెం వద్ద భీమలింగానికి పూజలు నిర్వహించిన అనంతరం రేవంత్‌రెడ్డి పునరుజ్జీవ యాత్రను చేపడతారు. ఈ మేరకు భీమలింగం వరకు దారిని ఏర్పాటు చేశారు. గురువారం మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.హనుమంత్‌రావు, రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు, అధికారులు సంగెం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టినరోజును రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలతో పాటు అన్ని ఆదర్శ పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. దశాబ్దకాలం తర్వాత విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడానికి 40 శాతం మేర మెస్ చార్జీలు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు.



అరటి ఆకుపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రం వేసిన నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్



గాంధీభవన్‌లో 'ఒకే ఒక్కడు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

రేవంత్.. డైనమిక్ లీడర్!

- సీఎంపై రాసిన 'ఒకే ఒక్కడు' పుస్తకాన్ని ఆవిష్కరించిన టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్
- 'డైనమిక్ లీడర్' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం సోదరులు..

హైదరాబాద్/సరూర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, నిర్బంధాలతో పాలన చేస్తున్న కేసీఆర్‌పై పోరాడి ప్రజల్లో డైనమిక్ లీడర్‌గా రేవంత్ రెడ్డి గుర్తింపు పొందారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై టి.వేణుగోపాల్‌రెడ్డి, విజయార్కేలు రాసిన 'ఒకే ఒక్కడు' పుస్తకాన్ని గురువారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులో రాజకీయాల్లో విలక్షణ నేతగా రేవంత్ ఎదిగారన్నారు. శుక్రవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా 'ఒకే ఒక్కడు' పుస్తకాన్ని ఆవిష్కరించినట్టు తెలిపారు. పుస్తకాన్ని రచించిన వేణుగోపాల్‌రెడ్డి, విజయార్కేలను అభినందించారు. టీపీసీసీ నుంచి ముందుగా రేవంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నామని.. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు. మరోవైపు.. సీఎం రేవంత్ జీవితంపై బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'డైనమిక్ లీడర్' పేరుతో పుస్తకాన్ని ముద్రించారు. రేవంత్ సొంతూరు కొండారెడ్డిపల్లిలో ఆయన సోదరులు కృష్ణారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేవంత్ ప్రజా పాలనను జీర్ణించుకోలేక కొందరు ప్రభుత్వాన్ని అప్రదిష్ఠపాలు చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు.

సాగు భూముల

రిజిస్ట్రేషన్ల అధికారం డీటీల చేతికి!

(మొదటిపేజీ తరువాయి)

కొత్త చట్టం ద్వారా పరిష్కారాలు చూపనున్నారు. రాష్ట్రంలో 10,894 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. ప్రతి గ్రామంలో దాదాపు 200 మంది రైతులకు భూసమస్యలున్నాయి. వాటిని పరిష్కరించడంతోపాటు ఇంటి స్థలాలకు హక్కు పత్రాలు, భూదార్ జారీ అనే రెండు కొత్త అంశాలను కొత్త చట్టం ద్వారా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో ధరణిలో ఉన్న లోపాలను సవరించి.. అనంతరం శాస్త్రీయ పద్ధతిలో తాత్కాలిక భూఆధార్ కార్డులు మంజూరు చేస్తారు. ఆధునిక సాంకేతికత ఆధారంగా జియోఫెన్సింగ్ ఏర్పాటు చేసి భూదార్ కార్డులు ఇస్తే దేశంలో ఆ ఘనత సాధించిన తొలి రాష్ట్రం తెలంగాణ అవుతుంది. దీని వల్ల గ్రామాల స్థాయిలో హక్కుల రికార్డు తయారు అవుతుంది. 1948లో అమల్లో ఉన్న ఖస్రాపహాణీ మళ్లీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటు గురించి కూడా కొత్తచట్టంలో పొందుపరిచారు. గ్రామస్థాయి రెవెన్యూ ఉద్యోగుల నియామకం, అందుకు సంబంధించిన విధివిధానాలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

కారణాలు చెప్పాలి

మ్యుటేషన్‌ను నిలిపివేసే అధికారాన్ని తహసీల్దార్ల చేతిలో పెడితే ఉద్దేశపూర్వకంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తారనే అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో.. మ్యుటేషన్ ఆపివేస్తూ నిర్ణయం తీసుకుంటే అందుకు గల కారణాలను రాత పూర్వకంగా సంబంధిత అధికారులు తెలపాల్సి ఉంటుందని కొత్త చట్టంలో పేర్కొన్నారు. కాగా.. ఈ కొత్త చట్టంపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని ఆమోదించి, అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఈడీ విచారణకు.. మల్లారెడ్డి మెడికల్ కాలేజీ అధికారి

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి మెడికల్ కాలేజీ పరిపాలనాధికారి(అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్) సురేందర్ రెడ్డి గురువారం ఈడీ విచారణకు హాజరయ్యారు. పీజీ మెడికల్ సీట్ల అక్రమాల కేసులో తమ ఎదుట విచారణకు హాజరుకావాలని ఈడీ అధికారులు నోటీసులు జారీ చేయడంతో సురేందర్‌రెడ్డి గురువారం బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈడీ అధికారులు ఆయనను రాత్రి 9 గంటల వరకు విచారించారు. ఆయన నుంచి కీలక వివరాలను రాబట్టినట్లు తెలిసింది. 2016 నుంచి 2022 మధ్య కాలంలో మెడికల్ కాలేజీ ప్రవేశాల్లో అవకతవకలు జరిగినట్లు ఈడీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. పలు మెడికల్ సీట్లు అమ్ముకున్నారనే ఆరోపణలపై ఈడీకి ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టింది. గత ఏడాది జూన్‌లో మల్లారెడ్డి నివాసంతోపాటు మెడికల్ కాలేజీ, కార్యాలయాలపై ఈడీ సోదాలు జరిపిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. నాడు తమకు లభించిన సమాచారం ఆధారంగా సురేందర్‌రెడ్డికి నోటీసులిచ్చి, విచారించారు. ప్రధానంగా మెడికల్ సీట్ల బ్లాకింగ్ వ్యవహారంపై సురేందర్‌రెడ్డిని ప్రశ్నించారు. పీజీ సీట్లు కేటాయించిన రికార్డులు, బ్యాంకు స్టేట్‌మెంట్లను ఈడీ బృందం పరిశీలించినట్లు తెలిసింది. సురేందర్‌రెడ్డిని పూర్తిస్థాయిలో ప్రశ్నించిన అధికారులు.. అవసరమైతే మరోసారి తమ ఎదుట విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పి, పంపించారు. ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా మల్లారెడ్డికి నోటీసులు జారీచేసి, విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ రాష్ట్రాలు దివాలా



బీజేపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న కిషన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

చుక్కలు చూపిస్తోందని విమర్శించారు. తెలంగాణలో ఏడాది తిరక్కుండానే రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. బీఆర్ఎస్ సర్కారు దోపిడీ విధానానికి వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టబెడితే ఏ ఒక్క గ్యారెంటీని నిలబెట్టుకోలేక చతికిలబడిందని దుయ్యబట్టారు. పొయ్యి మీద నుంచి పెనంపై పడ్డట్టు తెలంగాణ ప్రజల పరిస్థితి ఉందన్నారు. బీజేపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో కిషన్‌రెడ్డి ప్రసంగించారు. జమ్మూకశ్మీర్ నుంచి తమిళనాడు వరకూ పలు రాష్ట్రాల్లో కొడుకు, అల్లుడు, బిడ్డ అంటూ కుటుంబపార్టీల రాజకీయాలు కొనసాగుతున్నాయని.. దీనికి బీజేపీ పూర్తి వ్యతిరేకమని.. ఇందుకు బీజేపీ శ్రేణులు గర్వపడాలన్నారు. తెలంగాణలో కేసీఆర్ హయాంలో రూ.7 లక్షల కోట్ల అప్పులు చేస్తే.. కాంగ్రెస్ హయాంలో ఏ భూములను తాకట్టు పెట్టి అప్పు తీసుకోవాలా అని చూస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం పూర్తి సహకారం

రాష్ట్రంలో 31 లక్షల సభ్యత్వ నమోదు పూర్తయిందన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చివరి గింజ వరకూ కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎన్నివేల కోట్లయినా ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధంగా ఉంటే ఇక్కడి ప్రభుత్వం మధ్యవర్తులు, మిల్లర్లు, దళారీలతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్న పరిస్థితి ఉందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకింత బాధ్యతారాహితంగా వ్యవహరిస్తుందో అర్థం కావడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతాయే తప్ప పనులు మాత్రం కనిపించవని ఎద్దేవా చేశారు. ఇదే సందర్భంగా.. మీడియాతో చిట్‌చాట్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణాలో భవిష్యత్తు బీజేపీదేనని స్పష్టం చేశారు. బీజేపీ లేకుండా తెలంగాణ రాజకీయం ఉండబోదన్నారు. బీఆర్ఎస్ చరిత్ర ముగిసిపోయిందని, కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని వ్యాఖ్యానించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో త్వరలో పర్యటిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు.

ఒకే దేశం- ఒకే ఎన్నిక సాహసోపేత నిర్ణయం: లక్ష్మణ్

ఒకే దేశం-ఒకే ఎన్నిక... ప్రధాని మోదీ సాహసోపేత నిర్ణయమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ తెలిపారు. బీజేపీ వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ.. దేశమంతా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు మోదీ కృతనిశ్చయంతో ఉన్నారని, దీనివల్ల వేల కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని, దేశ అభివృద్ధి వేగవంతమవుతుందని వివరించారు. రాహుల్‌గాంధీ సామాజిక న్యాయం గురించి మాట్లాడ్డమంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మండిపడ్డారు. రిజర్వేషన్లను, సామాజిక న్యాయాన్ని మొదటి నుంచీ కాంగ్రెస్ అడ్డుకుందని లక్ష్మణ్ ఆరోపించారు.

నాడు అర్హులు.. నేడు అనర్హులు

ఖమ్మం జిల్లాలో ఏడుగురు హిందీ ఉపాధ్యాయుల ఉద్యోగాల తొలగింపు

- విద్యార్హత సర్టిఫికెట్లు చెల్లవని నియామకం రద్దు
- 20 రోజులు విధులు నిర్వహించిన తర్వాత వేటు
- రాత్రికి రాత్రే ఆ స్థానాల భర్తీ



ఉద్యోగం కోల్పోయిన హిందీ పండిట్లు వీరే

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ కొలువులు పొందిన ఏడుగురు హిందీ పండిట్ల ఆశలు ఉద్యోగంలో చేరిన 20 రోజుల్లోనే అడియాశలయ్యాయి. విద్యార్హత సర్టిఫికెట్లు చెల్లవంటూ ఖమ్మం జిల్లాలో ఏడుగురు హిందీ ఉపాధ్యాయులను హఠాత్తుగా ఉద్యోగం నుంచి తొలగించారు. అంతేనా.. రాత్రికి రాత్రే వారి స్థానాలను వేరే ఉపాధ్యాయులతో భర్తీ చేసేశారు. అయితే, తమ సర్టిఫికెట్లను పరిశీలించి సీఎం చేతులమీదుగా నియామక పత్రాలు ఇప్పించినప్పుడు ఉద్యోగానికి అర్హులైన తాము ఇప్పుడు ఎలా అనర్హులం అయ్యామని.. బాధిత ఉపాధ్యాయులు వాపోతున్నారు.

అసలేం జరిగింది ?

ఖమ్మం జిల్లాలో మొత్తం 10 హిందీ ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నిర్వహించారు. మెరిట్ ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులైన 9 మందిని ఎంపిక చేశారు. 20 రోజులుగా వీరంతా తమకు కేటాయించిన పాఠశాలల్లో పాఠాలు కూడా చెబుతున్నారు. అయితే వీరిలో ఏడుగురు ఉపాధ్యాయులు సమర్పించిన ధ్రువపత్రాలు నిబంధనల ప్రకారం లేవనే కారణంతో వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ డీఈవో బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం పాఠశాలలకు విధులకు వెళ్లిన ఆయా హిందీ పండిట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందజేసిన ఉత్తర్వులు చూసి కుదేలైపోయారు. మయూరి నాగేశ్వరరావు (మధిర సీపీఎ పాఠశాల), సట్టు రామలింగయ్య (బనిగండ్లపాడు), షేక్‌నాగుల్‌మీరా (కందూరు జడ్పీహెచ్ఎస్), దోర్నాల లావణ్య, (చిలుకూరు జడ్పీహెచ్ఎస్), తాటికొండ నాగలక్ష్మి (పాలేరు జడ్పీహెచ్ఎస్), తాటికొండ శ్రీదేవి (రేమిడిచర్ల జడ్పీహెచ్ఎస్), మొండేటి వెంకటరత్నం (తుమ్మలపల్లి జడ్పీహెచ్ఎస్) ఉద్యోగాలు కోల్పోయారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ, మద్రాస్ నుంచి పొందిన డిగ్రీ సర్టిఫికెట్లు చెల్లవని అందుకే వారిని తొలగించినట్టు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఏ సంవత్సరం నుంచి పొందిన సర్టిఫికెట్లను అనుమతించడం లేదో స్పష్టత ఇవ్వడం లేదు. ధ్రువపత్రాల పరిశీలన సమయంలో అధికారులు అవగాహన లోపంతో వాటిని ధ్రువీకరించి, ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. కాగా, తొలగించిన ఉపాధ్యాయుల స్థానంలో కొత్తగా ఏడుగురిని నియమించి.. పోస్టింగ్‌లు కూడా ఇచ్చారు. అయితే, ఆయా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఎప్పుడు జరిగిందనే సమాచారంపై స్పష్టత లేదు.

వారి సర్టిఫికెట్లు చెల్లవు

హిందీ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో ఏడుగురి సర్టిఫికెట్లు నిబంధనల ప్రకారం లేవు. సర్టిఫికెట్ల పరిశీలనలో విద్యాశాఖ అధికారుల నుంచి తప్పిదం జరిగింది. అభ్యర్థులు సమర్పించిన డిగ్రీకి సంబంధించిన సర్టిఫికెట్లపై అనుమానాలు ఉండటంతో వాటిని తిరిగి పరిశీలించాం. అవి చెల్లవని తేలడంతో ఏడుగురిని ఉద్యోగాల నుంచి తొలగించాం. మళ్లీ సర్టిఫికెట్ల పరిశీలన చేసి.. వారి స్థానాల్లో కొత్తవారికి పోస్టింగ్‌లు ఇచ్చాం.

\- సోమశేఖర శర్మ, ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి

న్యాయపోరాటం చేస్తాం..

ఉద్యోగం కోల్పోయిన ఏడుగురు.. న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు. ధ్రువపత్రాల పరిశీలనలో తాము దక్షిణ భారత హిందీ ప్రచార సభ సర్టిఫికెట్లనే సమర్పించామని తెలిపారు. అప్పుడు వాటిని అనుమతించిన అధికారులు.. ఇప్పుడు చెల్లవని చెబుతూ తమను రోడ్డును పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.


జనహృదయనేతకు
జన్మదిన
శుభాకాంక్షలు
HAPPY
Birthday
Revanthanna
Dr చరణ్ కౌశిక్ యాదవ్
AB శ్రీనివాస్
కాప్పుల ప్రవీణ్ కుమార్
సామ రామ్మోహన్‌రెడ్డి
కుడని రవళి
తెలంగాణ పులిబిడ్డ నిన్ను మరువబోదు ఈ గడ్డ....
నీ మాటే తుపాకీ తూటా...ఇక సాగదు వేరేవాళ్ల ఆట...
నువ్వు ఉంటే నిశ్చింత... రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గౌ॥శ్రీ రేవంతన్న ఇవే మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు.
దామోదర్‌రావు అవేలి
TPCC State Official Spokesperson